ఆధునిక చిత్రకళా రీతులు
రూ॥150/-
పేజీలు:150

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

లెక్కింపు తరువాత వారం వరకూ ఇవిఎం, వివిప్యాట్ల వెరిఫై
జెఎన్‌యు స్టూడెంట్స్ నిరసన హింసాత్మకం..
రైతు నమోదు ప్రక్రియలో తెలంగాణ ముందంజ 05

సంపుటి 09, సంచిక: 90 | శనివారం | 28-02-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# లిక్కర్ కేసు కొట్టివేత

సరైన ఆధారాలు లేనందున నిందితులను విడుదల చేయాలని రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశం

## కేజ్రీవాల్, కల్వకుంట్ల కవితకు భారీ ఊరట

**కేజ్రీవాల్ విడుదల స్వాగతనీయం : డి.రాజా**

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా రాజకీయ ప్రకంపనలు సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఆయన డిప్యూటీ మనీశ్ సిసోడియా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, 20 మంది ఇతరులకు భారీ ఊరట లభించింది. ఈ కేసుపై తాజాగా విచారణ జరిపిన రౌస్ అవెన్యూ కోర్టు నిందితులు అందరిపైనా నమోదు చేసిన కేసులను కొట్టివేసింది. అభియోగాలు మోపబడిన 23మంది నిందితులకూ ఈ కేసు నుంచి విముక్తి లభించినట్లు తెలిపింది. లోతైన దర్యాప్తు జరుపకుండా, సరైన ఆధారాలు లేకుండా వీరి పేర్లు కేసులో చేర్చారని కోర్టు సిబిఐపై మండిపడింది. కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) ఈ కేసు న్యాయపరిశీలనను పూర్తిగా తట్టుకోలేకపోయిందని, పూర్తిగా అపఖ్యాతి పాలైందని ఢిల్లీ కోర్టు మందలించింది. ఈ కేసులో క్లీన్‌చిట్ ఇచ్చిన 21మందిలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఉన్నారు. రికార్డుల్లో ఉంచిన విషయం నిందితుల్లో ఎవరిపైనా కేసు ప్రాథమిక విచారణలోనూ తీవ్రమైన అనుమానాన్ని కూడా వెల్లడించలేదని తేల్చిచెప్పడానికి ఈ కోర్టుకు ఎలాంటి సంకోచం లేదని, ఈ నేపథ్యంలో ఈ కేసులో 1నుంచి 23మంది నిందితులు ప్రస్తుతం కేసులో వారిపై ఉన్న అన్ని నేరాల నుంచి విముక్తి పొందారని ప్రత్యేక న్యాయమూర్తి జితేంద్ర సింగ్ చెప్పారు. ఇంతకుముందున్న తరువాయి 2లో



ఢిల్లీ కోర్టు తీర్పుతో కవితకు బిగ్ రిలీఫ్

## ఏప్రిల్ 25న కొత్త పార్టీ?

- వేగంగా పావులు కదుపుతున్న తెలంగాణ జాగృతి అధినేత్రి
- తీర్పును బిఆర్‌ఎస్ ఖాతాలో వేసుకునే యత్నాన్ని తిప్పికొట్టిన కవిత
- న్యాయం నావైపే ఉంటుందని ఆనాడే చెప్పానని వెల్లడి

ప్రజాపక్షం / హైదరాబాద్

ఎలాంటి ఆధారాలు లేవని తనపై కేంద్ర ప్రభుత్వ సంస్థలు మోపిన మద్యం కుంభకోణం కేసును ఢిల్లీలో సిబిఐ ప్రత్యేక కోర్టు కొట్టివేయడంతో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంఎల్‌సి కవిత, ఆమె అభిమానుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. తాను తప్పు చేయలేదని, తరువాయి 2లో

### బిఆర్‌ఎస్ ఓటమిని నా మెడలో వేయొద్దు

అప్పుడే కెసిఆర్ పెద్ద నాయకులు ఎందుకు మాట్లాడలేదు : కవిత

### మద్యం స్కాం వల్లే బిఆర్‌ఎస్‌కు రాజకీయంగా నష్టం : కెటిఆర్



## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో లొంగిపోయిన మావోయిస్టులు భేటీ

పునరావాస పథకాలు, భద్రత, ఉపాధి, కుటుంబాల సంక్షేమంపై చర్చ

ప్రజాపక్షం/హైదరాబాద్

దశాబ్దాలకుపైగా అజ్ఞతంలో ఉన్న తాము ఇక నుంచి ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రత్యక్ష రాజకీయల్లో వస్తామని ఇటీవల జనజీవన స్రవంతిలోకి వచ్చిన మాజీ మావోయిస్టు అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ శుక్రవారం సచివాలయంలో సిఎంను కలిసిన అనంతరం మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. దశాబ్దాల పాటు అడవిని నమ్ముకుని సాయుధ పోరాటం చేసిన మావోయిస్టు పార్టీ అగ్రనేతలు ఇప్పుడు ప్రజాస్వామ్య మార్గంలోకి అడుగుపెడుతున్నారు. కేంద్రం చేపట్టిన 'ఆపరేషన్ కగార్' చివరి అంకానికి చేరుకోవడంతో, కీలక నేతలు వరుసగా లొంగిపోతున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర పోలీసులకు లొంగిపోయిన ఆరుగురు మాజీ మావోయిస్టు నేతలు ఈరోజు సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవలే డిజిపి శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ, మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న, పోతుల కల్పన అలియాస్ సుజాత, బడే చొక్కారావు తరువాయి 2లో



## అతిపెద్ద రాజకీయ కుట్ర

- భావోద్వేగానికి గురైన ఆప్ నేత కేజ్రీవాల్
- లిక్కర్ కేసులో కేజ్రీవాల్‌కు లభించిన ఊరట

తనపై ఉన్న అవినీతి కేసు స్వతంత్ర భారత చరిత్రలోనే అతిపెద్ద రాజకీయ కుట్ర అని ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్ ఉద్వేగభరితంగా పేర్కొన్నారు, రాజకీయంగా సంచలనం సృష్టించిన మద్యం పాలసీ కేసులో శుక్రవారం ఢిల్లీలోని ఓ కోర్టు కేజ్రీవాల్‌ను విడుదల చేసింది. కోర్టు తీర్పు తరువాయి 2లో

## మార్క్ చేసిన చోటే చెత్త

- ప్రజల్లో మున్సిపల్ అధికారులు అవగాహన కల్పించాలి
- రాష్ట్రంలోని కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో పారిశుద్ధ్యం, దోమల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన 02

## బాధితులకు న్యాయం జరిగేదాకా పోరాటం చేస్తాం

- నోటీసులు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారు?
- పేదల ఇండ్ల తొలగింపు అమానవీయ చర్య
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- ప్రత్యామ్నాయ స్థలాల కేటాయింపే పరిష్కారమని సూచన

**వెలుగుమట్ల నిర్వాసితులకు పరామర్శ**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మంలో పేదల ఇండ్ల తొలగింపు అమానవీయ చర్య అని కనీసం నోటీసులు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. కొందరు అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, వితండవాదం చేస్తున్నారని పేదల పట్ల ఇలా వ్యవహరించడం సరైంది కాదన్నారు. శుక్రవారం వెలుగుమట్ల నిర్వాసితులు ఆశ్రయం పొందుతున్న టిటిడిసి, అంబేద్కర్ భవన్‌లోని తరువాయి 12లో

కొత్తగూడెం కార్పొరేషన్‌కు

## పాల్వంచ పేరు చేర్చాలి

ముఖ్యమంత్రికి కూనంనేని లేఖ

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పేరుని కొత్తగూడెం–పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్‌గా మార్చాలని కోరుతూ కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఇటీవల కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలతో పాటు సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీలను విలీనం చేసి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ నూతన కార్పొరేషన్‌కు కేవలం కొత్తగూడెం పేరు మాత్రమే ఉందని, దీనిలో పాల్వంచ పేరు కూడా చేర్చాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారని, వారి మనోభావాలను గౌరవిస్తూ పేరు మార్చాలని ఎమ్మెల్యే కోరారు. పాల్వంచకు ఘనమైన చరిత్ర ఉందని, గతంలో తరువాయి 2లో

## అంగన్‌వాడీల్లో అల్పాహారం

- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తాం
- అంగన్‌వాడీ భవన నిర్మాణాల్లో లోపాలు, నిర్లక్ష్యాలను ఉపేక్షించం
- మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క హెచ్చరిక



ప్రజాపక్షం/హైదరాబాద్

త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడి చిన్నారులకు బ్రేక్‌ఫాస్ట్ స్కీమును ప్రారంభిస్తామని మహిళా శిశు సంక్షేమ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి డాక్టర్ సీతక్క ధనసరి అనసూయ వెల్లడించారు. అంగన్‌వాడి భవన నిర్మాణాల్లో ఏదైనా లోపం, లేదా నిర్లక్ష్యం జరిగితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. పోషకాహార లోపాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. మధురనగర్‌లోనిమహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ పనితీరుపైన జిల్లా డిడబ్ల్యుఒలతో మంత్రి సీతక్క శుక్రవారం సమగ్ర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో టిజి ఫుడ్స్ చైర్మన్ ఫహీం, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతిఒజా, టిజి ఫుడ్స్ ఎండి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో బడ్జెట్ కేటాయింపులు, చేసిన ఖర్చులు, అమలవుతున్న పథకాలు, వచ్చే ఆర్థిక సంవత్సరంలో అమలు చేయబోయే పథకాలు, తరువాయి 12లో



ఉద్యోగులకు పెండింగ్ బిల్లులు

## రూ.745 కోట్లు విడుదల

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం పెండింగ్ బిల్లుల కోసం రూ.745 కోట్లు విడుదల చేసింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ అధికారులు ఫిబ్రవరి మాసానికి సంబంధించిన బిల్లులను విడుదల చేశారు. విడుదలైన బిల్లులో గ్రాట్యూటీ, జిపిఎఫ్, సరెండర్ లీవ్, అడ్వాన్సులు ఉన్నాయి. ఉద్యోగులకు ప్రతీనెలా రూ. 700 కోట్లకు తగ్గకుండా పెండింగ్ బకాయిలు చెల్లిస్తామని ఉద్యోగ సంఘాలకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. అ హామీ మేరకు ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపునకు రాష్ట్ర ప్రభుత్వం తరువాయి 2లో



## డిఎంకెలోకి ఒపిఎస్

మాజీసిఎం పన్నీర్ సెల్వంకు కండువా కప్పి ఆహ్వానించిన తమిళనాడు సిఎం స్టాలిన్

**చెన్నై :** తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. దివంగత సిఎం జయలలితకు అత్యంత నమ్మకస్తుడిగా గుర్తింపు పొంది, మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఓ.పన్నీర్‌సెల్వం (ఒపిఎస్) ఇప్పుడు ప్రత్యర్థి పార్టీలో చేరారు. అధికార ద్రవిడ మున్నేట్ర కఝగం (డిఎంకె)లో తరువాయి 12లో

## మహిళా భవనాల నమూనాలో మరుగు దొడ్లేవీ?

- చుట్టూ ప్రహరీ కూడా లేవు
- రూ.10 లక్షలతో శాశ్వత మహిళా సమాఖ్య వేదికలు
- నకిరేకల్ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 122 భవనాలకు రూ.12.20 కోట్లు
- ప్రభుత్వం రూపొందించిన నమూనాపై నల్లగొండ జిల్లాలో అభ్యంతరాలు



ప్రజాపక్షం/నకిరేకల్:తెలంగాణలో మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తూ స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) బలోపేతానికి పలు కార్యక్రమాలు అమలు చేస్తోంది.ఐదేళ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో గ్రామీణ మహిళలకు శాశ్వత వేదికలు కల్పించేందుకు చర్యలు ప్రారంభించింది. ఎస్‌హెచ్‌జీలు,ఫడరేషన్ల కోసం ప్రత్యేక భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.ప్రభుత్వ సంకల్పంపై ప్రశంసలు వ్యక్తమవుతున్నప్పటికీ,ప్రభుత్వం రూపొందించిన భవన నమూనాలో మరుగుదొడ్ల ప్రహరి గోడ సదుపాయం లేకపోవడం మహిళల్లో ఆందోళన కలిగిస్తోంది.గ్రామాల్లో వందల సంఖ్యలో ఉన్న పొదుపు సంఘాల మహిళలు సమావేశాలు,శిక్షణ కార్యక్రమాల కోసం స్థిరమైన భవనాల అవసరాన్ని చాలాకాలంగా వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం గ్రామ కంఠాల పరిధిలోని ప్రభుత్వ భూముల్లో లేదా అందుబాటులో ఉన్న ఇతర ప్రభుత్వ స్థలాల్లో సుమారు 200 గజాల భూమిని కేటాయించి భవనాలు నిర్మించాలని నిర్ణయించింది.ప్రభుత్వ భూమి లేని చోట దాతల సహకారంతో స్థలం సమకూర్చనున్నారు.గ్రామ సంస్థలు (వీవోలు) కూడా ఈభవనాలను వినియోగించుకోనున్నాయి.ఈమేరకు పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది.

**రూ.10 లక్షలతో నమూనా:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్‌ఆర్ఈజీఎస్) కింద ఈ నిర్మాణాలు చేపడుతున్నారు. నకిరేకల్ నియోజకవర్గంలో మొదటి,రెండో దశలుగా ఆరు మండలాల్లో 122 భవనాల నిర్మాణానికి రూ.12.20 కోట్ల నిధులు కేటాయించారు.ఒక్కో భవనానికి రూ.10 లక్షలు కేటాయించారు. సుమారు 200 చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈభవనం 552.11 చదరపు అడుగుల (51.28 చ.మీ.) ప్లింత్ వైశాల్యం,483.24 చదరపు అడుగుల(45 చ.మీ.)కార్పెట్ విస్తీర్ణంతో ఉండనుంది.పరిమాణం 7.5 మీటర్లు 6 మీటర్లు.ఆర్‌సీసీ స్లాబ్‌తో విశాల హాల్ నిర్మించనున్నారు.ఆరు సీలింగ్ ఫ్యాన్లు, ఎనిమిది ట్యూబ్‌లైట్లు,ఏడు ఫ్లోరోసెంట్ స్ట్రీట్‌లైట్లు, రెండు తలుపులు, నాలుగు కిటికీలు తరువాయి 2లో

## సత్వరమే రెండో దశ పూడికతీత పనులు

- వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేయాలి
- నిధుల ప్రతిపాదనను మంత్రివర్గం ముందు పెడతా
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్


మట్టితో పేరుక పోయిన ప్రాజెక్టులలో రెండోదశ పూడిక తీత పనులకు సత్వరమే చేపట్టాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాకాలానికి ముందే పూడికతీత పనులకు ఉపక్రమిస్తే వర్షాకాలంలో సమృద్ధిగా నీటి నిల్వలు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాజెక్టులలో ఉండాల్సిన నీటి సామర్థ్యం నిలువలు, వర్షాల ఉధృతికి వచ్చి చేరే నీటితో ఏర్పడ్డ నీటి నిలువలు సమగ్రంగా అధ్యయనం జరిపి అంతిమ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పూడికతీత పనులకు అవసరమైన నిధులను సమకూర్చేందుకుగాను ప్రతిపాదనలు రాష్ట్ర మంత్రివర్గం ముందుంచి ఆమోదం తీసుకుంటామని తరువాయి 2లో

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
శనివారం
28-02-2026
www.prajapaksham.in
ప్రపంచం
WORLD NEWS



# మార్క్ చేసిన చోటే చెత్త

- ప్రజల్లో మున్సిపల్ అధికారులు అవగాహన కల్పించాలి
- రాష్ట్రంలోని కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో పారిశుద్ధ్యం, దోమల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో పారిశుద్ధ్యం, దోమల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మున్సిపల్ అధికారులు మార్క్ చేసిన చోటనే చెత్త వేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సచివాలయంలో మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో సిఎం రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సిఎం పలు సూచనలు చేశారు. సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ క్యూర్ పరిధిలో ఫుడ్ సేఫ్టీకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని, హోటల్స్‌లోని కిచెన్‌లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని, తరచూ తనిఖీలు నిర్వహించడంతో పాటు ప్రత్యేక పర్యవేక్షణ విభాగం ఎప్పటికప్పుడు పరిశీలించేలా చర్యలు చేపట్టాలన్నారు. హోటల్స్‌కు రేటింగ్, సర్టిఫికేట్ ఇచ్చే విధానాన్ని పరిశీలించాలని సిఎం ఆదేశించారు. ఫైర్ సేఫ్టీ విషయంలో ఆధునాతన పరికరాలను వినియోగించాలన్నారు.

నగరంలోని సిగ్నల్ జంక్షన్స్, సర్కిల్స్‌లో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేసి వర్షపు నీటిని ఒడిసి పట్టాలని, ఇందుకు ముందుగా కొన్ని ప్రాంతాలను గుర్తించి పైలట్ ప్రాజెక్టుగా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు పనులు పూర్తి చేసేందుకు అవసరమైతే టెక్నాలజీని ఉపయోగించాలని, కోర్ అర్బన్ రీజియన్‌లో ఉన్న అన్ని స్ట్రీట్ లైట్స్‌కు ప్రత్యేక నెంబర్ ఇచ్చి డ్యాష్ బోర్డుకు కనెక్ట్ చేయాలని, టెక్నాలజీ ద్వారా సమస్య తలెత్తిన చోట వెంటనే పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## అతిపెద్ద రాజకీయ కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత కేజ్రీవాల్ విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర సర్కార్‌పై విరుచుకుపడ్డారు. 'కేజ్రీవాల్, మనీష్ సిసోడియా ఆప్ 'కట్టర్ ఇమాందార్' అని కోర్టు నిరూపించింది' అని ఆయన ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి సిసోడియాతో కలిసి కేజ్రీవాల్ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు ఆప్‌ను అంతం చేయడానికి ఎక్సైజ్ కేసు 'కుట్ర' పన్నారని కేజ్రీవాల్ ఆరోపించారు. 'దేవుడు మనతోనే ఉన్నాడని నేను ఎప్పుడూ చెబుతుండేవాడిని. మోడీ జీ, అమిత్ షా జీ కలిసి స్వతంత్ర భారతదేశంలో అతిపెద్ద రాజకీయ కుట్రను పన్నారు. పార్టీని అంతం చేసినందుకు ఆప్‌లోని ఐదుగురు అతిపెద్ద నాయకులను జైలుకు పంపారు' అని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి ఆరోపించారు. ఒక ముఖ్యమంత్రిని ఇంటి నుండి బయటకు లాగి జైలులో పెట్టడం మొదటిసారి అని కేజ్రీవాల్ అన్నారు. తనున, సిసోడియాను జైలులో పెట్టడాన్ని ప్రజలందరూ గమనించారన్నారు. ఈ మొత్తం కేసు నకిలీదన్నారు. తమపై బురద జల్లారని, 24 గంటలూ టివి చర్చలు జరిగాయని, కేజ్రీవాల్ అవినీతిపరుడని వార్తలు వచ్చాయని ఆప్ నేత విరుచుకుపడ్డారు. 'నేను నిజాయితీని మాత్రమే సంపాదించుకున్నాను. వారు నకిలీ కేసు నమోదు చేశారు. ఈరోజు, కోర్టు 'కేజ్రీవాల్ కట్టర్ ఇమందర్ హై, మనీష్ సిసోడియా కట్టర్ ఇమందర్ హై, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కట్టర్ ఇమందర్ హై' అని చెప్పిందని రుజువైంది. అధికారాన్ని వెతుక్కుంటూ దేశంతో, రాజ్యాంగంతో ఆడుకోవద్దని ప్రధాన మంత్రికి చెప్పాలనుకుంటున్నట్లు ఆప్ అధినేత చెప్పారు. 'అధికారం కావాలంటే మంచి పనులు చేయండి. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, చెడిపోయిన రోడ్లు, కాలుష్యం వంటి అనేక సమస్యలు ఉన్నాయి. అధికారంలోకి రావడానికి ఈ సమస్యలను పరిష్కరించుకోండి' అని ఆయన సూచించారు. ప్రధానికి సవాల్ విసురుతూ... ఢిల్లీలో మీకు అంత ప్రజాదరణ ఉంటే వెంటనే ఎన్నికలు పెట్టండి. బిజెపికి 10 సీట్లు కూడా రావు. అంతకంటే ఎక్కువ వస్తే నేను రాజకీయాల నుంచి తప్పుకుంటాను అని స్పష్టం చేశారు. కాగా, ఆప్ అధినేతను ఆయన కుటుంబ సభ్యులు ఫిరోజ్ షా రోడ్డులోని ఆయన నివాసంలో స్వాగతించారు. పార్టీ సభ్యులు, మద్దతుదారులు డ్రమ్ బీట్‌లకు నృత్యం చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అతని భార్య సునీతా కేజ్రీవాల్, కోరు, న్యాయమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు. అరవింద్ కేజ్రీవాల్ తన జీవితమంతా నిజాయితీతో, దేశ పురోగతి కోసం గడిపారని, కానీ ఈ వ్యక్తులు, అధికార దాహంతో, నకిలీ కేసులు మోపారని మండిపడ్డారు. అతని అనుచరులను జైలులో పెట్టినా, నాకు దేవునిపై నమ్మకం ఉందని పిటిఐకి వెల్లడించారు.

## మరుగు దొడ్లేవీ?

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేస్తారు. ఇందిరమ్మ ఇళ్ల తరహాలో తెలుపు రంగుతో నీలం అంచు కలర్ కోడ్ అమలు చేయనున్నారు.

**నమూనాపై అభ్యంతరాలు:**

భవన నమూనాలో కేవలం హాల్ మాత్రమే ఉండటంపై మహిళలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలకు గంటల తరబడి హాజరయ్యే మహిళలకు మరుగుదొడ్లు, రక్షణ ప్రహరీ గోడ లేకపోవడం అనుచితమని పేర్కొంటున్నారు. మహిళల ఆత్మగౌరవం, భద్రత దృష్ట్యా వాష్‌రూమ్ సదుపాయం తప్పనిసరిగా చేర్చాలని డిమాండ్ చేస్తున్నారు. మహిళల కోసం శాశ్వత వేదికల ఏర్పాటు అభినందనీయమైనదే అయినప్పటికీ, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి.

**ప్రభుత్వం మార్గదర్శకాలు ప్రకారమే భవన నిర్మాణం: డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి**



ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు గ్రామాలలోని గ్రామ కంఠ భూములలో ఈభవనాలను నిర్మాణం చేపడుతున్నామని డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం కేటాయించిన రూ.10 లక్షలు భవన నిర్మాణానికే పరిమితమని తెలిపారు. మరుగుదొడ్లు, ప్రహరీ గోడ వంటి అదనపు సదుపాయాల కోసం ప్రభుత్వం ఆదేశాలు ఇస్తే అదనపు నిధులపై ప్రతిపాదనలు పంపనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## రూ.745 కోట్లు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

గ్రీన్ ఛానల్‌లో నిధులను విడుదల చేస్తోంది. గత జూ న్ నెలాఖరులో రూ.183 కోట్లను విడుదల చేసింది. గత సంవత్సరం ఆగస్టు నుంచి ప్రతినెల కనీస రూ. 700 కోట్ల చొప్పున ప్రభుత్వం విడుదల చేస్తూ వస్తోందని డిప్యూటీ సిఎం కార్యాలయం తెలియజేసింది.



# అఫ్గాన్‌పై పాకిస్తాన్ వైమానిక దాడులు

కాబూల్, కాందహార్, పక్తియా ప్రావిన్సుల్లో బాంబుల మోత

**కాబూల్:** అఫ్గానిస్థాన్ రాజధాని కాబూల్‌లో శుక్రవారం పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయి. అఫ్గాన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ తెలిపిన ప్రకారం, కాబూల్‌తో పాటు కందహార్, పక్తియా ప్రావిన్సుల్లో పాకిస్తాన్ వైమానిక దాడులు నిర్వహించింది. అఫ్గానిస్థాన్ సైన్యం పాక్ సరిహద్దు దాటి దాడికి దిగిన కొన్ని గంటల్లోనే ఈ వైమానిక దాడులు జరగడం గమనార్హం. కాగా, పరస్పర దాడులు మొదలుకావడంతో, ఈ రెండు దేశాల మధ్య ఖతార్ మధ్యవర్తిత్వంలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం సరైన ఫలితాలను ఇవ్వలేదనే విషయం స్పష్టమవుతున్నది. కాబూల్ నగరంలో కనీసం మూడు పేలుళ్ల శబ్దాలు వినిపించినప్పటికీ, దాడులు జరిగిన ఖచ్చితమైన ప్రాంతాలు లేదా ప్రాణనష్టం గురించి వెంటనే సమాచారం వెలువడలేదు. అదే సమయంలో దక్షిణంలోని కందహార్, ఆగ్నేయంలోని పక్తియా ప్రాంతాల్లో కూడా పాకిస్తాన్ వైమానిక దాడులు జరిగినట్లు అఫ్గాన్ ప్రభుత్వం పేర్కొంది. అఫ్గానిస్థాన్ అధికారిక ప్రకటనను అనుసరించి, పాకిస్తాన్ గత ఆదివారం అఫ్గాన్ సరిహద్దు ప్రాంతాలపై చేసిన ప్రాణాంతక వైమానిక దాడులు చేసింది. అందుకు, ప్రతీకారంగా గురువారం రాత్రి అఫ్గాన్ సైన్యం పాకిస్తాన్ భూభాగంపై ప్రతిదాడి చేసింది. ఈ దాడిలో డ్యూరాండ్ లైన్ వెంట ఉన్న పాకిస్తాన్ సైనిక స్థావరాలపై భారీ ఆపరేషన్లు నిర్వహించి, డజనుకు పైగా సైనిక పోస్టులను స్వాధీనం చేసుకున్నామని అఫ్గాన్ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. అయితే పాకిస్తాన్



ప్రభుత్వం ఈ ఆరోపణలను ఖండిస్తూ, అఫ్గాన్ దాడి వల్ల తమకు పెద్దగా నష్టమేమీ జరగలేదని పేర్కొంది. డ్యూరాండ్ లైన్‌గా పిలిచే అఫ్గానిస్థాన్–పాకిస్తాన్ సరిహద్దు మొత్తం 2,611 కిలోమీటర్ల పొడవు కలిగి ఉంది. ఈ సరిహద్దును అఫ్గానిస్థాన్ అధికారికంగా ఇప్పటికీ గుర్తింపుకు నోచుకోలేదు. ఇది రెండు దేశాల మధ్య దీర్ఘకాలిక వివాదానికి ప్రధాన కారణంగా ఉంది. ఇలావుంటే, ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెష్ ఈ పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ, సమస్యలను సైనిక చర్యల ద్వారా కాకుండా దౌత్యపరమైన చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని రెండు దేశాలను కోరారు. ప్రాణనష్టం విషయంలో రెండు దేశాలు పూర్తిగా భిన్నమైన గణాంకాలను వెల్లడించాయి. టోర్కామ్ సరిహద్దు ప్రాంతంలో రెండు దేశాల మధ్య కాల్పులు చోటు చేసుకున్నాయని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. అక్కడి శరణార్థి శిబిరంపై క్షిపణి దాడి జరిగి మహిళలు, పిల్లలు సహా 13 మంది పౌరులు గాయపడినట్లు అఫ్గాన్ అధికారులు తెలిపారు. దీంతో శరణార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం ప్రారంభించారు. పాకిస్తాన్ వైపు కూడా గ్రామాల ప్రజలను దూర ప్రాంతాలకు తరలించారు. 2023 అక్టోబర్ నుంచి పాకిస్తాన్ అక్రమ వలసదారులపై చర్యలు చేపట్టి లక్షలాది మందిని దేశం విడిచిపెట్టేలా చేసింది. ఇటీవలి నెలలుగా రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి.

## ప్రత్యక్ష యుద్ధం దశకు చేరుకున్న పరిస్థితులు

పాకిస్తాన్ రక్షణ మంత్రి ఆసిఫ్



**ఇస్లామాబాద్ :** పాకిస్తాన్–అఫ్గానిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రం కావడంతో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. పరిస్థితి ఇప్పుడు ప్రత్యక్ష, బహిరంగ యుద్ధం దశకు చేరుకుందని పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖ్వాజా మహ్మద్ ఆసిఫ్ ప్రకటించారు. రెండు దేశాలు పరస్పరం వైమానిక దాడులు, సరిహద్దుల్లో సైనిక దాడులు నిర్వహించిన నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడడం ప్రాధాన్యతను సంతరించుకుంది. కాగా, అఫ్గానిస్థాన్ పదేపదే సరిహద్దు దాడులకు దిగుతున్న కారణంగా, పాకిస్తాన్ సహనం కోల్పోయిందని ఆసిఫ్ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నాటో దళాలు అఫ్గానిస్థాన్ నుంచి వెనక్కు వెళ్లిన తరువాత అక్కడ శాంతి నెలకొంటుందని పాకిస్తాన్ ఆశించిందని చెప్పారు. తాలిబాన్ ప్రభుత్వం దేశ ప్రజల సంక్షేమం, ప్రాంతీయ స్థిరత్వంపై దృష్టి పెడుతుందని భావించామని, కానీ పరిస్థితులు భిన్నంగా మారాయని ఆయన విమర్శించారు. 'ఇప్పటివరకు ఎంతో సహనంగా వ్యవహరించాం. కానీ ఇప్పుడు అది ముగిసింది. ప్రస్తుతం మా మధ్య బహిరంగ యుద్ధం కొనసాగుతోంది' అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై అఫ్గాన్ ప్రభుత్వ అధికారుల నుంచి వెంటనే ఎలాంటి స్పందన రాలేదు. ఇలావుంటే, గతంలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ఉన్నప్పటికీ, తాజా ఘటనలతో అది బలహీనమైందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రాణనష్టంతోసహా ఇరు దేశాలు ప్రకటించిన గణాంకాలను ధ్రువీకరించడానికి ఎలాంటి సమాచారం అందుబాటులో లేదని అంతర్జాతీయ మీడియా పేర్కొంది.

## కాల్పులు విరమించండి

పాక్–అఫ్గాన్‌లకు చైనా హితవు



**బీజింగ్:** పర్స్పర దాడులు నిలిపివేసి, కాల్పుల విరమణను పాటించాల్సిందిగా పాకిస్తాన్, అఫ్గానిస్థాన్ దేశాలకు చైనా హితవు పలికింది. ఈ రెండు దేశాల మధ్య పెరుగుతున్న సైనిక ఉద్రిక్తతల పట్ల చైనా ఆందోళన వ్యక్తం చేస్తూ, రెండు దేశాలు తక్షణ కాల్పుల విరమణకు చేసుకోవాలని కోరింది. బీజింగ్‌లో జరిగిన మీడియా సమావేశంలో చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత ఘర్షణ పరిణామాలను చైనా నిశితంగా గమనిస్తున్నదని ఆమె తెలిపారు. పాకిస్తాన్, అఫ్గానిస్థాన్ రెండూ చైనాకు పొరుగు దేశాలే కావడంతో పాటు స్నేహపూర్వక సంబంధాలు ఉన్న దేశాలని పేర్కొంటూ, పెరుగుతున్న హింస, ప్రాణనష్టం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రాంతీయ శాంతి, స్థిరత్వం దృష్ట్యా పరిస్థితి మరింత దిగజారకుండా వెంటనే ఉద్రిక్తతలను తగ్గించాలని ఆమె సూచించారు. చైనా అన్ని రకాల ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తుందని స్పష్టం చేసిన మావో నింగ్, రెండు దేశాలు సంయమనం పాటించి వివాదాలను చర్చలు, సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలని కోరారు. సైనిక చర్యల కంటే దౌత్యపరమైన చర్చలే దీర్ఘకాలిక పరిష్కారానికి దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు. ఉద్రిక్తతలు తగ్గించడం రెండు దేశాల ప్రజల ప్రయోజనాలకు అనుకూలమని, అలాగే మొత్తం ప్రాంతంలో శాంతి భద్రతలను కాపాడేందుకు సహాయపడుతుందని చెప్పారు. ఇప్పటికే చైనా తన స్వంత దౌత్య మార్గాల ద్వారా రెండు దేశాల మధ్య మధ్యవర్తిత్వ ప్రయత్నాలు కొనసాగిస్తోందని, అవసరమైతే భవిష్యత్తులో కూడా నిర్మాణాత్మక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని ఆమె వెల్లడించారు. చైనా, పాకిస్తాన్, అఫ్గానిస్థాన్ మధ్య త్రైపాక్షిక వ్యవస్థ ద్వారా గతంలో కూడా పలు సమావేశాలు నిర్వహించి భద్రతా సమస్యలను చర్చించినట్లు తెలిపారు. ఇక ఘర్షణల నేపథ్యంలో చైనా పౌరులను తరలించే ఆలోచన ఉందా అనే ప్రశ్నకు స్పందిస్తూ, పరిస్థితిని నిరంతరం పరిశీలిస్తున్నామని, అవసరమైతే చైనా పౌరులకు సహాయం అందిస్తామని మావో నింగ్ చెప్పారు. పాకిస్తాన్ తరచుగా తేహ్రీక్‌ఇతాలిబాన్ పాకిస్తాన్ (టిటిపి), బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్‌ఎ) వంటి మిలిటెంట్ గ్రూపులకు అఫ్గానిస్థాన్ ఆశ్రయం ఇస్తోందని ఆరోపిస్తుండగా, ఆఫ్ఘాన్ తాలిబాన్ ప్రభుత్వం ఈ ఆరోపణలను తిరస్కరిస్తూ పాకిస్తాన్ వైమానిక దాడులే ఉద్రిక్తతలకు కారణమని పేర్కొంటోంది. ఈ పరిస్థితుల్లో శాంతి చర్చలపై దృష్టి పెట్టాలని చైనా రెండు దేశాలను కోరుతోంది.

**సమస్యలు చర్చించుకోండి: రష్యా**

వెంటనే కాల్పుల విరమణను పాటించి, సమస్యలపై చర్చలు ప్రారంభించాలని పాకిస్తాన్, అఫ్గానిస్థాన్ దేశాలను రష్యా కోరింది. చర్చల ద్వారా చాలా వరకు సమస్యలు పరిష్కరమవుతాయని తెలిపింది. ఇరు వర్గాలు భారీగా నష్టపోతాయని, ప్రాణ నష్టం కూడా జరుగుతుందని పేర్కొంది. నష్ట నివారణకు వెంటనే దాడులను మానుకొని, చర్చలకు సానుకూల వాతావరణాన్ని కల్పించుకోవాలని సూచించింది.

## పూడిక తీత పనులు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి వెల్లడించారు. డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ సచివాలయంలో శుక్రవారం నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. నూతనంగా నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఇ.శ్రీధర్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, జాయింట్ సెక్రటరీ కె.శ్రీనివాస్, ఇఎన్‌సి రమేష్ బాబు తదితరులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మట్టితో పూడిపోయిన ప్రాజెక్టులలో నీటి సామర్థ్యం పూర్తిగా పడి పోవడంతో జాతీయ స్థాయిలో ఇది ప్రధాన సమస్యగా పరిణమించిందని ఆయన చెప్పారు. జాతీయ స్థాయిలో ఏర్పడ్డ ఈ సంక్షోభం నుండి బయటపడి రైతాంగానికి నీటి భద్రత కల్పించేందుకుగాను కేంద్రం జాతీయ స్థాయిలో తీసుకొచ్చిన పూడిక తీత విధానాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పూడిక తీత పనులకు అంకురార్పణ చేసిందని ఆయన పేర్కొన్నారు. చారిత్రాత్మక బాక్రా నంగల్ నుండి తెలంగాణా రాష్ట్రంలో సుప్రసిద్ధ శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరకు మట్టితో పూడి పోయి నీటి సామర్థ్యం నిలువలు పడి పోయాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యేకించి శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 120 టియంసిల సామర్థ్యం నుండి ఏకంగా 80 టియంసిలకు పడిపోయిందని ఆయన గణాంకాలతో సహా వివరించారు. మట్టితో లేదా ఇసుక మేటలతో ప్రాజెక్టులు పడిపోయి నీటి సామర్థ్యం నిలువలు ఘోరంగా పడిపోయి ఇది జాతీయ స్థాయి సమస్యగా పరిణమించినందున రాష్ట్ర ప్రభుత్వాలతో కేంద్ర ప్రభుత్వం సమన్వయం చేసుకుని ముందుకు పోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో ఇప్పటికే మొదటిదశలో చేపట్టిన పూడిక తీత పనులు జాతీయస్థాయిలో పూడిక తీత కోసం చేపట్టిన మార్గదర్శనంలోనే తెలంగాణ ప్రభుత్వం ముందుకు వెళుతున్నదన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో కొనసాగుతున్న పూడిక తీత పనులను ఆయన ప్రస్తావిస్తూ పైలెట్ ప్రాజెక్ట్ కింద 'కడెం' ప్రాజెక్టులో మొదటి దశ లో చెపట్టిన పూడిక తీత విజయవంతం అయ్యిందన్నారు. ఇక్కడ పూర్తిగా అత్యధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించినట్లు ఆయన వెల్లడించారు.

## పాల్వంచ పేరు చేర్చాలి

(మొదటి పేజీ తరువాయి)

ఇది ఒక సంస్థానంగా, ప్రత్యేక అసెంబ్లీ నియోజకవర్గంగా విరాజిల్లిన విషయాన్ని గుర్తు చేశారు. అటువంటి చారిత్రక ప్రాధాన్యత కలిగిన పాల్వచ పేరును కార్పొరేషన్‌లో చేర్చడం ద్వారా ఈప్రాంత ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడినట్లు అవుతుందని కూనంనేని పేర్కొన్నారు. పేరు మార్పు విషయంలో పాల్వంచ ప్రజల కోరిక అత్యంత సమంజసం అని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. త్వరితగతిన కొత్తగూడెం–పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్‌గా అధికారిక ప్రకటన వెలువడేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరుతూ పంపిన లేఖలో కూనంనేని పేర్కొన్నారు.

## కేసు కొట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

అమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రభుత్వం రద్దు చేసిన ఎక్సైజ్ పాలసీని రూపొందించడం, అమలు చేయడంలో జరిగిన అవినీతిపై కేంద్ర దర్యాప్తు బృందం దర్యాప్తు చేస్తోంది. ట్రయల్ కోర్టు తీర్పుపై వెంటనే ఢిల్లీ హైకోర్టు అప్పీల్ చేస్తామని సిబిఐ తెలిపింది. కోర్టుకు సంబంధించిన అనేక అంశాలు ఈ కేసులో విస్మరించబడ్డాయని, తగినరీతిలో పరిగణించబడలేదని సిబిఐ ప్రతినిధి ఒకరు తెలిపారు. తన ఉత్తర్వులో, దర్యాప్తు ముందుగా నిర్ణయించిన మార్గంలో సాగినట్లు కనిపిస్తోందని, పాలసీ సూత్రీకరణ లేదా అమలుతో దాదాపుగా సంబంధం కలిగి ఉందని, లోతు, విశ్వసనీయత భ్రాంతిని పెలుసుగా ఉండే కథనానికి ఇమిడి ఉందని పేర్కొంది. నేరం ద్వారా వచ్చిన ఆరోపణలను గోవా అసెంబ్లీ ఎన్నికలకు ముడిపెట్టడం, నేరం ద్వారా వచ్చిన ఆరోపణలను అంచనా వేయడం, లేయరింగ్ వేయడం, ఉపయోగించడం వంటి ప్రయత్నాలు, చట్టబద్ధంగా స్థిరమైన విషయాల కంటే అనుమితి, ఊహలపై ఎక్కువగా ఆధారపడి ఉన్నాయని న్యాయమూర్తి అన్నారు. పాలసీ (ఎక్సైజ్) సంబంధిత సూత్రీకరణ చర్చల ఫలితంగా సంస్థాగత పరిశీలన, విధానపరమైన సమ్మతి ఫలితంగా వచ్చినట్లు చూపబడిన అనంతరం దాని అమలుకు నేరాన్ని ఆపాదించడానికి చేసే ఏ తదుపరి ప్రయత్నమూ పూర్తిగా సమర్థనీయం కాదని చెప్పారు. 'నాపై మోపిన అవినీతి కేసు స్వతంత్ర భారతదేశ చరిత్రలో అతిపెద్ద రాజకీయ కుట్ర' అని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. ఈ కేసులో కేజ్రీవాల్ ఆరునెలలు జైలులో ఉండగా, మనీశ్ సిసోడియా దాదాపు రెండేళ్ల పాటు జైలులో ఉన్నారు. ఆరోపించిన కుట్ర ఊహాగానాలు, అంచనాలపై ఆధారపడిన ఊహాజనిత నిర్మాణం తప్ప మరొకటి కాదని, ఏదైనా ఆమోదయోగ్యమైన ఆధారాలు ఉంటే తప్ప మరొకటి కాదని కోర్టు పేర్కొంది. చట్టబద్ధంగా ఆమోదయోగ్యమైన ఆధారాలు ఏవీ లేనప్పుడు, పూర్తి స్థాయి క్రిమినల్ విచారణ సంబంధిత కఠినతను ఎదుర్కోవాలని నిందితులను బలవంతం చేయడం న్యాయానికి ఏమాత్రం ఉపకరించదని కోర్టు తెలిపింది.

### కేజ్రీవాల్ విడుదల స్వాగతనీయం

సిపిఐ ప్రధానకార్యదర్శి డి.రాజా

మద్యం పాలసీ కేసులో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఇతరులను ఢిల్లీ ట్రయల్ కోర్టు విడుదల చేయడాన్ని సిపిఐ స్వాగతించింది. బిజెపి ఫెడరల్ దర్యాప్తు సంస్థలను 'రాజకీయ ప్రతీకారానికి సాధనాలుగా వాడుకుంటూ' వాటి స్థాయిని తగ్గించిందన్న విషయం రుజువైందని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా వ్యాఖ్యానించారు. ఆయన శుక్రవారం తన 'ఎక్స్'లో ఈ విషయాన్ని పోస్ట్ చేశారు.ఈ ఉదంతం బిజెపి సిబిఐ, ఇడి వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రతీకార సాధనాలుగా వాడుకుంటూ వాటి ప్రతిష్ఠలను కూడా దెబ్బతీసిందని ఆరోపించారు. దర్యాప్తు సంస్థలను రాజకీయ ఆయుధాలుగా మార్చినప్పుడు కేవలం వ్యక్తులను మాత్రమే లక్ష్యంగా చేసుకోరని, ప్రజాస్వామ్యాన్ని విచారణకు గురిచేయడమే అవుతుందన్నారు. ఈ అధికార దుర్వినియోగానికి దేశం జవాబుదారీగా ఉండాలని సిపిఐ అగ్రనేత డి.రాజా అన్నారు.

## మావోయిస్టులు భేటీ

(మొదటి పేజీ తరువాయి)

అలియాస్ దామోదర్, నూనె నర్సింహా రెడ్డి అలియాస్ గంగన్నలు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని కలిసిశారు. సిఎంను కలిసిన వీరి వెంట డిజిపి శివధర్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్‌కుమార్, ఎస్‌ఐబి చీఫ్ బి.సుమతిలు ఉన్నారు. ముఖ్యమంత్రితో భేటీకి వెళుతున్న సమయంలో మీడియా ప్రతినిధులు సిఎంతో ఏం చర్చిస్తారు? అని ప్రశ్నించగా, అగ్రనేత దేవ్‌జీ స్పందిస్తూ పొలిటికల్ ఎజెండా అని క్లుప్తంగా సమాధానం ఇచ్చారు. దీనితో వీరంతా భవిష్యత్తులో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చే అవకాశం ఉందన్న సంకేతాలు వెలువడుతున్నాయి. కాగా, ఈ సమావేశంలో ప్రభుత్వ పునరావాస పథకాలు, భద్రత, ఉపాధి అవకాశాలు, కుటుంబాల సంక్షేమం వంటి అంశాలపై ముఖ్యమంత్రి వారితో మాట్లాడినట్లు సమాచారం. ఆయుధ మార్గాన్ని విడిచిపెట్టి ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకం ఉంచినందుకు ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి అభినందనలు తెలిపినట్లు తెలుస్తోంది. మాజీ మావోయిస్టు అగ్రనేతలు ప్రభుత్వంతో ప్రత్యక్షంగా సమావేశం కావడం రాష్ట్రంలో శాంతి ప్రక్రియ ముందుకు సాగుతున్నదానికి సంకేతంగా భావిస్తున్నారు. అడవుల్లో హింసాత్మక మార్గాన్ని విడిచిపెట్టి సాధారణ జీవితం వైపు రావాలని మిగిలిన మావోయిస్టులకు ప్రభుత్వం మరోసారి పిలుపునిచ్చినట్లు సమాచారం. ఈసమావేశానికి ప్రభుత్వ సలహాదారులు కే.కేశవరావు, వేంనరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తదితరులు హాజరయ్యారు.

## ఏప్రిల్ 25న కొత్త పార్టీ?


(మొదటి పేజీ తరువాయి)

న్యాయ తన వైపు ఉంటుందని ఆనాడే చెప్పానని, ప్రస్తుతం న్యాయస్థానం కూడా అదే తీర్పునిచ్చిందన్నారు. కోర్ట్ తీర్పును ఆమె స్వాగతించారు. లిక్కర్ కేసులో ఢిల్లీలోని తీహార్ జైలులో దాదాపు ఆరు నెలల జైలు జీవితం గడిపిన బైటికి వచ్చిన నాటి నుంచి బిఆర్‌ఎస్ నుంచి తనను దూరం చేయడంపై ఆవేదనతో ఉన్న కవితకు ఈ తీర్పు గొప్ప ఊరటనిచ్చింది. బిఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేయడమే కాకుండా, సొంత కుటుంబసభ్యులు, ఆ పార్టీ కార్యకర్తల నుంచి నిరాదరణకు గురయ్యేలా చేసిన పరిణామాలతో ఆగ్రహంగా ఉన్న ఆమె తెలంగాణ జాగృతి సంస్థను వేదిక చేసుకొని ప్రజల్లోకి వెళ్తున్నారు. స్వంత పార్టీని ఏర్పాటు చేస్తానని ప్రకటించిన కవిత, తాజా తీర్పుతో ఆ ప్రక్రియను మరింత వేగం చేసినట్లు తెలిసింది. ఏప్రిల్ 25వ తేదీన కొత్త పార్టీని ఆమె ప్రకటించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే, మద్యం కేసును కొట్టివేసిన ఘటన ద్వారా మోదీ ప్రభుత్వం తమను వేధించిందనేందుకు నిదర్శనమిదేనని కెటిఆర్, సహా బిఆర్‌ఎస్ నేతలు తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నాలను కవిత తీవ్రంగానే తిప్పి కొట్టారు. ఆ కేసు వచ్చినప్పుడు తనకు అండగా నిలబడకుండా, పార్టీ నుంచి బైటికి పంపి, కొట్టేసాక ఆ ఘనతను ఖాతాలో వేసుకోవడాన్ని తప్పుబట్టారు. ఇప్పటి వరకు లిక్కర్ కేసును చూపిస్తూ ప్రత్యర్థుల చేస్తున్న విమర్శల కారణంగా రాజకీయంగా ఇబ్బంది పడిన తమకు ఆ కేసును కొట్టివేయడం నైతిక స్థయిర్యాన్ని ఇచ్చిందని జాగృతి కార్యకర్తలు భావిస్తున్నారు. ఇకపై తాము స్వేచ్ఛగా ఎదురుదాడి చేయవచ్చని విశ్వాసంతో ఉన్నారు. బిఆర్‌ఎస్ అధికారం నుంచి దూరమైన తరువాత క్రమంగా కవితను దూరం పెట్టడం ప్రారంభమైంది. ఆమె జిల్లాల్లో తిరుగుతున్నా ఎవరు పాల్గొనవద్దనే ఆదేశాలు క్యాడర్‌కు వెళ్ళాయి. దీనిపై ఆమె స్వయంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలోనే ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తరువాత వరంగల్‌లో జరిగిన బిఆర్‌ఎస్ పాతికేళ్ల ఆవిర్భావ సభలో లోటుపాట్లను సునిశితంగా ఎత్తిచూపుతూ కెసిఆర్‌కు లేఖ రాశారు. ఆమె అమెరికా పర్యటనలో ఉన్న సమయంలోనే ఆ లేఖ లీక్ అయింది. హైదరాబాద్‌కు తిరిగివచ్చాక శంషాబాద్ విమానాశ్రయంలోనే కవిత మీడియాతో మాట్లాడుతూ కెసిఆర్ చుట్టూ ఉన్న దెయ్యాలు తనను పార్టీ నుంచి వెళ్ళగొట్టాలని చూస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను లేఖలో రాసినవన్నీ నిజాలేనని, కావాలనే వారు దానిని లీక్ చేసారని మండిపడ్డారు. మొదట్లో తన సోదరుడు, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావుపై విమర్శలు ఎక్కుపెట్టిన కవిత.. ఆ తరువాత రూటు మార్చి మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, మాజీ ఎంపి సంతోష్‌రావులపై తీవ్ర విమర్శల దాడి ప్రారంభించారు. రాఖీ రోజు కెటిఆర్ బెంగుళూరుకు వెళ్ళడంతో కవిత రాఖీ కట్టలేకపోయారు. ఆ తరువాత ఘోష్ కమిషన్ ఎదుట హాజరయ్యేందుకు వెళ్లే ముందు మాత్రమే కెసిఆర్‌ను ఎర్రవల్లి ఇంట్లో ఆమె కెసిఆర్‌ను కలిసారు.పుట్టింటితో రాకపోకలకు కూడా తగ్గిపోయాయి. గత ఏడాది సెప్టెంబర్ 22న బిఆర్‌ఎస్ నుంచి కవితను సస్పెండ్ చేశారు. తనకు కనీసం వివరణ కోరకుండా సస్పెండ్ చేయడాన్ని ఆమె ప్రశ్నించారు. దాదాపు మూడేళ్ళ పదవీ కాలం మిగిలి ఉండగానే బిఆర్‌ఎస్ నుంచి సంక్రమించిన ఎంఎల్‌సి పదవికి రాజీనామా చేశారు. వారిని గుంటనక్కలు అని ఆరోపించారు. ప్రభుత్వంలో తప్పులు జరిగాయని అంగీకరిస్తూనే, బిఆర్‌ఎస్ నేతల భూ కబ్జాలకు సంబంధించి మీడియా సమావేశాలు పెట్టి మరీ బైటపెట్టారు. ఇటీవల కాలంలో ప్రజా సమస్యలను క్షేత్రస్థాయికి వెళ్ళి పరిశీలించి, ఉద్యమాలు నిర్వహిస్తున్నారు. అలాగే మున్సిపల్ ఎన్నికల్లో కొన్ని చోట్ల జాగృతి అభ్యర్థులను సింహం గుర్తుపై కూడా పోటీ చేసేందుకు అనుమతించారు. మే నెలలో కొత్త పార్టీ పెడతానని, సిద్ధిపేటలో పోటీ చేస్తానని ఇటీవల మీడియాకు చెప్పిన కవిత, తనపై మద్యం కేసును కొట్టివేయడంతో పార్టీని ముందే పెట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

### 'కారు'కు బ్రేకులు వేసిందేవరు..?

ఢిల్లీ మద్యం కేసులో న్యాయస్థానం ఇచ్చిన తీర్పు బిఆర్‌ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కెటిఆర్, తెలం గాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మధ్య 'బిఆర్‌ఎస్ ఓటమి'కి గల కారణాలపైన చర్చకు దారి తీసింది. బిఆర్‌ఎస్ ఓటమికి ఢిల్లీ లిక్కరా? లేదా కవిత చెప్పినట్టుగా ఉద్యోగాలు, ఇండ్లు, అహంకారమేనా? అనే అంశం తెరమీదకు వచ్చింది. ఢిల్లీ లిక్కర్ కేసు కారణంగానే గత శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌కు రాజకీయంగా నష్టం జరిగిందని కెటిఆర్ ట్విట్ చేయడం, దీనిపైన కవిత స్పందించడంతో రాజకీయ వర్గాల్లో చర్చ నీయంశంగా మారింది. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను, ఆ నాయకుల మాటలను విని ప్రజలు మోసపోయారని పలు సందర్భాల్లో బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కెసిఆర్‌తో పాటు,కెటిఆర్ కూడా ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రజలే కాంగ్రెస్‌ను విశ్వసించి, ఆపార్టీకి ఓటు వేసి తప్పు చేశారనే కోణంలోనే బిఆర్‌ఎస్ మాట్లాడుతూ వస్తోంది. కానీ అసెంబ్లీ, పార్లమెంట్, ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికలు, ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వరుసగా బిఆర్‌ఎస్ ఓటమికి గల కారణాలు, క్షేత్ర స్థాయి పరిస్థితులు , బిఆర్‌ఎస్ చుట్టూ ఉన్న కోటరీ తదితర అంశాలపైన ఇప్పటి వరకు లోతుగా, వాస్త వ పరిస్థితులను మాత్రం అంచనా వేయలేకపోయిందని రాజకీయ వార్గలు బాహాటంగానే చెబుతున్నారు. ఇలాంటి తరుణంలో బిఆర్ ఎస్ ఓటమికి కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యాలు బిఆర్‌ఎస్ వర్గాల్లో కూడా చర్చ నీయంశంగా మారింది. దోపిడీదారులకు టికెట్లు ఇచ్చారని, అహంకారం పైన ప్రజలలో చర్చ జరిగిందనే విషయాన్ని కవిత ప్రస్తావించడం, గులాబీ శ్రేణుల్లో చర్చకు దారితీసింది. ముఖ్యంగా బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కెసిఆర్ ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పుడే కామారెడ్డి నియోజకవర్గ ఎంఎల్‌ఏగా పోటీ చేసి ఓడిపోవడాన్ని ఇప్పటికీ గులాబీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు.

# బిసిలకు న్యాయం జరిగేంత వరకు పోరాడుతా




● ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర బడ్జెట్‌లో బిసిలకు న్యాయం జరిగేంత వరకు శాసనమండలిలో పోరాడుతానని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం స్పష్టం చేశారు. గత ప్రభుత్వాల మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా బడ్జెట్‌లో బిసిలకు సరైన న్యాయం చేయకపోవడం శోచనీయమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఇందిరాపార్క్ వద్ద బిసి ఇంటలెక్చువల్ ఫోరం, బిసి పొలిటికల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో జరిగిన నిరాహారదీక్ష శిబిరానికి ఎమ్మెల్సీ సత్యం ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. బిసిలవి న్యాయమైన కోరికలేనని.. ఎన్నికల సందర్భంగా పాలకులు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయమంటున్నారే తప్ప గొంతెమ్మ కోరికలు ఏమీ కోరటం లేదన్నారు. గత శాసనసభ ఎన్నికల సందర్భంగా కామారెడ్డి బిసి డిక్లరేషన్లో బిసిలకు ఇచ్చిన 21 హామీలను నెరవేర్చాలని మాత్రమే బిసిలు కోరుతున్నారని.. ఈ బడ్జెట్‌లో అందుకు సంబంధించిన నిధుల కేటాయింపు చేయాలని ఆయన కోరారు. ముఖ్యంగా చేతివృత్తుల వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉండదని.. సంచార జాతుల వారికి కేటాయించిన బడ్జెట్‌కు సరిపడే నిధులు విడుదల చేయాలని, గత బడ్జెట్‌లో బిసిలకు కేటాయించిన నిధుల పట్ల శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. ఇటీవల నాగర్‌కర్నూలు జిల్లా కుమ్మెర గ్రామంలో జరిగిన అమానవీయ ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు

**ఐక్య ఉద్యమాలే మార్గం :ధనుంజయ నాయుడు**

బిసిలకు జనాభా దామాషా ప్రకారం సమ న్యాయం దక్కాలంటే ఐక్య ఉద్యమాలు ఒకటే మార్గమని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు తేల్చిచెప్పారు.నిరాహారదీక్షలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. తరతరాలుగా బిసిలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అణచివేతకు గురవుతున్నారని.. అందుకు కారణం బిసిల మధ్య ఐకమత్యం లేకపోవడమని ఆందోళన వ్యక్తం చేశారు. బిసి ఉద్యమాలు కూడా ఎన్నెన్నో దారులలో ఎన్నెన్నో తీరులలో నడవడం వల్ల బిసి ఉద్యమాలను పాలకులు బలహీనపరిచే క్రమంలో ఒక్కో బిసి ఉద్యమం పాలకులకు వత్తాసుగా మారిపోవడం ఆందోళన కలిగిస్తున్నదన్నారు. బిసి ఉద్యమాలు అన్నీ ఐక్యమై కేవలం బిసి జాతికి న్యాయం జరిగే దిశగానే పోరాటాలు కొనసాగించాలని.. అందుకు బిసి హక్కుల సాధన సమితి తన సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆయన తెలిపారు

**జనాభా దామాషా ప్రకారం : కుమారస్వామి**

జనాభా దామాషా ప్రకారం మాత్రమే విద్యా ఉద్యోగ ఉపాధి రాజకీయ రంగాల్లో ఆయా కులాల వారికి వారి జనాభా నిష్పత్తి ప్రకారం మాత్రమే రిజర్వేషన్ కల్పించాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి చింతకింది కుమారస్వామి డిమాండ్ చేశారు. 42 శాతం, 44 శాతం, 50 శాతం ఇచ్చే బిచ్చాలు మాకు అవసరం లేదని.. దేశ జనగణనలో కులగణన చేపట్టి ఏ కుల జనాభా ఎంత ఉందో తేల్చి అంతే నిష్పత్తిలో రిజర్వేషన్ కల్పించి అట్టడుగు వర్గాల వారికి కూడా చట్టసభల్లో ప్రవేశించే వీలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ, ప్రమీల, బాపురాజు, చీకటి ప్రసాద్, బొట్ల శ్రీనివాస్, సుర వెంకటేశం మహాలక్ష్మి పాల్గొన్నారు.

## వారసత్వ ప్రదర్శన
# ‘జిఐ ఆన్ వీల్స్’కు ఆర్‌టిసి శ్రీకారం

● ప్రారంభించిన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ




ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో భౌగోళిక గుర్తింపు (జిఐ) పొందిన కళారూపాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వాటిని ప్రాచుర్యంలోకి తీసుకురావడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. తెలంగాణ యువ రాష్ట్రంగా సాంస్కృతిక గుర్తింపును బలోపేతం చేసుకోవడం అవసరమని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా ‘జిఐ ఆన్ వీల్స్’ భౌగోళిక గుర్తింపు పొందిన తెలంగాణ సాంస్కృతిక కళావైభవాన్ని ప్రతిబింబించే హస్తకళలతో అలంకరించిన ప్రత్యేక బస్సులను శుక్రవారం హైదరాబాద్‌లోని మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజిబిఎస్)లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టిజిఎస్‌ఆర్‌టిసి విసి, ఎండి నాగిరెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన దాసరిలతో కలిసి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ సంస్కృతి సమాజానికి ఆత్మస్వరూపమని, సాంస్కృతిక అవగాహన లేకుండా సమాజం అభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. ఈ తరహా కార్యక్రమాలు యువతలో సంప్రదాయ కళలపై ఆసక్తిని పెంచుతాయని, కళాకారులకు గౌరవాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం గవర్నర్ దూరదృష్టి ఫలితమని తెలిపారు. జిఐ ఉత్పత్తుల ప్రాచుర్యం, మార్కెటింగ్‌తో పాటు విస్తరణకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. అదేవిధంగా ‘పోచంపల్లి ఇక్కత్, వరంగల్ తివాచీలు (కార్పెట్లు), కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ, నారాయణపేట్ చీరలు, చెరియల్ స్క్రోల్ పెయింటింగ్స్, నిర్మల్ పెయింటింగ్స్ వంటి తెలంగాణకు చెందిన ఆరు ప్రముఖ జిఐ హస్తకళలను బస్సులపై ప్రత్యేకంగా ప్రతిష్ఠించారు. ఈ కళారూపాలు తెలంగాణ కళాకారుల నైపుణ్యానికి ప్రతీకలుగా నిలుస్తూ, ప్రజా రవాణా ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ప్రచారం పొందనున్నాయి. ప్రజా రవాణా వ్యవస్థను సృజనాత్మక వేదికగా మలచి, తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రజలకు చేరవేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా చేపట్టటం జరిగిందని’ మంత్రి స్పష్టం చేశారు. వై.నాగిరెడ్డి మాట్లాడుతూ బస్సులపై జిఐ కళారూపాలను ప్రదర్శించడం ద్వారా సంస్కృతిని ప్రజలకు చేరువ చేయడంతో పాటు కళాకారులకు ప్రోత్సాహం అందించడమే లక్ష్యమని చెప్పారు. ఈ బస్సులపై ప్రదర్శించిన డిజైన్లను జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (జెఎన్‌ఎఫ్‌యు) విద్యార్థులు రూపొందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా బహుమతులు మెమొంటోలు అందజేశారు. జిఐ గుర్తింపుల సాధనలో సేవలందించిన సుభజిత్ సహాను ప్రత్యేకంగా సన్మానించారు. ఆరు జిఐ కళారూపాలకు చెందిన కళాకారులను కూడా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిజిఎస్‌ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, సిహెచ్. వెంకన్న, విజయపుష్ప, రాజశేఖర్, ఖుస్రో షా ఖాన్, రీజినల్ మేనేజర్లు శ్రీలత, సుధ పరిమళ, రీ సాల్వేట్ ఫౌండర్ సిఇఓ శుబ్ జిత్ సాహు, జెఎన్‌ఎఫ్‌యు ప్రతినిధులు, కళాకారులతో పాటు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్ ఓటమిని నా మెడలో వేయొద్దు

● అప్పుడే కెసిఆర్, పెద్ద నాయకులు ఎందుకు మాట్లాడలేదు.. బిఆర్‌ఎస్ అంత వీక్‌గా ఉన్నదా.. : కల్వకుంట్ల కవిత



ప్రజాపక్షం/హైదరాబాద్: బిఆర్‌ఎస్ ఓటమికి నాటి ఢిల్లీ మద్యం కేసు కారణం అన్నట్టుగా, గత అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ ఓటమిని తన మెడలో వేయాలని చూడడం సరైంది కాదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సూచించారు. ‘పార్టీ ఎందుకు ఓడిపోయిందో నిష్పక్షపాతంగా, నీతివంతంగా ఆత్మవిమర్శ చేసుకుంటే, ప్రజలకు మంచి జరుగుతుందని, కానీ ఒక వ్యక్తి ద్వారా పార్టీ ఓడిపోయిందంటే, బిఆర్‌ఎస్ అంత వీక్‌గా ఉందా? అని నిలదీశారు. తాను తప్పు చేయలేదని, న్యాయం తన వైపు ఉంటుందని ఆనాడే చెప్పానని, ప్రస్తుతం న్యాయస్థానం కూడా అదే తీర్పునిచ్చిందన్నారు. కోర్ట్ తీర్పును ఆమె స్వాగతించారు. రైతుల సమస్యలపై హైదరాబాద్‌లోని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ కార్యాలయంలో కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డిని శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఢిల్లీ లిక్కర్ కేసులో న్యాయస్థానం తీర్పు, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేసిన ట్వీట్‌పై కవిత బిఆర్‌కె భవన్ వద్ద మీడియాతో మాట్లాడారు. తాను ఐదున్నర నెలల పాటు కుటుంబానికి దూరంగా ఉన్నానని, అవమానాలు, బాధ, వ్యక్తిత్వ హననాన్ని ఎదుర్కొన్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని కోట్లు ఇచ్చినప్పటికీ తనకు జరిగిన అవమానం తీరబోదని, తన కుటుంబానికి అన్యాయం జరిగిందన్నారు. బిఆర్‌ఎస్ ఓటమిని తన మెడలో వేయాలనే తాపత్రయం ఎందుకని ప్రశ్నించారు. వాస్తవాన్ని అంగీకరించే ధైర్యం కూడా ఉండాలని, ప్రజలకు జవాబుదారిగా ఉండాలని, ఎన్నికల్లో ఓడిపోతే ధైర్యంగా ఒప్పుకోవాలని, కానీ కారణాలను వెతకొద్దని సూచించారు. తీర్పు రాగానే బిఆర్‌ఎస్ సోషల్ మీడియాలో సన్నాయి నొక్కులు నొక్కుతోందని, బిఆర్‌ఎస్ తన కోసమే ఓడిపోయినట్టుగా చెబుతున్నదని, ఒకవేళ తన కేసు వల్లనే ఓడిపోతే, అప్పుడే ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ ఓడిపోయిన తర్వాతనే తనను అరెస్ట్ చేశారని కవిత గుర్తు చేశారు. తనను అరెస్ట్ చేస్తే, కెసిఆర్, పార్టీ పెద్ద నాయకులు కనీసం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడలేకపోయారని అన్నారు. బతుకమ్మను ఎత్తుకున్నట్టుగా తన నెత్తిన లిక్కర్ బాటిళ్లు పెట్టి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తే, దానిని బిఆర్‌ఎస్ సోషల్ మీడియా ఎందుకు ఎదుర్కొలేకపోయిందన్నారు. న్యాయం తన వైపు ఉన్నదని, అందుకే ప్రకృతి తమకు సహకరిస్తుందన్నారు. ప్రజలు ఆనాడు ఇండ్లు, ఉద్యోగాలను ఇవ్వలేదని, దోపిడీదారులకు టికెట్లు మార్చాలని ఎంత మంది చెప్పినప్పటికీ మార్చకుండా వారినే మళ్లీ ప్రజలపైన రుద్దేందుకు ప్రయత్నించడం, అన్నింటి కంటే ఎక్కువ ఆహంకారం అనే అంశం చర్చలలో లేదా? అని కవిత నిలదీశారు. ఈ తీర్పు ను బిఆర్‌ఎస్ అనుకూలంగా మర్చుకునేందుకు ప్రయత్నిస్తోందన్నారు. పార్టీ కోసమే తనపై కేసు నమోదు చేశారని, తాను ఒంటరిగానే కేసును ఎదుర్కొన్నానని కవిత వివరించారు.

## మద్యం స్కాం వల్లే బిఆర్‌ఎస్‌కు
# రాజకీయంగా నష్టం..
## కవితకు న్యాయం జరిగింది : కెటిఆర్



‘మద్యం కుంభకోణం అనే సాకుతో కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ ప్రభుత్వాన్ని కూల్చారని, ఆ కేసు వల్ల అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ రాజకీయంగా నష్టపోయిందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. ఈ కేసులో కవితకు న్యాయస్థానంలో న్యాయం జరిగిందని, తమ నాయకులపైన నమోదైన ప్రతి కేసు కూడా అబద్ధమని, రాజకీయ ప్రేరేపితమని, కల్పితమని త్వరలోనే తేలిపోతుందని కెటిఆర్ శుక్రవారం ట్విట్ చేశారు. దురదృష్టవశాత్తూ, సాక్ష్యాల కంటే ఆరోపణలకే ప్రాధాన్యతనిస్తూ, న్యాయ ప్రక్రియ కంటే మీడియా కథనాలే మిన్న అనే ధోరణి ‘నవ భారతం’లో అలవాటుగా మారిందని, కానీ చివరికి, న్యాయమే గెలుస్తుందని కెటిఆర్ అన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిందేమిటి?

● కేంద్రమంత్రి బండి సంజయ్

ప్రజాపక్షం/కరీంనగర్ : మోదీ పేదలందరికీ ఇండ్లు నిర్మించి ఇచ్చే విషయంలో పోటీ పడుతుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్లను కూల్చే విషయంలో పోటీ పడుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. నానా కష్టాలు పడి పేదలు అప్పోసప్పో చేసి బతకడానికి ఇండ్లు కట్టుకుంటే వాటిని కూల్చడం దుర్మార్గమని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి పనితీరు మారకపోతే, రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజలే కూల్చివేస్తారని చెప్పారు. కరీంనగర్‌లోని 51వ డివిజన్‌లో శుక్రవారం రూ.16 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ భండారి వేణు సహా పలువురు నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. కరీంనగర్‌లోని 51వ డివిజన్‌లో రూ.16 లక్షల నిధులతో అభివృద్ధి పనులను చేపట్టామని, ఆ నిధులతో డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్నామన్నారు. రైతులకు రైతు భరోసా ఇవ్వాలని కోరుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శుక్రవారం బహిరంగ లేఖ రాశారు.



# పతకాలు సాధించిన యువ క్రీడాకారులు రాష్ట్రానికి గర్వకారణం

● టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్: జాతీయ స్థాయిలో తెలంగాణకు పేరు తీసుకువచ్చిన ఈ యువ క్రీడాకారులు రాష్ట్రానికి గర్వకారణమని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. క్రమశిక్షణ, కఠిన సాధన, పట్టుదలతో ముందుకు సాగితే అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించే అవకాశం ఉందన్నారు. న్యూఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పతకాలు సాధించిన తెలంగాణ క్రీడాకారులను మహేష్ కుమార్ గౌడ్ ఘనంగా సన్మానించారు. సీనియర్ 55 కేజీల కుమిటే విభాగంలో స్వర్ణ పతకం సాధించిన పి. బబ్బి వర్మ, అండర్21 సంవత్సరాల 84 కేజీల కుమిటే విభాగంలో కాంస్య పతకం గెలుచుకున్న కె.కౌశిక్ ప్రణయ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారికి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. అనంతరం మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ క్రీడలకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం ఇవ్వాల్సిన అవసరం ఉందని, గ్రామీణ స్థాయిలో క్రీడా మౌలిక సదుపాయాలు పెంపొందించాలన్నారు. తెలంగాణ యువత క్రీడా రంగంలో మరింతగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. క్రీడాకారుల కుటుంబ సభ్యులు, కోచ్‌లు ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

**మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ త్వరగా కోలుకోవాలి**

మాజీ ఎపిసిసి అధ్యక్షులు, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకి సడెన్ బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన విషయం తెలిసి ఆందోళనకు గురయ్యానని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఆయన త్వరగా కోలుకుని ప్రజా జీవితంలో మళ్లీ చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ క్లిష్ట సమయంలో ఆయనకు ఉత్తమ వైద్య చికిత్స అందుతూ ఉండాలని, వైద్యుల పర్యవేక్షణలో త్వరగా ఆరోగ్యంగా మారాలని కోరుకున్నారు. బొత్స కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని, అభిమానులు ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఆయన త్వరితగతిన కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని తెలిపారు.

**తెల్ల దొరలపై ఎగిసిన విప్లవ కెరటం చంద్రశేఖర్ ఆజాద్**

తెల్ల దొరలపై ఎగిసిన విప్లవ కెరటం, స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ అని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడిని స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు. చంద్రశేఖర్ ఆజాద్ యువతకు సాహసం, త్యాగం, దేశభక్తి అనే విలువలను ఆచరణలో చూపించిన మహనీయుడు అని కొనియాడారు. చంద్రశేఖర్ ఆజాద్ జీవితం యువతలో దేశభక్తి జ్వాలను రగిలించేదిగా నిలిచిందని, వారి ఆశయాలను సాకారం చేయడం ద్వారా నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని మహేష్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# దేశవ్యాప్తంగా మహా పంచాయతీలు నిర్వహించాలి

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ




ప్రజాపక్షం/హుజూర్‌నగర్: తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సూర్యాపేట జిల్లా కమిటి ఆఫీస్ బేరర్స్ సమావేశం దొడ్డా వెంకటయ్య అధ్యక్షతన హుజూర్‌నగర్ పట్టణంలో జరిగింది. గత కార్యక్రమాల రిపోర్టు భవిష్యత్ కర్తవ్యాలపై ప్రధాన కార్యదర్శి కంబాల శ్రీనివాస్ వివరించారు. హుజూర్‌నగర్ మున్సిపల్ ఎన్నికల్లో ఎన్నికైన చెనగాని సైదులుకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సమావేశానికి పశ్య పద్మ, కొప్పోజు సూర్యనారాయణ తెలంగాణ రాష్ట్ర కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ ఇండియా యూఎస్ వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయొద్దు, విద్యుత్ బిల్లును తిరస్కరించాలని, విత్తన బిల్లు, నాలుగు కార్మిక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, వీబీజీ రాంజీ చట్టం రద్దు, ఎంఎస్పీ సి2 50 శాతం కోసం చట్టపరమైన హామీ, రుణమాఫీ, భూ సేకరణ చట్టం 2013 అమలు వంటి ప్రధాన డిమాండ్లను సాధించే వరకు స్వతంత్ర్య పోరాటాలు, అలాగే కార్మిక సంఘాలతో కలిసి ఐక్య పోరాటాలు చేయాలని కోరారు.

# సిఫార్సులలో లోపాలు, అనుమానాలు

● ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంట రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

ప్రజాపక్షం/హైదరాబాద్: కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యా విధానంకు భిన్నంగా ‘తెలంగాణ విద్యా విధానం’ పట్ల తెలంగాణ విద్యా కమిషన్ రూపొందించిన సిఫార్సుల నివేదికపైన విద్యార్థి సంఘాలు, మేధావులు, విద్యావంతులతో చర్చలు జరపాలని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంట రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. లక్షలాది మంది తల్లిదండ్రుల అభిప్రాయాలు సేకరించి 45 పేజీల నివేదికను రూపొందించామని చెబుతున్న కమిషన్, ఒక్క విద్యార్థి సంఘం అభిప్రాయాన్ని కూడా తీసుకోకుండా నివేదిక ఎలా రూపొందించారని వారు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏ ప్రాంతం, ఏ యూనివర్సిటీ, ఏ కళాశాలలో అభిప్రాయాన్ని సేకరించారో స్పష్టం చేయాలన్నారు. ఈనివేదికలో కొన్ని సిఫార్సులు బాగున్నాయని, అందులో విద్యార్థి సంఘాలకు ఎన్నికల నిర్వహణ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టడం మంచిగానే ఉన్నప్పటికీ, విద్యార్థులకు ఉత్తీర్ణత శాతం 35 శాతం నుంచి 45 పెంచాలనే సిఫార్సు, ఎప్‌సెట్ రద్దు, మార్కుల ఆధారంగా సీట్లు లాంటి సిఫార్సులు ప్రైవేట్ ,కళాశాలలకు మద్దతు ఇస్తున్నదని వారు తెలిపారు. విద్యా కమిషన్ చేసిన సిఫార్సులలో లోపాలు, అనుమానాలు ఉన్నాయన్నారు. విద్యా కమిషన్ సిఫార్సులను పూర్తిగా అమలు చేస్తామంటే మాత్రం తాము ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ హెచ్చరించారు.

# కుమ్మెర ఘటనపై చర్యలు తీసుకోవాలి




● డిజిపి కార్యాలయం ముందు బిసి, ఎస్‌సి, ఎస్‌టి జెఎసి నిరసన

ప్రజాపక్షం/హైదరాబాద్: నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగిన రెండు నెలల శిశువు మృతి కుమ్మెర ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని బిసి, ఎస్‌సి, ఎస్‌టి జెఎసి నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు జెఎసి ఆధ్వర్యంలో లక్డికాపూల్‌లోని డిజిపి కార్యాలయం ముందు జెఎసి నేతలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి ఛైర్మన్ డా.విశారదన్, అధ్యక్షులు తోట్ల రాఘవేంద్ర ముదిరాజ్‌లు మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇటీవల జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయడంతో పాటు అవసరమైన రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కుమ్మెర ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పోలీసులు అమలు చేస్తున్న ఆంక్షలను పునర్విమర్శించాలని, అమాయకులపై కేసులు నమోదు చేయరాదని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 26న నాగర్ కర్నూల్ కేంద్రంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నట్లు జెఎసి నేతలు తెలిపారు. అంతకుముందు డిజిపి శివధర్‌రెడ్డిని జెఎసి నేతలు కలిసి వినతిపత్రం అందించారు. సమాజంలోని బలహీన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టాలని, చట్టపరమైన రక్షణ చర్యలను కఠినంగా అమలు చేయాలని జెఎసి నేతలు డిజిపిని కోరారు. డిజిపిని కలిసిన వారిలో బిఎస్‌పి హైదరాబాద్ అధ్యక్షులు రాజ్‌కమల్ రెడపాకసాయి వినోద్‌యాద్, బాలయ్య, కార్తిక్‌లు ఉన్నారు.

## నిందితులను కఠినంగా శిక్షించాలి: కవిత

నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో కుల వివక్ష నేపథ్యంలో జరిగిన దాడిలో రెండు నెలల పసి బిడ్డ మృతి చెందిన ఘటనపై నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠిన శిక్షలు విధించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. లక్డీకపూల్‌లోని డిజిపి కార్యాలయం వద్ద బాధితురాలు మౌనిక, గణేశ్‌లతో కలిసి మీడియాతో కవిత మాట్లాడుతూ, ఈ అమానవీయ ఘటనను తీవ్రంగా ఖండించారు. రెండు నెలల చిన్నారి మరణానికి సంబంధించి పోలీసులు సరైన సెక్షన్లు నమోదు చేయలేదని, కేసులో అనేక కోణాలు ఉన్నప్పటికీ అవి పరిగణనలోకి తీసుకోలేదని ఆమె ఆరోపించారు. ఈ కేసులో పోలీసులు, ప్రభుత్వం కలిసి నిందితులను రక్షించే ప్రయత్నం చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి మద్దతుగా బిసి, ఎస్‌సి, ఎస్‌టి జెఎసి నేత విశారదన్ మహరాజ్ అండగా ఉన్నారని, జాగృతి తరఫున కూడా పూర్తి సహకారం అందిస్తామని కవిత తెలిపారు.అంతకుముందు డిజిపి బి.శివధర్‌రెడ్డిని కలిసి ఘనటకు బాధ్యులైన నిందితులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి
# ఎక్సైజ్ రిటైర్డ్ ఉద్యోగుల ఆసరా



● ఒకరోజు పెన్షన్ రూ.2.80 లక్షల చెక్కు అందజేత

● త్వరలోనే 2,500 మంది ఎక్సైజ్ కానిస్టేబుళ్ల బదిలీలు: మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్: విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి ఎక్సైజ్ శాఖ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ అండగా నిలిచింది. అసోసియేషన్ సభ్యులు తమ ఒక రోజు పెన్షన్ మొత్తాన్ని విరాళంగా ప్రకటించారు. ఈ మేరకు రూ.2.80 లక్షల చెక్కును ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం సచివాలయంలో సౌమ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కష్టకాలంలో ఉన్న ఒక సహోద్యోగి కుటుంబానికి విశ్రాంత ఉద్యోగులు తమ పెద్ద మనసుతో అండగా నిలవడం అభినందనీయమని కొనియాడారు. అంకితభావంతో పనిచేస్తూ ప్రాణాలు కోల్పోయిన సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం ఇప్పటికే రూ. కోటి ఆర్థిక సాయంతో పాటు, ఆమె సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించిందని గుర్తుచేశారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ఎక్సైజ్ సిబ్బంది కృషిని ప్రభుత్వం గుర్తిస్తుందని, వారికి అన్నివేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు ముకుంద రెడ్డి, ప్రతినిధులు విష్ణు స్వరూప్ రెడ్డి, నిజామాబాద్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, సౌమ్య కుటుంబ సభ్యులుపాల్గొన్నారు.

**వారంలోగా ఎక్సైజ్ శాఖలో బదిలీలు**

ఎక్సైజ్ శాఖలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బదిలీల ప్రక్రియకు మోక్షం లభించనుందని మంత్రి జూపల్లి వెల్లడించారు. వారం రోజుల్లోగా సుమారు 2,500 మంది కానిస్టేబుళ్ల బదిలీలను పూర్తి చేస్తామని, అనంతరం ఇతర హోదాల్లోని అధికారుల బదిలీలను దశలవారీగా చేపడతామని వివరించారు.

**కుమ్మెర ఘటన బాధకరం**

నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లికార్జున స్వామి జాతరలో చిన్నారి మృతి చెందడం పట్ల మంత్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు ప్రధాన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారని, మిగిలిన వారి కోసం గాలిస్తున్నారని తెలిపారు.

**పర్యాటక రంగంలో నూతన ఒరవడి**

తెలంగాణను దేశీ, విదేశీ పర్యాటకులకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చేందుకు మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. నూతన పర్యాటక విధానం ద్వారా వాటర్ స్పోర్ట్స్, ఎకో, వెల్నెస్ టూరిజంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. పర్యాటక ప్రాంతాలకు వెళ్లే రహదారుల వెంట పర్యాటకులకు సమాచారం అందించే సైన్ బోర్డులను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.



## హక్కుల సాధన కోసం కలిసికట్టుగా పనిచేయండి

నిరంజన్, మెట్టు సాయికుమార్

ఆరె కటిక హైదరాబాద్ అధ్యక్షునిగా రాజేష్ గోలికర్, కార్యదర్శిగా సందీప్ కాంబ్లీకార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆరె కటిక కులస్తులు తమ హక్కుల సాధన కోసం కలిసికట్టుగా పనిచేయాలని తెలంగాణ బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్, తెలంగాణ రాష్ట్ర ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ సూచించారు. హైదరాబాద్‌లోని బొగ్గులకుంటలో 'తెలంగాణ సరస్వతి విద్య పరిషత్'లో తెలంగాణ ఆరె కటిక సంఘం, హైదరాబాద్ కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్, ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి, ఆల్ ఇండియా అరె కటిక సంఘ సంరక్షకులు ప్రేమ్‌లాల్ నేతికర్ హాజరయ్యారు. ఆరె కటిక సంఘం హైదరాబాద్ అధ్యక్షునిగా రాజేష్ గోలికర్, కార్యదర్శిగా సందీప్ కాంబ్లీకర్, కోశాధికారిగా జమాల్‌పూర్ సాయితో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆరె కటిక కులానికి విశిష్ట సేవలను అందించిన జమాల్‌పూర్ శంకర్‌తో పాటు పలువురికి 'కర్మట్ సేవా' అవార్డులను ప్రదానం చేశారు. బిచ్చుకరి సూర్యకు అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరె కటిక కులస్తులు రాజకీయ, సామజిక, ఆర్థిక, వ్యాపార రంగాలలో ఎదిగేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అరెకటిక అధ్యక్షులు మిర్యాలకార్ పుష్పరాజ్ , జిల్లా సెక్రటరీ మోహన్‌లాల్ నేతికర్‌పాల్గొన్నారు.కాగా నూతన కమిటీ సభ్యులను సన్మానించారు.

## బహిరంగ వేలం ద్వారా హౌసింగ్‌బోర్డ్‌కు రూ.24.26కోట్ల ఆదాయం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని కెపిహెచ్‌బిలో గజం భూమి రూ.2.65లక్షలకు, 1400 చదరపు అడుగుల ఫ్లాట్‌కు (ఎస్‌ఎఫ్‌టి)రూ.1.10 కోట్ల ధర పలికింది. కెపిహెచ్‌బిలోని ఫేజ్1,2 లోని ధర్మారెడ్డి కాలనీలోని 4 ఓపెన్ ప్లాట్లు, ఫేజ్ 15లోని సంపూర్ణం అపార్ట్ మెంట్ లోని 8 ఫ్లాట్లకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. బహిరంగ వేలం ద్వారా హౌసింగ్ బోర్డ్‌కు సుమారు రూ.24.26 కోట్ల ఆదాయం రాగా, ఇందులో ఓపెన్ ప్లాట్ల ద్వారా రూ.15.81 కోట్లు, సంపూర్ణం అపార్ట్‌మెంట్ లోని ఫ్లాట్ల ద్వారా రూ.8.45కోట్ల ఆదాయం వచ్చింది. మొత్తం 40 మంది కొనుగోలుదారులు వేలంపాటలో పాల్గొన్నారు. ఈ వేలంపాటలో ఎల్ ఐజి కేటగిరీకి చెందిన ప్లాట్ చదరపు గజం కనీస ధర రూ.1.30 లక్షలుగా నిర్ధారించగా, చదరపు గజం రూ.2.65 లక్షలకు అమ్ముడు పోయిందని. మరో ప్లాట్‌ను చదరపు గజం రూ.2.41 లక్షలకు కొనుగోలు చేశారని హౌసింగ్‌బోర్డు వైస్‌చైర్మన్ వి.పి.గౌతం వెల్లడించారు. బహిరంగ వేలంపాటను పూర్తి పారదర్శకంగా నిర్వహించామని, తమకు నచ్చిన ఫ్లాట్లను దక్కించుకునేందుకు బిడ్డర్లు పోటీపడ్డారని పేర్కొన్నారు. సంపూర్ణం అపార్ట్ మెంట్ లో ఖాళీగా ఉన్న ఫ్లాట్లకు రూ.90లక్షలను అప్ సెట్ ధరగా నిర్ధారించగా వీటిని కొనుగోలు చేయడానికి కూడా బిడ్డర్లు పోటీ పడి గరిష్టంగా రూ.1.10కోట్లు, అలాగే ఇతర ఫ్లాట్లను రూ.1.08 కోట్లు, రూ.1.07 కోట్లు, రూ.1.06 కోట్లకు కొనుగోలు చేశారు.

## కాళేశ్వరం కమిషన్‌ను రద్దు చేయండి

కెసిఆర్ లాయర్ వాదన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై నియమితమైన జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్‌ను రద్దు చేయాలంటూ మాజీ సీఎం కేసీఆర్ తరఫు న్యాయవాది శుక్రవారం హైకోర్టులో వాదించారు కమిషన్ ముందుగా తనను సాక్షిగా పిలిచిందని, ఆ తర్వాత ఆరోపణలపై వివరణ తీసుకోకుండానే బాధ్యుడిగా పేర్కొందన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణలో జరిగిన అవకతవకలపై విచారణ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం 2024 మార్చి 14న జారీ చేసిన జీఓ 6 ద్వారా జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. కమిషన్ రిపోర్టును ప్రభుత్వానికి సమర్పించింది. ఈ రిపోర్టును రద్దు చేయాలని, కమిషన్ ఏర్పాటు చట్ట వ్యతిరేకమని ప్రకటించాలని కోరుతూ కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, రిటైర్డు ఐఏఎస్ ఎస్‌కే జోషి, ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్ వేసిన వేరువేరు పిటిషన్లను చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌ల డివిజన్ బెంచ్ విచారించింది. సీనియర్ అడ్వొకేట్ శేషాద్రినాయుడు వాదిస్తూ, కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ చట్టం కింద సెక్షన్ 4, 5 ప్రకారం కేసీఆర్‌ను సాక్షిగా విచారణకు హాజరుకావాలని కమిషన్ నోటీసులు ఇచ్చిందన్నారు. ఇతరుల సాక్ష్యాల ఆధారంగా కమిషన్ పిటిషనర్లపై తుది నిర్ణయానికి వచ్చే ముందు సెక్షన్ 8బి, 8సి ప్రకారం ముందస్తు వివరణ కోసం నోటీసులు ఇవ్వలేదన్నారు. సాక్షులను క్రాస్ ఎగ్జామ్ చేసే అవకాశం ఇవ్వలేదన్నారు. నివేదికలో ప్రాజెక్టు డిజైన్, టెండర్లు, కాంట్రాక్టర్ల ఎంపిక తదితర అంశాల్లో నాటి సీఎం కేసీఆర్‌ను బాధ్యుడిగా పేర్కొనడం ఏకపక్షమన్నారు. కేసీఆర్ వల్ల రూ.7,500 కోట్ల నష్టం జరిగినట్లు కమిషన్ ఒక నిర్ణయానికి రావడం చెల్లదన్నారు. పిటిషనర్‌పై ఆరోపణలు ఉంటే వాటికి చెందిన ఆధారాలు, సాక్ష్యాలను కమిషన్ ఇవ్వాలని, వివరణ తీసుకోవాలని, ఆరోపణలు చేసిన వాళ్లను కేసీఆర్ ఇతర పిటిషనర్లు వేర్వేరుగా క్రాస్ ఎగ్జామ్ చేయాలని, ఈ అవకాశాలు కమిషన్ ఇవ్వకుండానే తుది రిపోర్టు ఇవ్వడం చెల్లదన్నారు. విచారణ మార్చి 2కు వాయిదా పడింది.

## కెబిఆర్ ప్రాజెక్ట్ పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని కెబిఆర్ ప్రాజెక్టు పనులకు శుక్రవారం శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి చీఫ్ ఇంజనీర్ సహదేవ రత్నాకర్, ఎస్ఇ మోహన్ రెడ్డి,నిర్మాణ సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ ప్రాజెక్ట్‌ను మొత్తం రూ. 1,090 కోట్ల అంచనా వ్యయంతో రెండు ప్యాకేజీలుగా విభజించి చేపట్టుతున్న ఈ ప్రాజెక్టును నిర్మాణ సంస్థ మెగా దక్కించుకుంది. ప్యాకేజీ1: రూ. 580 కోట్లతో జుబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ , కెబిఆర్ ఎంట్రన్స్ జంక్షన్ల వద్ద ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లను నిర్మించనున్నారు. ప్యాకేజీ2: రూ. 510 కోట్లతో నంబర్ 45 జంక్షన్, ఫిలింనగర్ జంక్షన్, మహారాజ్ అగ్రసేన్ జంక్షన్, క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ల వద్ద ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లను నిర్మిస్తారు. ప్రాజెక్టు పనులకు ట్రాఫిక్ విభాగం ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందిరాత్రి సమయాల్లో బారికేడ్లు ఏర్పాటు చేస్తూ, పునాదుల కోసం ఎర్త్ వర్క్ (మట్టి తవ్వకం) పనులు తక్షణమే ప్రారంభిస్తారు.ఈ ప్రాజెక్టు పూర్తయితే జుబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో సిగ్నల్ లేని సాఫీగా ప్రయాణం సాధ్యమవుతుందని, వేలాది మంది వాహనదారులకు సమయం ఆదా అవుతుందని అధికారులు తెలిపారు.

# మహిళా పోలీసు సాధికారతకు ప్రభుత్వం చేయూత

సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో మహిళా పోలీసుల సాధికారతకు ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మహిళా పోలీసులపై నిర్వహించిన తొలి రాష్ట్ర సదస్సు పుస్తకంతో పాటు తెలంగాణ పోలీసు అకాడమీ వార్షిక మాసపత్రిక–2025ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతలు, దర్యాప్తు, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు వంటి కీలక విభాగాల్లో మహిళా పోలీసులు పెరుగుతున్న పాత్ర పోషిస్తున్నారని అన్నారు. మహిళా పోలీసుల నియామకం, సేవల నిలుపుదల, శిక్షణ, పదోన్నతుల అంశాల్లో ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేసేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా తమిళనాడు వంటి రాష్ట్రాల అనుభవాలను పరిశీలించి, తెలంగాణలో అమలు చేయగల విధానాలపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పోలీస్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మహిళా పోలీసుల కోసం మౌలిక వసతుల అభివృద్ధి, స్టేషన్లలో మహిళా ఎస్‌హెచ్‌ఒల నియామకం, ఆర్మ్డ్ రిజర్వ్ దళాల్లో మహిళల భాగస్వామ్యం పెంపు, శిక్షణా సంస్కరణలు, యూనిఫామ్ సౌకర్య మార్గదర్శకాలు వంటి అంశాలు ముఖ్యంగా ప్రస్తావనకు వచ్చాయి. మహిళా సిబ్బందికి ప్రత్యేక విశ్రాంతి గదులు, క్రెచ్ సదుపాయాలు, బందోబస్తు సమయంలో మొబైల్ టాయిలెట్లు, పహారా కోసం స్కూటర్ల ఏర్పాటు వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే మహిళా నాయకత్వాన్ని పెంపొందించేందుకు పోలీస్ స్టేషన్లలో మహిళా అధికారులను నియమించడం అవసరమని అధికారులు అభిప్రాయపడ్డారు.

ఈ పుస్తకాల విడుదలతో మహిళా పోలీసుల పాత్రను గుర్తించి, లింగ సమానత్వాన్ని బలోపేతం చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో ముందడుగు వేసిందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో సమాన అవకాశాలు కలిగిన ఆధునిక పోలీసు వ్యవస్థ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కార్యక్రమం ద్వారా స్పష్టమైంది. ఈ కార్యక్రమంలో డిజిపి బి.శివధర్‌రెడ్డితో పాటు ఐపిఎస్ అధికారులు అభిలాష బిస్త్, శిఖాగోయల్, స్వాతిలక్రా, చారుసిన్హా, శ్వేతారెడ్డి, శిల్పవల్లితో పాటు పలువురు అధికారులు ఉన్నారు.

# పత్తి విత్తన రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పత్తి విత్తన రైతుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాముఖ్యతనిస్తుందని, రుణమాఫీ, భరోసా, బోనస్‌ను చెల్లిస్తూ రైతులకు సిఎం అండగా నిలబడ్డారన్నారు. రాష్ట్రంలో విత్తన పంటలు సాగు చేస్తున్న రైతుల సమస్యలను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ కార్యాలయంలో కమిషన్ చైర్మన్ కోదండరెడ్డితో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు గోపాల్‌రెడ్డి, భవానీరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత ప్రస్తావించిన పలు అంశాలపై కోదండరెడ్డి స్పందిస్తూ, గద్వాల్ రైతులకు రావాల్సిన రూ.200 కోట్ల బకాయిల అంశాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కోదండరెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం మంచి సాంప్రదాయమని, కవిత ఒక ప్రతిపక్ష నాయకురాలిగా పనిచేస్తున్నారన్నారు. గద్వాల్ జిల్లాలో పత్తి విత్తనాలు ఏళ్ల తరబడిగా పండిస్తున్నారన్నారు. పంటల మార్పిడి చేయాలని, ఇతర పంటలకు కూడా బోనస్ ఇచ్చే అంశంపై ప్రభుత్వంతో చర్చించారన్నారు. పత్తి కొనుగోలు అంశంలో కేంద్రం ఆంక్షలు పెట్టడం సరికాదని, వరి కొనుగోలు విషయంలో కూడా ఎఫ్‌సిఐ ఇబ్బంది పెడుతోందని, కేంద్ర ప్రభుత్వ చట్టాలు రైతులకు ఇబ్బందికరంగా ఉన్నాయన్నారు. కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ కరీంనగర్‌లో వరి విత్తనాలు పండిస్తున్న రైతులకు ఎకరానికిరూ 75 వేలు ఇస్తున్నారని, కానీ గద్వాల్‌లో సీడ్ విత్తనం పండించే రైతులకు అడ్వాన్స్, ఫెస్టిసైడ్స్‌కు ఇచ్చే డబ్బులకు కూడా భూమి తనఖా పెట్టించుకుంటున్నారని వివరించారు. కరీంనగర్‌లో వరి సీడ్ పండించే రైతులకు ప్రొక్యూర్ చేసిన తర్వాత మిగిలిన వాటిని కమర్షియల్‌గా అమ్ముకునే స్వేచ్ఛ ఉన్నదని, గద్వాల్‌లో సీడ్ పత్తి రైతులను మల్టీ లెవల్‌లో మోసం చేస్తున్నారని వివరించారు. సీడ్ పత్తి ఆర్గనైజర్స్, మధ్యవర్తులు రైతులను పట్టి పీడిస్తున్నారన్నారు.

కరీంనగర్ రైతుల తరహా గద్వాల్ రైతులకు కూడా ఎకరానికి రూ.75వేలు ఇచ్చే విధంగా చూడాలని, సీడ్ ఇచ్చిన తర్వాత విఫలమైతే రైతుకు సంబంధం ఉండకూడదని కోరారు. ఈ సమావేశంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గొంగళ్ల రంజిత్ కుమార్, కన్వీనర్ బుచ్చిబాబు, జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్.రూప్‌సింగ్, ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, రైతు జాగృతి అధ్యక్షుడు నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు
## సౌందర రాజన్ మృతికి ప్రముఖుల సంతాపం

ఆధ్యాత్మిక చైతన్యం విస్తరింపజేయడంలో సౌందర్ రాజన్ కీలక పాత్ర: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రముఖ పుణ్య క్షేత్రం చిలుకూరు శ్రీ బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సౌందర రాజన్ మరణించారన్న వార్త తెలిసి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం అధ్యాపకుడిగా, రిజిస్ట్రార్‌గా ఎంతో మంచి పేరు గడించిన సౌందరరాజన్, ఆధ్యాత్మిక చైతన్యం విస్తరింపజేయడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. చిలుకూరు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. సౌందరరాజన్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ దుఃఖ సమయంలో వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించాలని భగవంతుడిని ప్రార్థించారు.

**సౌందర రాజన్ మరణం హైందవ ఆధ్యాత్మిక రంగానికి తీరని లోటు : మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్**

తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన చిలుకూరి బాలాజీ దేవస్థానం ప్రధాన అర్చకులు సౌందర రాజన్ మరణం పట్ల తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సంతాపం ప్రకటించారు. సామాజిక విలువలకు ప్రాధాన్యతనిస్తూ, తనదైన శైలిలో దైవ సేవ చేయడం ద్వారా, సౌందర రాజన్ 'ప్రజా పూజారి' గా ప్రసిద్ధిగాంచారని తెలిపారు. సౌందర్ రాజన్ మరణం హిందూ ఆధ్యాత్మిక రంగానికి తీరనిలోటని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. ఆయన మరణంతో శోకతప్తులైన కుటుంబ సభ్యులకు, భక్తులకు, వారి అభిమానులకు కెసిఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**సౌందర రాజన్ నిబద్ధత అనేక మందికి స్ఫూర్తిదాయకం : టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్**

దశాబ్దాల పాటు చిలుకూరి బాలాజీ ఆలయంలో భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం అందిస్తూ, దేవస్థానం ప్రతిష్ఠను దేశవ్యాప్తంగా నిలబెట్టడంలో సౌందర రాజన్ సేవలు విశేషమని టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కమార్ గౌడ్ కొనియాడారు. భక్తుల మనోభావాలను గౌరవిస్తూ ఆలయ పరంపరలను కాపాడటంలో ఆయన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక విలువలు, సాంప్రదాయ పరిరక్షణ, సమాజ సేవ పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత అనేక మందికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. సౌందర రాజన్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యం ప్రసాదించాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## జర్నలిస్ట్ పాస్‌పోర్టు రద్దు కరెక్టే

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రెండు వేర్వేరు పేర్లతో ఉన్న పాస్‌పోర్టులను చూపించిన ఘటనలో పాస్‌పోర్టు అధికారుల రద్దు నిర్ణయాన్ని సమర్థిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ ఆమోదించింది. జర్నలిస్టు సయ్యద్ అలి హుస్సేన్ రిజ్వీ పాస్‌పోర్టు రద్దును గతంలో సింగిల్ జడ్జి సమర్థిస్తూ తీర్పు చెప్పారు. ఈ తీర్పును సవాలు చేస్తూ జర్నలిస్ట్ దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణ జరిపిన డివిజన్ బెంచ్, పిటిషనర్ వ్యవహారాన్ని తప్పుపట్టింది. సింగిల్ జడ్జి తీర్పులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. ఒక పేరుతో ఉన్న పాస్‌పోర్టు కాపీతో పాటు మరో పేరుతో ఉన్న పాస్‌పోర్టును చూపి రెండూ తనవేనని చెప్పడం ద్వారా అధికారులను తప్పుదారి పట్టించారని బెంచ్ తేల్చింది. అప్పీల్‌ను డిస్మిస్ చేసింది.

## మూసీ నది ప్రక్షాళనతో తెలంగాణ ఖ్యాతి పెరుగుతుంది

టిపిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మూసీ నది ప్రక్షాళనతో తెలంగాణ ఖ్యాతి పెరుగుతుందని టిపిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ పేర్కొన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బిజెపి నేతలకు గాంధీ విగ్రహం పెట్టడం మింగుడు పడటం లేదని, గాంధీ సరోవర్ ప్రాజెక్టును అడ్డుకోవడానికి బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు పోటీపడుతున్నాయని, ఇకనైనా చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. మూసి పరిసర ప్రాంతాల ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. హైదరాబాద్‌లోని మూసి రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అనేది మూసి నది యొక్క 55కి.మీ విస్తీర్ణాన్ని శుభ్రపరచడం, కారిడార్‌గా మార్చాడం స్వాగతించాలని, భావి తరాలకు ఒక ప్రధాన పునర్జీవ నది ఏర్పాటు చేయాలనే ఆలోచన సిఎం రేవంత్ రెడ్డికి ఉందని కొనియాడారు. బిఆర్‌ఎస్ పాలనలో బాధితులతో ఎలా వ్యవరించారో గతంలోనే తాము చూసామని, ఈ మధ్య కూడా మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పార్టీ నేతల నిరసన చూసామని ఎద్దేవా చేశారు. బాధితుల పక్షాన ప్రతి పక్షాలు హుందాగా వ్యవ రించాలి కానీ, కడుపులో విషాలు పెట్టుకొని ఉద్దేశ పూర్వకంగా వ్యవరిస్తున్నారని మండిపడ్డారు. పది ఏళ్లు అధికారంలో ఉండి మూసీ నది కనీసం ఒక గారకను కూడా పీకలేదన్నారు. బిఆర్‌ఎస్, బిజెపి లాంటి వెన్నపూస లేని నేతలు తెలంగాణలో ప్రతిపక్షంగా ఉండడం మన దౌర్భాగ్యమన్నారు. నిత్యం వరదలతో, మురికి కంపుతో అల్లాడుతున్న ప్రజల బాధలు గత పాలకులు పట్టించుకోలేదని విమర్శించారు. మూసి అభివృద్ధితో పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి, పొల్యూషన్ లేని నగర నిర్మాణం సిఎం రేవంత్ రెడ్డి పాలనలో ప్రజలకు మోక్షం లభించిందని అన్నారు. మూసి బాధితులతో చిల్లర రాజకీయాలు మానుకొని, మూసి అంటే మురికి నీరు కాదు, పునర్జీవ నదీగా అభివృద్ధిలో భాగం కావాలని చనగాని దయాకర్ హితవు పలికారు.

### బల్కంపేట దేవాలయంలో ...
# మంత్రి కొండా సురేఖ ఆకస్మిక తనిఖీ

భద్రత,నిధులు, పార్కింగ్, విరాళాలు, టికెట్ల వ్యవస్థపై ఆరా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భక్తుల నుంచి వరుసగా అందిన ఫిర్యాదుల నేపథ్యంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుక్రవారం హైదరాబాద్‌లోని శ్రీ బల్కంపేట ఎల్లమ్మ దేవాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా దేవాలయానికి చేరుకున్న మంత్రి అక్కడి పరిపాలన, ఆర్థిక లావాదేవీలు, భక్తులకు అందుతున్న సదుపాయాలు, శుభ్రత, భద్రతా ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. దేవాలయ ప్రాంగణంలో వివిధ విభాగాలను స్వయంగా సందర్శించిన మంత్రి సంబంధిత అధికారులను పలు అంశాలపై ప్రశ్నించి వివరాలు కోరారు. భక్తుల క్యూలైన్ల నిర్వహణ, ప్రత్యేక దర్శనాల వ్యవస్థ, టికెట్ జారీ విధానం, హుండీ లెక్కింపు ప్రక్రియ, ప్రసాదాల తయారీ మరియు పంపిణీ, అన్నదాన నిర్వహణ, శానిటేషన్ పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించారు.

**విరాళాలు, టికెట్ వ్యవస్థపై సమగ్ర విచారణ**

విరాళాలు, ప్రత్యేక దర్శన టికెట్ల జారీ విధానంపై పారదర్శకత ఉండాలని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. టికెట్ కౌంటర్లలో నగదు లావాదేవీలు కచ్చితంగా రికార్డుల్లో నమోదు చేయాలని, రోజువారీ లెక్కలు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. రిజిస్టర్‌లు, ఆన్‌లైన్ నమోదు వివరాలు, సిసి కెమెరాల ఫుటేజ్‌ను సమీక్షించాలని సూచించారు. ఎలాంటి అవకతవకలు చోటుచేసుకున్నా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**హుండీ లెక్కింపు – బ్యాంకు జమపై కఠిన ఆదేశాలు**

హుండీ లెక్కింపు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, లెక్కింపు అనంతరం నగదు తక్షణమే బ్యాంకులో జమ చేయాలని మంత్రి ఆదేశించారు. హుండీ లెక్కింపులో పాల్గొనే సిబ్బంది హాజరు, విధి విధానాలు, లెక్కల సమగ్ర నివేదికను సమర్పించాలని చెప్పారు. దేవాలయ ఖాతాల్లో ఉన్న నిధుల వివరాలు, గతంలో వచ్చిన విరాళాల వినియోగంపై పూర్తి సమాచారం అందించాలని సూచించారు.

**ప్రసాదాల నాణ్యత, బరువు ప్రమాణాలు కచ్చితంగా పాటించాలి**

భక్తులకు అందించే ప్రసాదాల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని మంత్రి పేర్కొన్నారు. పులిహోర ప్యాకెట్లు 200 గ్రాములు, బెల్లం ప్యాకెట్లు 160 గ్రాముల బరువుతో అందించాలనే నిబంధనను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ప్రసాదాల తయారీ ప్రాంతాన్ని పరిశీలించి, శుభ్రతా ప్రమాణాలు కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఆహార భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. శుభ్రత, శానిటేషన్ సదుపాయాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భద్రతా ఏర్పాట్లు, బంగారు నిల్వల పరిశీలించారు. రూ.16.5 లక్షల విరాళం వినియోగంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. పార్కింగ్, కాంట్రాక్టుల వ్యవహారంపై ఆరా తీశారు. భక్తుల ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా,ఆధ్యాత్మిక వాతావరణంలో దర్శనం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటి నుంచి ప్రతీ దేవాలయాన్ని సందర్శిస్తారని, దేవాలయ భూములు ఇతరత్రా ఆస్తుల విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒకరిద్దరు అధికారుల నిర్లక్ష్యం వల్ల మొత్తం దేవాదాయ శాఖ అప్రతిష్ట పాలైందని వారు కూడా తీరు మార్చుకోవాలని హెచ్చరించారు.

# ఇక రవీంద్రభారతిలో ఆన్‌లైన్ బుకింగ్‌లు

వెబ్‌సైట్‌ను ఆవిష్కరించిన మంత్రి జూపల్లి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చారిత్రక రవీంద్ర భారతి వేదికగా కళా ప్రదర్శనలు, సాంస్కృతిక , ఇతర కార్యక్రమాలు నిర్వహించుకునే వారికి ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఇకపై హాల్ బుకింగ్ కోసం కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, ఇంటి నుండే ఆన్‌లైన్ ద్వారా స్లాట్లను బుక్ చేసుకునే సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రవీంద్రభారతి శుక్రవారం నూతన వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా బుకింగ్ ప్రక్రియలో పారదర్శకత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నిర్వాహకులు వెబ్‌సైట్‌లో తమకు కావలసిన తేదీన స్లాట్ ఖాళీగా ఉందో లేదో స్వయంగా పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఒకవేళ స్లాట్ అందుబాటులో ఉంటే వెంటనే పేమెంట్ రిక్వెస్ట్ వస్తుందని, నగదు చెల్లించగానే ఆ తేదీన వారి పేరిట రిజర్వ్ అవుతుందని వివరించారు. ఒకవేళ కోరుకున్న స్లాట్ ఖాళీ లేకపోతే, సదరు అభ్యర్థనను 'వెయిటింగ్'లో ఉంచుతారని, ఆ తర్వాత ఎప్పుడైనా ఖాళీ ఏర్పడితే ప్రాధాన్యత క్రమంలో మేనేజ్‌మెంట్ పేమెంట్ రిక్వెస్ట్ పంపిస్తుందని పేర్కొన్నారు. రవీంద్రభారతిలోని 1036 సామర్థ్యం కలిగిన మెయిన్ హాల్, 120 సీట్ల మినీ హాల్ తో పాటు 100 మంది కూర్చునే సౌకర్యమున్న పైడి జయరాజ్ థియేటర్లను ఈ వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. అయితే పైడి జయరాజ్ థియేటర్ కేవలం లఘు చిత్రాల ప్రదర్శనకు మాత్రమే కేటాయించినట్లు అధికారులు స్పష్టం చేశారు. ప్రతి రోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం అని మూడు స్లాట్లు అందుబాటులో ఉంటాయని, ప్రదర్శనకారులు 90 రోజుల ముందే తమ స్లాట్‌ను బుక్ చేసుకునే వీలుందని తెలిపారు. కేవలం నిర్వాహకులకే కాకుండా, కళాభిమానుల సౌకర్యార్థం ప్రతి రోజూ అక్కడ జరిగే కార్యక్రమాల వివరాలను కూడా వెబ్‌సైట్‌లో పొందుపరిచామని వివరించారు. ఈ కార్యక్రమంలో భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, ఏవో గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే అధికారుల్లో వృత్తి నైపుణ్యం పెంచాలి

జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అధికారుల్లో వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా అవగాహన సదస్సు ఉపయోగపడుతుందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ తెలిపారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ''మధ్యవర్తిత్వంపై దృష్టి సారించి రైల్వేలలో వివాద పరిష్కారం'' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ, రైల్వేల్లో ఒప్పందాలకు సంబంధించిన అనేక వివాదాలు ఆర్బిట్రేషన్ ద్వారానే పరిష్కారమవుతున్న నేపథ్యంలో ఈ అంశం అత్యంత ప్రాధాన్యమైనదని పేర్కొన్నారు. పెరుగుతున్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, క్లిష్టమైన ఒప్పందాల నేపథ్యంలో తాజా చట్టపరమైన మార్పులపై అధికారులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సంస్థాగత సామర్థ్యాన్ని పెంపొందించడం, ఉత్తమ పద్ధతులను ప్రోత్సహించడం, అధికారుల్లో వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. గుంటూరు డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సుదేశ్నా సేన్ ప్రధాన ఉపన్యాసం అందించారు. రైల్వేల్లో వివాద పరిష్కార విధానాలు, ముఖ్యంగా ఆర్బిట్రేషన్ అమలు విధానం, ఆర్బిట్రేటర్ల నియామకం, విచారణ ప్రక్రియ, చట్టపరమైన పరిణామాలపై ఆమె సమగ్రంగా వివరించారు. అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాశ్, సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ అశిష్ మెహ్రోత్రా తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు. విజయవాడ, గుంటకల్, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డిఆర్‌ఎంలు సహా అన్ని ఆరు డివిజన్ల అధికారులు, మూడు వర్క్‌షాప్‌ల ప్రతినిధులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

## లెక్కింపు తరువాత వారం వరకూ

# ఇవిఎం, వివిప్యాట్ల వెరిఫై

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ స్పష్టీకరణ

తమిళనాడులో రాజకీయ పార్టీల నేతలతో భేటీ




**చెన్నై:** ఎన్నికల పారదర్శకతను పెంచేందుకు కొత్త చర్యలు తీసుకున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) వెల్లడించింది. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపును ఇవిఎంల లెక్కింపుకు ముందే పూర్తి చేయనుంది. ప్రతి నియోజకవర్గంలో తప్పనిసరిగా వివిప్యాట్ స్లిప్‌ల లెక్కింపు జరుగుతుందని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ స్పష్టం చేశారు. లెక్కింపు అనంతరం అభ్యర్థులు ఫీజు చెల్లించి ఏడు రోజుల లోపు ఇవిఎంలను వివిప్యాట్‌లతో సరిపోల్చుకునే అవకాశం కల్పిస్తామని తెలిపారు. దీని వల్ల ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం మరింత పెరుగుతుందని చెప్పారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష నిర్వహించిన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాష్ట్ర రాజకీయ పార్టీలతో కీలక సమావేశం నిర్వహించారు. చెన్నైలో జరిగిన ఆ సమావేశంలో గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీల ప్రతినిధులు పాల్గొని పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ఎన్నికలను ఒకే దశలో నిర్వహించాలని ఎక్కువ పార్టీలు కోరినట్టు అధికారులు తెలిపారు. డబ్బు, బహుమతుల ప్రలోభాలకు కట్టడి విధించాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశాన్ని భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కమిషనర్‌లతో పాటు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అర్చనా పట్నాయక్, ఇతర సీనియర్ అధికారులు హాజరయ్యారు. ఎన్నికల నిర్వహణ, భద్రత, సిబ్బంది శిక్షణ, ఇవిఎంల నిర్వహణ, చట్టవ్యవస్థ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. రానున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలను సమీక్షించారు. రాజకీయ పార్టీలు ఎన్నికల్లో డబ్బు ప్రభావం, ఉచిత పథకాల పంపిణీ వంటి అక్రమాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరాయి. అక్రమాల నివారణకు ఫ్లయింగ్ స్క్వాడ్ల సంఖ్యను పెంచాలని కూడా సూచించాయి. దీనిపై స్పందించిన సిఇసి జ్ఞానేశ్ కుమార్, ఎన్నికలు ఎప్పటికీ చట్టబద్ధంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ప్రలోభాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**ఎన్నికలను ప్రజాస్వామ్య పండుగలా!**

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజాస్వామ్య సంప్రదాయాల గురించి కూడా ఆయన ప్రస్తావించారు. తమిళనాడుకు ప్రజాస్వామ్యంలో గొప్ప చరిత్ర ఉందని, ప్రాచీన కాలంలోనే కుడవోలై విధానం అమల్లో ఉండేదని గుర్తుచేశారు. ఇది ప్రపంచానికి ఆదర్శమని చెప్పారు. ఇటీవల 72 దేశాల ప్రతినిధులతో అంతర్జాతీయ సమావేశం నిర్వహించి, తమిళనాడులో శతాబ్దాల క్రితమే అమలులో ఉన్న ఎన్నికల విధానం గురించి వివరించామని తెలిపారు. ఎన్నికలను ప్రజాస్వామ్య పండుగలా జరుపుకోవాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు.

**ఓటర్ల సౌకర్యాలకు అత్యంత ప్రాధాన్యం**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా సాగుతోందని ఆయన తెలిపారు. అర్హులెవరూ తప్పిపోకూడదని, అనర్హులెవరూ జాబితాలో చేరకూడదనే లక్ష్యంతో చర్యలు చేపట్టామని చెప్పారు. తమిళనాడులో అమలు చేస్తున్న విధానం దేశానికి మోడల్‌గా నిలుస్తోందని అభిప్రాయపడ్డారు. ఎన్నికల నిర్వహణలో ఓటర్ల సౌకర్యాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 75 వేల పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ర్యాంపులు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు కల్పించనున్నారు. వృద్ధులు, వికలాంగులు, గర్భిణులకు ప్రత్యేక సౌకర్యాలు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. పోలింగ్ కేంద్రాలు అందరికీ సులభంగా చేరుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**పక్షపాతం లేకుండా విధులు**

ఇటీవల జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలు, ఐజిలు, డిఐజిలు, వివిధ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో సమీక్ష సమావేశాలు నిర్వహించినట్టు తెలిపారు. చట్టవ్యవస్థ పటిష్టంగా ఉండేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అధికారులు ఎలాంటి భయభ్రాంతులు లేకుండా, పక్షపాతం లేకుండా విధులు నిర్వర్తించాలని కమిషన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నియమాలను ఉల్లంఘించిన వారిపై జీరో టాలరెన్స్ విధానం పాటిస్తామని హెచ్చరించింది. ఇదిలా ఉండగా, ఎన్నికల తేదీల నిర్ణయంలో పండుగల తేదీలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని రాజకీయ పార్టీలు కోరాయి. దీనిని పరిశీలిస్తామని సిఇసి హామీ ఇచ్చారు. మొత్తానికి రాబోయే అసెంబ్లీ ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పూర్తి స్థాయి సన్నాహాలు జరుగుతున్నాయని ఎన్నికల సంఘం వెల్లడించింది. రాష్ట్ర ప్రజలు ఉత్సాహంగా పాల్గొని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని అధికారులు పిలుపునిచ్చారు.

## జెఎన్‌యు స్టూడెంట్స్

# నిరసన హింసాత్మకం..

14 మంది అరెస్ట్.. భారీగా బలగాల మోహరింపు




**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జెఎన్‌యు)కి చెందిన స్టూడెంట్ యూనియన్ (జెఎన్‌యుఎస్‌యు) విద్యార్థులు చేపట్టిన ర్యాలీ హింసాత్మకంగా మారింది. గురువారం సాయంత్రం చేపట్టిన నిరసన ర్యాలీ హింసాత్మకంగా మారడంతో పోలీసులు విద్యార్థి నేతలను అరెస్టు చేశారు. జెఎన్‌యుఎస్‌యుకు చెందిన 14 మంది అగ్రనేతలు సహా మొత్తం 51 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జెఎన్‌యుఎస్‌యు ప్రెసిడెంట్ అదితి మిశ్రా, మాజీ ప్రెసిడెంట్ నితీష్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ గోపికా బాబు, జాయింట్ సెక్రెటరీ డానిష్ అలీసహా ఇతర నేతలను అరెస్టు చేసినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. నిందితులపై వసంత్ కుంజ్ నార్త్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. యుజిసి నిబంధనల అమలుపై ఒక పాడ్‌కాస్ట్‌లో ఇటీవల జెఎన్‌యు విసి చేసిన వ్యాఖ్యలు, జెఎన్‌యుఎస్‌యు నేతలపై నిషేధం, రోహిత్ చట్టం అమలు వంటి వాటిని నిరసిస్తూ జెఎన్‌యుఎస్‌యు నేతలు గురువారం సాయంత్రం లాంగ్ మార్చ్‌కు పిలుపునిచ్చారు. యూనివర్సిటీ క్యాంపస్ నుంచి విద్యాశాఖ కార్యాలయం వరకు ఈ ర్యాలీ జరగాల్సి ఉంది. ఈ ర్యాలీకి యూనివర్సిటీ యాజమాన్యం ఒప్పుకోలేదు. క్యాంపస్ బయట ఆందోళన చేసుకోవాలని సూచించింది. అయినప్పటికీ వినకుండా దాదాపు 500 మంది విద్యార్థులు ర్యాలీకి సిద్దమయ్యారు. నినాదాలు చేస్తూ, మెయిన్ గేటు నుంచి విద్యాశాఖ కార్యాలయం వరకు వెళ్లేందుకు ప్రయత్నించారు. దీనిపై యూనివర్సిటీ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. వారు బారికేడ్లు అడ్డుపెట్టి ర్యాలీని అడ్డుకోవాలని చూశారు. దీంతో విద్యార్థుల్ని పోలీసులు, భద్రతా బలగాలు అడ్డుకోవాలని చూశాయి. ఈ క్రమంలో పోలీసులపైకి విద్యార్థులు రాళ్లు రువ్వారు. కర్రలతో దాడి చేశారు. ఇది అటు పోలీసులు, భద్రతా బలగాలకు.. ఇటు విద్యార్థులకు మధ్య ఘర్షణగా మారింది. ఈ దాడుల్లో కొందరు పోలీసులపై దాడి చేయగా, వారు గాయపడ్డారు. చివరకు కొందరు విద్యార్థి నేతల్ని అరెస్టు చేశారు. ఆందోళనకారులపై లాఠీఛార్జి చేసి, వారిని నియంత్రించారు. మళ్లీ హింసాత్మక ఘటనలు జరగకుండా అదనపు బలగాల్ని మోహరించారు.

## కోల్‌కతాలో భారీ భూకంపం

రిక్టర్ స్కేల్‌పై 5.5 నమోదు

భయాందోళనకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీసిన ప్రజలు

**న్యూఢిల్లీ :** పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో భారీ భూకంపం సంభవించింది. శుక్రవారం మధ్యాహ్నం 1:22 గంటల సమయంలో రిక్టర్ స్కేల్‌పై 5.5 తీవ్రత నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ (ఎన్‌సిఎస్) తెలిపింది. భూకంప కేంద్రం బంగ్లాదేశ్‌లో ఉన్నట్లు పేర్కొంది. పది కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించినట్లు వెల్లడించింది. భారత్–బంగ్లాదేశ్ సరిహద్దు సమీపంలోని పలు జిల్లాలపై భూకంపం ప్రభావం ఉన్నట్లు వివరించింది. కాగా, కోల్‌కతాలోని పలు ప్రాంతాల్లో భూప్రకంపనలు సంభవించాయి. పలు ఇళ్లల్లోని సామాన్లు, ఫ్యానులు ఊగిపోయాయి. భయాందోళన చెందిన జనం ఇళ్లు, భవనాలు, కార్యాలయల నుంచి బయటకు పరుగులుతీశారు. కోల్‌కతాలో భూకంపం వల్ల ఎంత నష్టం జరిగింది అన్నది ఇంకా తెలియలేదు. ఈ భూకంపానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.



## పెట్టుబడులు, ఆవిష్కరణలను పెంచడానికి...

# భారత పరిశ్రమ ముందడుగు వేయాలి

ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు



**న్యూఢిల్లీ:** భారత పరిశ్రమ పెట్టుబడి, ఆవిష్కరణలను పెంచడానికి ముందడుగు వేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కోరారు. బడ్జెట్లలో దూకుడుగా ఖర్చు చేయడం ద్వారా విజయవంతమైన వాతావరణం సృష్టించడం ద్వారా ప్రభుత్వం పునాది వేసిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేట్ రంగమే ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా పోటీతత్వ వృద్ధి కొత్త దశను నడిపించాల్సిన తరుణం ఆసన్నమైందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. 'సాంకేతిక ప్రగతి సంస్కరణలు, వీక్షిత్ భారత్ కోసం ఫైనాన్స్' అనే అంశంపై శుక్రవారం ఇక్కడ జరిగిన మొదటి పోస్ట్ బడ్జెట్ వెబినార్‌ను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. 11 సంవత్సరాల క్రితం ప్రభుత్వ మూలధన వ్యయం రూ.2లక్షల కోట్ల నుంచి 202627 కేంద్ర బడ్జెట్‌లో రూ.12లక్షలకు పైగా పెరిగిందని, తద్వారా విస్తరణకు బలమైన పునాది పడిందని తెలిపారు. అధిక కేటాయింపులు, ప్రభుత్వరంగం కొత్త ఉత్సాహంతో పెట్టుబడులు పెట్టడానికి 2026 27 బడ్జెట్ అనౌన్స్‌మెంట్లను ప్రభావితం చేయడానికి సంకేతాలు ఇస్తున్నాయని మోదీ చెప్పారు. ప్రభుత్వం, పరిశ్రమ, జ్ఞాన భాగస్వామ్యం మధ్య సన్నిహిత సహకారంతో సంస్కరణలు స్పష్టమైన ఫలితాలుగా మారేలా చూసుకోవాలని పిలుపునిచ్చారు. జాతీయ రహదారులు, రైల్వేలు, ఓడరేవులు, విమానాశ్రయాలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఇంధన నెట్‌వర్క్‌లపై ఖర్చును గణనీయంగా పెంచిందన్నారు. గత దశాబ్దంలో భారత దేశం సాధించిన స్థితి స్థాపతకు కారణం దృఢ నిశ్చయంతో కూడిన సంస్కరణలు, ఆర్థిక సులభతరతను మెరుగుపర్చడానికి నిరంతర ప్రయత్నాలు దోహదపడ్డాయని ప్రధానమంత్రి తెలియజేశారు. 2047 నాటికి వీక్షిత్ భారత్ సాధించే లక్ష్యంలో భాగంగా ప్రభుత్వం పరిశ్రమలు, ఆర్థిక సంస్థలు, విద్యా సంస్థల మధ్య సహకారాన్ని అధికారికం చేయడానికి సంస్కరణ భాగస్వామ్య చార్టర్‌ను రూపొందించాలని ఆయన ప్రతిపాదించారు. ప్రభుత్వం, పరిశ్రమలు, జ్ఞానరంగం కలిసొచ్చినప్పుడు సంస్కరణలు ఫలితాలుగా మారతాయని, అంతేకాకుండా కాగితాలపై ప్రకటనలు క్షేత్రస్థాయిలో విజయాలుగా మారతాయని మోదీ విపులీకరించారు. ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలను జాబితాచేస్తూ విదేశీ పెట్టుబడి చట్రాన్ని సరళీకృతంచేసి, అంచనా వేయగలిగేలా తీర్చిదిద్దామని తెలియజేశారు. ప్రతీఏటా బడ్జెట్ తర్వాత నిర్వహింపబడే బడ్జెట్ వెబ్‌నార్ ఎంతో ముఖ్యమైనదని, వెబ్‌నార్ అధికారిక అభిప్రాయాల మార్పిడికి పరిమితం కాకుండా, అర్థవంతమైన మేధోమథనంపై దృష్టి సారించాలనేది తన అభిలాష అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు.

## భారత్-యుఎస్ వాణిజ్య ఒప్పందం వ్యతిరేకించాలని

# ఎస్‌కెఎం దేశవ్యాప్త ప్రచారాలు

అసెంబ్లీల్లో తీర్మానాలు చేయాలని కోరుతూ ఆయా రాష్ట్రాల సిఎంలను కలవనున్న రైతు సంఘాల నేతలు

**న్యూఢిల్లీ :**సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) గురువారం రెండు దేశవ్యాప్త ప్రచారాలను ప్రకటించింది. ప్రతిపాదిత భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని వ్యతిరేకించాలని, వాణిజ్య మంత్రి పియూష్ గోయల్‌ను తొలగించాలని, రాష్ట్రాల ఆర్థిక స్వయంప్రతిపత్తిని పునరుద్ధరించడానికి జివిస్‌టి చట్టానికి సవరణలు తీసుకువచ్చేలా రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకుకురానుంది. రాష్ట్ర, జాతీయ కమిటీల సభ్యులతో కూడిన ప్రతినిధులు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రతిపక్ష నాయకులను కలుస్తారని, రైతు సంఘాలు లేవనెత్తిన అంశాలపై తీర్మానాలను ఆమోదించడానికి ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలను ఏర్పాటు చేయాలని కోరనున్నట్లు ఎస్‌కెఎం ఒక ప్రకటనలో పేర్కొంది. అమెరికాతో జాతి వ్యతిరేక వాణిజ్య ఒప్పందంగా పిలిచే దానిపై సంతకం చేయవద్దని కేంద్రాన్ని కోరాలని, రైతుల ప్రయోజనాలకు ద్రోహం చేసినందుకు గోయల్‌ను మంత్రి పదవి నుంచి తప్పించాలని, గోధుమ, వరిపై బోనస్ చెల్లింపులను ముగించాలని రాష్ట్రాలను కోరుతూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ లేఖను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఎస్‌కెఎం ఒక మెమోరాండంలో కోరింది. భారత్, అమెరికా ఈ నెల ప్రారంభంలో ఒక తాత్కాలిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి అంగీకరించిన విషయం తెలిసిందే. నాలుగు కార్మిక కోడ్‌లను, విబి జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలని, రద్దు చేసిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజి నరేగా) కింద గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని కూడా డిమాండ్ చేసింది. 'బలమైన భారతదేశం కోసం బలమైన రాష్ట్రాలు' అనే ప్రచారంలో భాగంగా, రైతుల సమష్టి వస్తువులు, సేవల పన్ను (జిఎస్‌టి) చట్టం, 2017ను సవరించాలని, రాష్ట్రాల పన్ను అధికారాలను పునరుద్ధరించాలని, కేంద్ర పన్నుల విభజించదగిన పూల్‌లో వారి వాటాను 60 శాతానికి పెంచాలని పిలుపునిచ్చింది. రాజ్యాంగం ప్రకారం వ్యవసాయం రాష్ట్ర అంశం అని పేర్కంటూ.. రాష్ట్రాలు హామీ ఇచ్చిన సేకరణతో అన్ని పంటలకు సి2+50 శాతం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి హామీ ఇచ్చే చట్టాలను రూపొందించాలని, గ్రామీణ రుణభారం, రైతు ఆత్మహత్యలను పరిష్కరించడానికి సమగ్ర రుణ మాఫీలను అందించాలని ఎస్‌కెఎం పేర్కొంది. ముఖ్యమంత్రులు, ఎల్‌ఓపిలనుద్దేశించి రాసిన మెమోరాండంలో జాతీయ సహకార విధానం 2025, వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన ముసాయిదా, విత్తన బిల్లు 2025, విద్యుత్ సవరణ బిల్లు 2025, ప్రతిపాదిత అమెరికా వాణిజ్య ఒప్పందం వంటి కేంద్రం ఇటీవలి విధాన చర్యలు వ్యవసాయంపై రాష్ట్రాల రాజ్యాంగ అధికారాలను ఉల్లంఘించాయని ఎస్‌కెఎం ఆరోపించింది. జనవరి 29న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే 2025–26ను ఉటంకిస్తూ, రెవెన్యూ మిగులు రాష్ట్రాల సంఖ్య 2018–19లో 19 నుండి 2025–26లో 11కి తగ్గిందని ఎస్‌కెఎం పేర్కొంది. జిడిపిలో తయారీ వాటా 2014లో 16 శాతం నుండి 2024–25లో 13 శాతం కంటే తక్కువగా ఉందని, 'మేక్ ఇన్ ఇండియా' చొరవ దాని పేర్కొన్న లక్ష్యాలను సాధించడంలో విఫలమైందని కూడా ఆరోపించింది. ఫిబ్రవరి 24న హర్యానాలోని కురుక్షేత్రలో సమావేశమైన ఎస్‌కెఎం జాతీయ మండలి, వ్యవసాయం కార్పొరేటీకరణ, వాణిజ్యం, విధాన మార్పుల ద్వారా ఆర్థిక వలసరాజ్యంగా అభివర్ణించిన దానికి వ్యతిరేకంగా నిరసనలను తీవ్రతరం చే యాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రులు న్యా యమైన, న్యాయమైన డిమాండ్లను దృష్టిలో ఉంచుకుని' ఎస్‌కెఎం గుర్తించిన చర్యలను పునఃపరిశీలి ంచాలని కేంద్రాన్ని కోరుతూ తీర్మానాలను ఆమోదించడానికి ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చే యాలని రైతు సంఘం ఆశిస్తున్నట్లు తెలిపింది.

## రైతు నమోదు ప్రక్రియలో

# తెలంగాణ ముందంజ

110 శాతం లక్ష్యాన్ని సాధించిందని వెల్లడించిన అధికారులు

తెలంగాణ ప్రభుత్వానికి ప్రోత్సాహకంగా కేంద్రం రూ. 424 కోట్లు మంజూరు

అధికారులను అభినందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** డిజిటల్ వ్యవసాయ కార్యక్రమాల కింద రైతు రిజిస్ట్రీ నమోదు ప్రక్రియలో తెలంగాణ రాష్ట్రం 100 శాతం నమోదు పూర్తి చేసి, భారత ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని మించి సాధించి దేశంలో అగ్రగామి రాష్ట్రాలలో ఒకటిగా నిలిచినందుకు వ్యవసాయ శాఖ, తెలంగాణ ప్రభుత్వం గర్వంగా ప్రకటిస్తుంది. అధికారిక గణాంకాల ప్రకారం రాష్ట్రంలో మొత్తం పట్టాదారులు 73.82 లక్షలు కాగా, భారత ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం 39,77,791 మంది రైతులు అని, తెలంగాణ 43,59,371 మంది రైతులతో నమోదు ప్రక్రియ పూర్తి చేయించి, 110 లక్ష్యాన్ని సాధించిందని అధికారులు వెల్లడించారు. ఈ విశిష్ట విజయాన్ని గుర్తించి, రైతు రిజిస్ట్రీ సృష్టితో పాటు రాష్ట్రం ప్రదర్శించిన అత్యుత్తమ పనితీరుకు గాను భారత ప్రభుత్వం ప్రత్యేక కేంద్ర సహాయం కింద రూ. 422.64 కోట్ల ప్రోత్సాహకాన్ని మంజూరు చేసిందని తెలిపారు. ఈ గొప్ప విజయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దూరదృష్టి, నాయకత్వం, నిరంతర పర్యవేక్షణలో సాధించగలిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని గౌరవ ప్రదమైన సవాల్‌గా స్వీకరించిన మంత్రి రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుండి గ్రామ స్థాయి వరకు సమన్వయంతో పనులను సమీక్షిస్తూ పురోగతిని నిరంతరం పర్యవేక్షించారని తెలిపారు. మిగిలిన పట్టాదారులను కూడా త్వరితగతిన నమోదు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హులైన రైతులందరినీ పూర్తిస్థాయిలో చేర్చే దిశగా క్షేత్ర స్థాయిలో ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్ఫూర్తిదాయక నాయకత్వంలో వ్యవసాయ శాఖ రైతు రిజిస్ట్రీతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలలో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కట్టుబడి ఉందన్నారు. ప్రణాళికాబద్ధమైన చర్యలు, సమగ్ర పర్యవేక్షణతో పాటు క్షేత్రస్థాయి అమలు ద్వారా అన్ని జిల్లాల్లో రైతుల నమోదు విజయవంతంగా కొనసాగించబడుతుందని వెల్లడించారు. ఈ విజయవంతమైన నమోదు కార్యక్రమం వ్యవసాయ సేవల పారదర్శకతను మరింత బలోపేతం చేసిందన్నారు. సంక్షేమ పథకాలు సమయానుకూలంగా, అర్హులైన లబ్ధిదారులకు నేరుగా అందే విధంగా డేటా ఆధారిత వ్యవసాయ పరిపాలనకు ఇది దోహదపడుతుందని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ శాఖ సిబ్బందిని, ముఖ్యంగా వ్యవసాయ విస్తరణాధికారులు (ఎఇఓలు), మండల వ్యవసాయ అధికారులు (ఎంఎఓలు), క్షేత్ర సిబ్బంది, సాంకేతిక బృందాలతో పాటు జిల్లా స్థాయి అధికారులను అభినందించారు. నిర్ణీత గడువులో ప్రతి అర్హత కలిగిన రైతును చేరుకోవడంలో వారు చూపిన కృషి సమన్వయం, అంకితభావాన్ని ప్రశంసించారు. రైతు రిజిస్ట్రీ వ్యవసాయ రంగంలో పారదర్శకతను పెంపొందించడంతో పాటు, సంక్షేమ పథకాలు, సేవలను ఆలస్యం లేకుండా అర్హులైన లబ్ధిదారులకు నేరుగా అందించేందుకు దోహదపడుతుందన్నారు. డిజిటల్ వేదికలను వినియోగిస్తూ రైతు సంక్షేమం, సేవల మెరుగుదలతో పాటు సుస్థిర వ్యవసాయ అభివృద్ధి దిశగా వ్యవసాయ శాఖ, తెలంగాణ ప్రభుత్వం తన నిబద్ధతను మరోసారి పునరుద్ఘాటిస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## అంతర్జాతీయ రాజకీయాల్లో

# ఇరాన్–అమెరికా చర్చలు కీలకం!



**జనీవా:** ఇరాన్–అమెరికా అణు చర్చలు ఇటీవల అంతర్జాతీయ రాజకీయాల్లో అత్యంత కీలక పరిణామంగా మారాయి. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి తెలిపిన ప్రకారం, ఇవి ఇరాన్ అణు కార్యక్రమంపై లోతుగా, ఎక్కువసేపు కొనసాగిన పరోక్ష చర్చలలో ఇది ఒకటి. ఈ చర్చలు నేరుగా కాకుండా ఒమాన్ మధ్యవర్తిత్వంలో జరిగాయి. అయితే గంటల తరబడి చర్చలు జరిగినప్పటికీ తక్షణ ఒప్పందం కుదరలేదు. ఈ చర్చల ప్రధాన అంశం ఇరాన్ అణు కార్యక్రమం. అమెరికా లక్ష్యం ఇరాన్ యురేనియం శుద్ధి పూర్తిగా నిలిపివేయడం, అణు ఆయుధాలకు దారితీసే అవకాశాలను తగ్గించడం. మరో వైపు, ఇరాన్ తన అణు కార్యక్రమం పూర్తిగా శాంతియుత ప్రయోజనాల కోసం మాత్రమేనని చెబుతూ, యురేనియం శుద్ధి చేయడం తన హక్కు అని స్పష్టం చేసింది. అంతేకాకుండా, తన దీర్ఘ శ్రేణి క్షిపణి కార్యక్రమం లేదా హమాస్, హిజ్బుల్లా వంటి గుంపులకు మద్దతు వంటి ఇతర అంశాలను చర్చలోకి తేవడాన్ని ఇరాన్ తిరస్కరించింది. అంతర్జాతీయ ఆంక్షలను తొలగించడం కూడా ఇరాన్ ప్రధాన డిమాండ్‌లలో ఒకటిచర్చల్లో గణనీయమైన పురోగతి సాధించామని . ఒమాన్ విదేశాంగ మంత్రి బదర్ అల్‌బుసైదీ చెప్పినప్పటికీ, వివరాలు వెల్లడించలేదు. తదుపరి సాంకేతిక స్థాయి చర్చలు వియన్నాలో జరగనున్నాయి. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఎఇఎ) భవిష్యత్తు ఒప్పందంలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. కాగా, అంతర్జాతీయ రాజకీయాల నేపథ్యంలో ఈ చర్చల ప్రాముఖ్యత చాలా ఎక్కువ. అమెరికా సైనిక దాడి జరిగితే మధ్య ప్రాచ్య ప్రాంతం మొత్తం యుద్ధంలో చిక్కుకునే ప్రమాదం ఉందని ఇరాన్ హెచ్చరించింది. అమెరికా సైనిక స్థావరాలు లక్ష్యాలవుతాయని, ఇజ్రాయెల్‌పై కూడా దాడులు జరిగే అవకాశం ఉందని తెలిపింది. అలాంటి యుద్ధం ఎవరికి విజయం ఇవ్వని విధ్వంసకర పరిస్థితి అవుతుందని అరాఘ్చి వ్యాఖ్యానించారు. గత సంవత్సరం ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య జరిగిన యుద్ధం, అమెరికా అణు కేంద్రాలపై చేసిన దాడుల తరువాత జెనీవా జరిగిన చర్చలను మూడో ప్రయత్నంగా పేర్కోవాలి. అమెరికా ఇరాన్ మళ్లీ అణు కార్యక్రమాన్ని పునర్నిర్మించేందుకు ప్రయత్నిస్తోందని అనుమానిస్తోంది. ఉపగ్రహ చిత్రాలు కూడా కొన్ని కేంద్రాల్లో కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు సూచిస్తున్నాయి. ప్రస్తుతం ఇరాన్ అణు ఆయుధ స్థాయికి చేరలేదని అమెరికా గూఢచారి సంస్థలు భావిస్తున్నప్పటికీ, అవసరమైతే త్వరగా ఆ దిశగా వెళ్లగల సామర్థ్యం ఉందని అంచనా వేస్తున్నాయి. కాగా, చర్చలు విఫలమైతే సైనిక చర్య అవకాశం పెరుగుతుంది. అటువంటి పరిస్థితి చమురు ధరలు పెరగడం, హోర్ముజ్ జలసంధి ద్వారా జరిగే ప్రపంచ చమురు రవాణాకు అంతరాయం కలగడం వంటి ప్రపంచ ఆర్థిక ప్రభావాలకు దారితీయవచ్చు. అందువల్ల ఈ చర్చలు కేవలం రెండు దేశాల మధ్య సమస్య కాకుండా, ప్రపంచ భద్రత, ఆర్థిక స్థిరత్వానికి సంబంధించిన కీలక అంశంగా మారాయి.

## సంస్కరణలపై 'వివరణాత్మక నోట్'ను

# సిద్ధం చేయండి

మంత్రులను కోరిన ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ :** సంస్కరణల కోసం ఒక ప్రతిష్ఠాత్మక ఎజెండాను రూపొందించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాబోయే సంవత్సరాలలో వారి మంత్రిత్వ శాఖల్లో తీసుకోవాల్సిన చొరవల గురించి ఒక వివరణాత్మక నోట్ సిద్ధం చేయాలని కోరారు. మోదీ ప్రభుత్వం తన 'రిఫార్మ్స్ ఎక్స్‌ప్రెస్' ఎజెండా కింద ప్రక్రియలను సులభతరం చేయడం, వ్యాపార సౌలభ్యాన్ని మెరుగుపర్చడం, సాంకేతికత ఆధారిత పాలనను విస్తరించడంలో భాగంగా ఈ కసరత్తు జరిగిందని ఈ కసరత్తు జరిగిందని అధికార వర్గాలు తెలిపాయి. కేంద్ర మంత్రివర్గంలో దానిని సమర్పించడానికి, సంబంధిత మంత్రిత్వ శాఖల వివిధ కార్యకలాపాలు, సంస్కరణల దృక్పథాన్ని వివరించడానికి నోట్‌ను సిద్ధం చేయాలని ఆయన స్వయంగా మంత్రులకు చెప్పారు. ప్రతీ మంత్రిత్వ శాఖ తన భవిష్యత్ చొరవలను గత కొన్ని సంవత్సరాల విజయాలను ఏ ఫార్మాట్‌లో రాయాలో వివరిస్తూ కేబినెట్ సెక్రటేరియట్ ఒక నిర్దిష్ట ఫార్మ్‌ను పంపిణీ చేసినట్లు తెలిసింది. మంత్రులు తమ మంత్రిత్వ శాఖల సంస్కరణల ముఖ్య అంశాలను అది ఎప్పుడు అమలు చేయబడింది లేదా దేనిని వివరించవచ్చు , వారి నుంచి ఎలాంటి ఫలితాలు ఆశించబడుతున్నాయో స్పష్టంగా తెలియజేయాల్సి ఉంటుంది. ప్రతీ మంత్రిత్వ శాఖ వెంటనే దాని ప్రాధాన్యతలపై దృష్టి సారించాలని, తద్వారా దాని ఫలితాలు క్షేత్ర స్థాయిలో కనిపించేలా చూడాలని ప్రధానమంత్రి మోదీ స్పష్టం చేశారని, 2047నాటికి దేశాన్ని అభివృద్ధి చేయాలనే ప్రభుత్వ విస్తృత రోడ్ మ్యాప్‌లో ఈ మొత్తం కసరత్తు భాగమని అధికారవర్గాలు తెలిపాయి.

SHRIRAM Finance వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS03EX 1815 | KUMAR KALAKOTLA | JOHN DEERE 5105 | 2019 |
| 2 | AP20AV 6624 | SURESH BOMMAKANTI | SWIFT VDI DIESEL 5 SEATER | 2014 |
| 3 | TS15UE 5544 | RANJITH CHINTHAKINDI | FORCE TEMPO TRAVELLER AC BS6-P | 2021 |

AUCTION DATE : 28-02-2026

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED
D.No:5-11-503 & 504, Kandakatla Gateway 3rd floor, KUC X Road, Hanamkonda - 506009. Cell : 9849955900 & 9573787776

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
శనివారం
28-02-2026
www.prajapaksham.in


# ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు అల్లిన కథనం

ఆమ్ ఆద్మీ పార్టీని (ఆప్) ఢిల్లీలో అధికారానికి దూరంచేసిన 'ఢిల్లీ లిక్కర్ విధానం కుంభకోణం' కేసు నుంచి అప్పటి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను, ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియాను, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సహా మొత్తం 23 మంది నిందితులను నిర్దోషులుగా ఢిల్లీ కోర్టు శుక్రవారం సంచలనాత్మక తీర్పు వెలువరించింది. అది రాజకీయంగా బనాయించిన కేసు అని మొదటినుంచి ప్రతిపక్షాలు ఆరోపిస్తూనే ఉన్నాయి. అది ఇవాళ రుజువైంది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌ను ఓడించటంలో మూడుసార్లు విఫలమైన భారతీయ జనతా పార్టీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా పథకాల ప్రకారం సిబిఐ రంగంలో దిగి ఈ లిక్కర్ స్కాం కేసు బనాయించింది. పర్యవసానం, ఆప్‌పై బిజెపి దుష్ప్రచారంతో ఆప్ అధికారం కోల్పోయింది. బిజెపి కల నెరవేరింది. శ్రీమతి రేఖా గుప్తాను ముఖ్యమంత్రిని చేశారు. సిబిఐ కేసు విచారించిన ఢిల్లీ కోర్టు జడ్జి జస్టిస్ జితేంద్ర సింగ్ వెలువరించిన 600 పేజీల తీర్పులో సిబిఐ కేసులో 'నిందితులపై అత్యంత తీవ్రమైన అనుమానం సంగతి అలా వుంచితే ప్రాథమిక సాక్ష్యాధారమే లేదని' చీల్చి చెండాడారు. ఇది ముందుగా తయారు చేసుకున్న కథనానికి అనుగుణంగా కేసును అల్లినట్లు ఉందని తేల్చి చెప్పారు. ఈ తీర్పుపై వెంటనే ఢిల్లీ హైకోర్టులో అప్పీలు చేస్తామని సిబిఐ చెప్పింది.

తీర్పు వెలువడిన అనంతరం మీడియా ముందు కన్నీళ్లు పెట్టుకున్న కేజ్రీవాల్, "ఇది స్వతంత్ర భారత చరిత్రలో అతిపెద్ద రాజకీయ కుట్ర"కేసు అని వ్యాఖ్యానించారు. తాను పేరు సంపాదించుకున్నానుగాని డబ్బు కాదన్నారు. తమది నిజాయితీపరుల పార్టీ అని అన్నారు. ప్రతిపక్షపార్టీలను ఎన్నికల్లో దెబ్బతీసేందుకై ప్రధానమంత్రి, హోంమంత్రి జాతీయస్థాయి దర్యాప్తు సంస్థలు సిబిఐ, ఇడిలను ప్రతిపక్ష నాయకులపై ప్రయోగించటం కొనసాగుతూనే ఉంది. జనవరిలో కలకత్తాలో ఎన్నికల వ్యూహాల సలహా సంస్థ ఐ ప్యాక్ కార్యాలయంపై ఇ.డి. అధికారులు దాడిచేసింది. తమ ఎన్నికల రహస్యాలను కొట్టేసి, బిజెపికి సహాయ పడటానికి ఆ అధికారులు ప్రయత్నిస్తున్నారన్న అనుమానంతో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రత్యక్షంగా జోక్యం చేసుకుని తమ ఫైళ్లను, రికార్డులను పట్టు కెళ్లారు. దీనిపై సుప్రీంకోర్టులో ఇ.డి., ముఖ్యమంత్రి పరస్పరం కేసులు దాఖలు చేశారు. ఓటర్ల జాబితాల ముమ్మర రివిజన్ (ఎస్ఐఆర్) పేరుతో కోటిమందిపైగా ఓటర్లను తొలగించేందుకు ఎన్నికల కమిషన్ ప్రయత్నిస్తుండగా, బిజెపి పక్షాన ఇ.సి.పనిచేస్తూ న్యాయమైన ఓటర్లను ఉద్దేశపూర్వకంగా తొలగిస్తున్నదని మమతా బెనర్జీ సుప్రీంకోర్టులో కొట్లాడుతున్నారు. ఫిర్యాదుల పరిశీలనకు సుప్రీంకోర్టు బెంగాల్ నుంచి, పరిసర రాష్ట్రాలనుంచి న్యాయాధికారులను రంగంలోకి దించింది. విశ్వాసలోపం అంతలోతు గా ఉంది. అవినీతి ఆరోపణలతో సిబిఐని ప్రయోగించి ఢిల్లీలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులను, జార్ఖండ్‌లో ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను జైలు పాలు చేయటం, అటు తర్వాత ఐదారుమాసాల వ్యవధిలో ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో ఎన్నికల కమిషన్‌తో 'సర్' మొదలు పెట్టించటం వంటి ఉదంతాలు ఎన్నికల విజయాలకోసం బిజెపి అగ్రనాయకత్వం ఎన్ని అడ్డదారులైనా తొక్కుతుందనే ఆరోపణలకు బలం చేకూర్చాయి. కేజ్రీవాల్, సిసోడియా నిర్దోషులని ఢిల్లీ కోర్టు నిర్ధారించింది. హేమంత్ సోరెన్ అంతకుముందే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ (జెఎంఎం)కి మెజారిటీ సాధించి మళ్లీ ముఖ్యమంత్రి అయినారు.

ఢిల్లీ లిక్కరు స్కాం కేసు కేజ్రీవాల్ ప్రభుత్వం 2021–22ల్లో రూపొందించిన లిక్కర్ విధానానికి సంబంధించింది. దీనిలో పెద్ద అవినీతి జరిగిందని, "సౌత్ గ్రూపు" కేజ్రీవాల్, సిసోడియాలకు డబ్బు సంచులు ఇచ్చిందని, వారు ఆ ధనాన్ని గోవా ఎన్నికల్లో తమ పార్టీ ప్రచారానికి వెచ్చించారని సిబిఐ ఆరోపించింది. పలువురు ఎక్సైజ్ అధికారులను కూడా నిందితులుగా చేర్చింది. ఈ కేసులో సిసోడియా దాదాపు 2 సంవత్సరాలు, కేజ్రీవాల్ 6 నెలలపాటు జైలులో ఉన్నారు. కవితకూడా ఐదున్నర మాసాలు జైల్లో ఉన్నారు. భారత రాష్ట్ర సమితిలో రాజుకున్న కుటుంబ చిచ్చుకు ఈ కేసు ఒక ప్రధాన కారణంగా ఢిల్లీకోర్టు తీర్పు తదుపరి కెటిఆర్ వ్యాఖ్య, అందుకు కవిత రిజాయిండర్ విదితం చేస్తున్నవి.

"వివిధ మంత్రిత్వశాఖల మధ్య చర్చలు, వ్యవస్థాగత స్క్రూటినీ, విధాన రూపకల్పనల విధివిధానాలు పాటించినట్లు చూపించాక, దాని అమలులో ఉత్తరోత్తరా క్రిమినల్ నేరాన్ని ఆపాదించటం మొత్తంగా అంగీకారయోగ్యం కాదు" అని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. "విధానం రూపకల్పనలో అవినీతి లేదా అమలులో చట్టవిరుద్ధం లేనప్పుడు ప్రాసిక్యూషన్ కథనం కట్టుకథకు కుదించబడుతుంది. చట్టం ప్రకారం రూపొందించిన విధానం నుంచి ప్రైవేటు వ్యక్తులు వ్యాపార లబ్ధిపొందాలని చూచినపుడు వారిని క్రిమినల్ ప్రాసిక్యూషన్ కాఠిన్యాలకు గురిచేయకూడదు. అందువల్ల, కుట్రను ఆరోపించటం కల్పితాలు, సంశయాలపై ఆధారపడి ఊహాత్మకంగా కథలల్లటమే అవుతుందిగాని, అనుమతించదగిన ఆధారాలతో కూడినది కాదని" కోర్టు అభిప్రాయపడింది.

ఎక్సైజ్ కమిషనర్‌ను నెం.1నిందితునిగా చేర్చిన విచారాణాధికారిపై డిపార్టుమెంటల్ చర్యకు జడ్జి సిఫారసు చేశారు. తీర్పును ముగిస్తూ జడ్జిసింగ్ ఇలా వ్యాఖ్యానించారు. మార్టిన్ లూథర్ కింగ్, జూనియర్‌ను ఉట్టంకిస్తూ: "అన్యాయం ఎక్కడ జరిగినా అది ప్రతిచోట న్యాయానికి ముప్పు అవుతుంది." అలాగే, మిన్నువిరిగి మీదపడినా సరే న్యాయమే చేయాలి" అన్న లాటిన్ నానుడినీ ప్రస్తావించారు. అనుకూలమైన ఫలితాన్ని అందించటం లేదా ఆధిక్య కథనాన్ని ఆమోదించటం న్యాయవ్యవస్థ కర్తవ్యం కాదు, చట్ట పాలనను (రూల్ ఆఫ్ లా) పరిరక్షించటం నిజమైన కర్తవ్యం. ఈ ఆదర్శాలకు కట్టుబడి ఉన్నప్పుడే న్యాయపాలనలో పౌరుల విశ్వాసం కాపాడబడుతుంది".



## భావ వ్యక్తీకరణనేది సంతోషాన్ని పెంచాలి

ప్రజలు తమ భావాలను వ్యక్తీకరించుకోవడానికి అనుమతించాలని నేను భావిస్తున్నాను. కానీ అదే సమయంలో పరస్పర కోపం, ద్వేషంతో నిండిపోతున్న వాతావరణంలో.. ప్రజలలో శాంతి, ప్రేమ, సంక్షేమాన్ని ప్రోత్సహించే, సంతోషంగా ఉండే విషయాలను సృజనాత్మకంగా తయారుచేయడం మంచిది. వయనాడ్ కొండచరియలు విరిగిపడిన ఘటనలో వందలాదిమంది ప్రాణాలను కోల్పోయారు. మిగిలిన ప్రతి ఒక్కరూ కులమతాలకు అతీతంగా ఒకరికొకరు సహాయం చేసుకున్నారు. ఇది నిజమైన భారతదేశం, కేరళ స్ఫూర్తి సారాంశం. దీనిని ఎందుకు ప్రదర్శించకూడదు? దేశం మొత్తం ఈ ఉదాహరణ నుండి సారాంశం ఎందుకు నేర్చుకోకూడదు?

- 'ది కేరళ స్టోరీ – 2-' చిత్రంపై వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ



# ఆహార భద్రత గాలికి...

ప్రజల ఆహారం సురక్షితంగా ఉండేలా చూడడం ఏ ప్రభుత్వానికైనా అత్యంత ప్రాథమిక బాధ్యత. ప్రజలు తాగే పాలు, వినియోగించే నెయ్యి సురక్షితమని నమ్మలేని పరిస్థితి వస్తే, పాలనపై ప్రశ్నలు తలెత్తుతాయి. ఎపిలో ఇటీవల జరిగిన ఘటనలు చూస్తే, ప్రభుత్వం నిర్మాణాలు ఏర్పాటు చేసినా ప్రజారోగ్యాన్ని కాపాడే కార్యాచరణ సామర్థ్యాన్ని మాత్రం నిర్మించలేదని స్పష్టమవుతోంది. నిత్యం కల్తీ పై మాట్లాడుతున్న ప్రభుత్వం, కల్తీని నిరోధించడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టక పోవడం విడ్డూరం.

రాజమహేంద్రవరంలో ఒకే సరఫరాదారుని నుంచి కల్తీ పాలు తీసుకున్న వందకు పైగా కుటుంబాల ఘటనతో ఈ పరిస్థితి తీవ్రంగా బయటపడింది. ఐదుగురు మృతి చెందగా, పిల్లలు సహా మరికొందరు ఇంకా విషమ స్థితిలో ఉన్నారు. ఘటన జరిగిన తర్వాత కూడా విషతత్వ నివేదికలు ఇతర ప్రాంతాల ల్యాబ్‌ల నుంచి రావాల్సి వచ్చింది. స్థానికంగా కలుషిత పదార్థాలు వెంటనే గుర్తించే సామర్థ్యం లేకపోవడం వల్ల నివారణ వ్యవస్థ మరణాల తర్వాత మాత్రమే స్పందించింది. అధికారులు తరచుగా ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ మొబైల్ యూనిట్లను పర్యవేక్షణకు ఉదాహరణగా చూపుతున్నారు. ఇది ప్రాథమిక కల్తీ లను మాత్రమే గుర్తించగలవు. కానీ పురుగు మందు అవశేషాలు, యాంటీబయాటిక్ విశేషాలు, హెవీ మెటల్స్, అఫ్లాటాక్సిన్, హార్మోన్ కలుషితాలు వంటి సంక్లిష్ట పదార్థాలు గుర్తించలేవు. అసలు సమస్య మానవ వనరుల్లో ఉంది. అర్హత కలిగిన ఫుడ్ అనలిస్టుల నియామకాలు సంవత్సరాలుగా నిలిచిపోయాయి. అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయి లేదా ఆమోదించబడలేదు. ఉన్న సిబ్బంది ఆధునిక పరికరాలపై తగిన శిక్షణ లేకపోవడంతో పరీక్షలు పరిమిత ప్రమాణాల కే కుదురుతున్నాయి. ఫలితంగా పశువైద్య ఔషధ అవశేషాలు, యాంటీబయాటిక్ కలుషితం, పురుగుమందు అవశేషాలు వంటి ప్రమాదకర పదార్థాలు గుర్తించకుండా మిగిలే అవకాశముం ది. ల్యాబ్‌లు ఉన్నా సమగ్ర పరీక్షలు లేవు.

పరీక్షల సామర్థ్యం తక్కువగా ఉండటంతో నమూనాలను తరచూ ఎపి వెలుపల లేదా ప్రైవేట్ ల్యాబ్‌లకు పంపాల్సి వస్తోంది. జెఎన్‌టియు కాకినాడ ల్యాబ్‌పై అధిక భారం పడుతోంది. నివేదికలు రావడానికి వారాలు, నెలలు పడుతున్నాయి. అప్పటికి కల్తీ ఉత్పత్తులు వినియోగంలోకి వెళ్లిపోయి ఉండవచ్చు. ల్యాబ్‌లను బలోపేతం చేయడానికి పంపిన ప్రతిపాదనలు సంవత్సరాలుగా అమలుకాకుండా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇటీవలి ఘటనలు ప్రకటనలు మరియు సిద్ధత మధ్య ఉన్న నిర్మాణాత్మక అంతరాన్ని వెలుగులోకి తెచ్చాయి. ఆధునిక పరికరాలు ఉన్నా శిక్షణ పొందిన సిబ్బంది, సమయానుకూల పరీక్షా సామర్థ్యం లేనప్పుడు వినియోగదారులకు నిత్యావసర ఆహారంపై అనిశ్చితి నెలకొంటుంది. నియంత్రణ సంస్థల చర్యలు పరిమితమవుతాయి. బాధితులకు మాత్రం ఆలస్యంగానే సహాయం అందుతుంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఆహార భద్రతా వ్యవస్థలో మౌలిక వసతులు ఉన్నా కార్యాచరణ సిద్ధత లేకపోవడం వల్ల ప్రజారోగ్యం భరోసా కంటే యాదృచ్ఛికతపై ఆధారపడుతున్నదనే ఆందోళన కలుగుతోంది.

డా. ముచ్చుకోట సురేష్ బాబు, 9989988912

# మూఢత్వాన్ని బద్దలు కొట్టే ఆయుధం సైన్స్



ప్రొ॥ దేవరాజు మహారాజు
విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్

ప్రతి ఏడాది ఫిబ్రవరి 28న ప్రమనం మన దేశంలో 'నేషనల్ సైన్స్ డే' (NSD) నిర్వహించుకుంటున్నాం. అదే రోజు మన భారత శాస్త్రవేత్త సర్. సి.వి. రామన్ దేశానికే కాదు, మొత్తం ఆసియా ఖండానికే తొలి నోబెల్ బహుమతి తీసుకొచ్చారు. దానితో భారతీయ వైజ్ఞానిక ప్రతిభ విశ్వవ్యాప్తమైంది. ఆయన తన పరిశోధనల్ని 'రామన్ ఎఫెక్ట్' పేరుతో 28 ఫిబ్రవరి 1928న ప్రతిపాదించారు. ఆ రోజును గుర్తు చేసుకుంటూ దేశ ప్రజలలో వైజ్ఞానిక స్ఫూర్తి నింపడానికి ఫిబ్రవరి 28ని జాతీయ వైజ్ఞానిక దినంగా నిర్వహించుకుంటున్నాం. అయితే సర్ సి.వి.రామన్‌కు నోబెల్ పురస్కార ప్రదానం 1930లో జరిగింది. అధికారికంగా ఈ రోజును సైన్స్ డేగా ప్రకటించాలని నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూనికేషన్ (NCSTC) భారత ప్రభుత్వాన్ని కోరింది. ప్రభుతం 1986లో ఆమోదించింది. ఆ తర్వాత మొదటిసారి సైన్స్ డే 28 ఫిబ్రవరి 1987న జరిగింది. ఆ తర్వాత ప్రతి ఏటా జరుగుతూనే ఉంది. కాలక్రమంలో దీనిలో కొన్ని మార్పులు జరుగుతూ వచ్చా యి.

వైజ్ఞానిక విషయాల్ని ప్రతిభావంతంగా జనంలోకి తీసుకుపోయిన వారిని గుర్తించి, NCSTC మొదటిసారి 'నేషనల్ సైన్స్ : పాపులరైజేషన్ అవార్డు' 1987 నుంచి ఇవ్వడం ప్రారంభించింది. ఈ కార్యక్రమం ప్రతి ఏడాది 28 ఫిబ్రవరిన కొనసాగుతుంది. ఇది కాకుండా దీనికి మరొక విషయం కూడా చేరింది. ప్రతి ఏడాది సైన్స్ డేకు ఒక ఇతి వృత్తం (THEME) ఏర్పాటు చేసుకుని, దాని ప్రకారం కార్యక్రమాలు నిర్వహించడం ఒక ఆనవాయితీ అయింది. CROP FOR DROP – WELTH FROM WASTE – BLUE PRINT OF LIFE వంటి ముఖ్యమైన విషయాలపై జరిగింది. 2023కు సంబంధించిన థీమ్ GLOBAL SCIENCE FOR GLOBAL WELLBEING అని విశ్వ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఏర్పరుచుకున్నది. 2024 సంవత్సరానికి SCIENCE FOR A SUSTAINABLE FUTURE విశ్వవ్యాప్తంగా ఎదురవుతున్న సవాళ్ళను ఎదుర్కొంటూ, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో నిలకడగా ఉండే ఉజ్వల భవిష్యత్తును రూపొందించుకోవడం!

**సైన్స్ డే సందర్భంగా నిర్వహించుకోవాల్సిన కార్యక్రమాలు:**

1. నిత్య జీవితంలో సైన్సు ప్రాముఖ్యతను గ్రహించే విధంగా కార్యక్రమాలు రూపొందించుకోవాలి. 2. మానవాభ్యుదయానికి ఉపయోగపడే వైజ్ఞానిక పథకాలకు రూపకల్పన చేసుకోవాలి. 3. సమాజంలో వైజ్ఞానిక అవగాహన పెంచడానికి కృషి చేసిన, చేస్తున్న వారి అభిప్రాయాలు తెలుసుకుంటూ ఉండాలి. వాటికి ప్రాధాన్యత కల్పించాలి.

సైన్స్ డే పాఠశాలలకు, కళాశాలలకు, విశ్వవిద్యాలయాలకు మాత్రమే పరిమితం కాదు. అన్ని పౌర సంఘాల్లో దీన్ని ఘనంగా జరుపుకోవాలి. దేశ పౌరుల్లో ముఖ్యంగా బాలబాలికల్లో సైన్సు పట్ల ఆసక్తిని పెంచడానికి దీన్ని ఉపయోగించాలి. సైన్స్ డే సందర్భంగా ఉపన్యాసాలు, ఊరేగింపులు, వైజ్ఞానిక ప్రదర్శనలు, సంబం ధించిన పోటీలు నిర్వహించి జనంలో అవగాహన పెంచాలి.

సైన్స్ డే సందర్భంగా ఒక్క సి.వి. రామన్ జీవిత విశేషాలే కాకుండా, విలు వలకు కట్టుబడి సైన్స్ కోసం జీవితాలు ధారపోసిన ఎంతోమంది భారతీయ వైజ్ఞా నికుల వ్యక్తిత్వ ఔన్నత్యం యువతరానికి అందిస్తూ ఉండాలి. మన విద్యావిధానంలో ఉన్న ప్రధాన లోపమేమంటే, క్లాసురూమ్‌లో సైన్సు సూత్రాలు మాత్రమే చెపుతారు. అంతేగానీ, ఒక శాస్త్రవేత్త, ఎన్ని ఒడిదుడుకులను ఎదుర్కొని ఆ పరిశోధనలు చేయగలిగాడన్నది మాత్రం సంక్షిప్తంగానైనా చెప్పరు. ఏ అవకాశాలూ లేని రోజుల్లో వారు ఎంతగా శ్రమించారో చెప్పరు. యువతీయువకుల వ్యక్తిత్వ వికాసానికి ఉపయోగపడే వారి జీవిత నేపథ్యం గూర్చి చెప్పరు. అభిరుచి ఉన్నవారు వెతుక్కుని వెతుక్కుని చదువుకోవాల్సిందే! అందుకే చూడండి. పాఠ్యగ్రంథాలు రాసే రచయితలు అవసరమే కానీ వారి కన్నా సరళ వైజ్ఞానిక రచనలు చేసే రచయితల్ని జనం అధికంగా అభిమానిస్తారు. ఇటు శాస్త్రవేత్తకూ అటు పాఠకుడికీ మధ్య సుగమ విజ్ఞాన రచయిత ఒక వారధిలా నిలబడుతున్నాడు. సమాజం వివేకవంతం కావడానికి నిరంతరం కృషి చేస్తున్నాడు.

మత విశ్వాసాలు ప్రధాన పాత్ర పోషిస్తున్న మన దేశంలో సైన్స్‌డే నిర్వహణ అత్యవసరం!

ప్రపంచమంతా వైజ్ఞానికంగా ముందుకు దూసుకుపోతున్న తరుణంలో కొందరు మన దేశ పౌరులు, మన ప్రభుత్వ పెద్దలు మూఢనమ్మకాలకు పెద్ద పీట వేస్తున్నారు. దేశాన్ని మూడువేల ఏళ్ళ నాటి అనాగరిక సమాజంలోకి లాక్కుపోతున్నారు. ఆ ప్రమాదం లోంచి దేశాన్ని రక్షించుకోవాలంటే దేశ పౌరులంతా వివేకం ప్రదర్శించాలి. సైన్సును ఒక వెన్నెముకగా చేసుకుని ప్రగతి పథంలోకి నడవాలి. నేషనల్ సైన్స్ డే (ఫిబ్రవరి 28), జాతీయ వైజ్ఞానిక స్పృహ దినం (ఆగష్టు 20), వరల్డ్ ఎన్విరాన్‌మెంట్ డే ప్రపంచ పర్యావరణ దినం (జూన్ 5), వరల్డ్ ఎర్త్ డే ప్రపంచ భూమి దినోత్సవం (ఏప్రిల్ 22), వరల్డ్ ఓషన్ డే ప్రపంచ సముద్ర దినం (జూన్ 8), అంతర్జాతీయ శాంతి దినోత్సవం (సెప్టెంబర్ 21), ఇంటర్నేషనల్ ఫ్రెండ్‌షిప్ డే అంతర్జాతీయ స్నేహ సౌభ్రాతృత్వ దినం (జులై 302024), ఎవల్యూషన్ డే పరిణామదినం (నవంబర్ 24) వంటి రోజుల ప్రాముఖ్యాన్ని దేశ పౌరులకు గుర్తు చేస్తుండాలి. ముఖ్యంగా రాబోయే తరాలకు సరైన పరిజ్ఞానాన్ని అందిం చి, వారు విశ్వ మానవులుగా ఎదగడానికి దోహదపడాలి. ఇలాంటి ముఖ్యమైన రోజుల సందర్భంగా అవగాహన పెంచే కార్యక్రమాలు, వేడుకలు పల్లెపల్లెలో, వాడవాడల్లో ఘనం గా జరుపుకుంటూ ఉండాలి.

బాధ్యత ప్రభుత్వాలది, ప్రభుత్వ సంస్థలది మాత్రమే కాదు. ప్రతి పౌరుడి ది కూడా! మూఢత్వాన్ని వదిలి, చేతనత్వంలోకి రావాలంటే మనం మన రాజ్యాంగంలో రాసుకున్న 51A(H) స్ఫూర్తిని నిలుపుకోవాలంటే, ప్రతి పౌరుడూ చిత్తశుద్ధితో పనిచేయక తప్పదు. ఇప్పటి దేశ కాల పరిస్థితులను చూస్తుంటే, ఇక ఆ దిశలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఆలోచించి ఆచరించాల్సిన అవసరం వచ్చిందని అనిపిస్తోంది.

రాజకీయాలు, సినిమాలు, పూజలు, జ్యోతిష్యాలు, క్రికెట్ వంటి అంశాలకు ఎక్కువ ప్రాధాన్యమిస్తున్న కొన్ని మీడియా సంస్థలు ప్రజాసమస్యల మీద దృష్టి పెట్టడం లేదు. మరీ ముఖ్యం గా ప్రజలకు వైజ్ఞానిక అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమవుతున్నాయి. అలాగని వదిలేద్దామా? బాధ్యత గల పౌరులు, సంస్థలు, సోషల్ మీడియాలో ఒక భాగం నిజాయితీగా పనిచేస్తూనే ఉన్నాయి. కొంతలో కొంత ఆ లోటును తీరుస్తూనే ఉన్నాయి. విజ్ఞాన పిపాసులంతా వారికి వెన్నుదన్నుగా నిలవాలి. అధికారం అహంకారం ధనం – హుంకరిస్తూనే ఉంటా యి. కానీ, ప్రజాబలం ముందు అవి ఎప్పుడూ ఓడిపోవాల్సిందే!






ఇప్పుడు ప్రజల చేతిలో ఉన్న ఆయుధం ప్రశ్న!

ప్రశ్నలోంచి ఎదుగుతూ వచ్చిందే సైన్సు !!

ఈ సైన్సు అంత ముఖ్యమైందిగా ఎందుకయ్యింది? అంటే చీకటిలోంచి వెలుగులోకి వెళ్ళాలంటేసైన్సే ఆసరా.

అనాగరికతను, మూర్ఖత్వాన్నీ వదిలి విశాల విశ్వంలో అత్యాధునిక మానవులుగా నిలబడాలంటే, సైన్సు తప్ప మరో మార్గం లేదు.

అన్యాయాల్ని, అబద్ధాల్ని, దుర్మార్గాల్ని ఛేదించాలంటే తీసుకోక తప్పదు సైన్సు సహాయం.

అలాగే ఇప్పుడు ప్రభుత్వాల మూఢత్వం బద్దలు కొట్టాలన్నా మనకున్నది ఒక్కటే పదునైన ఆయుధం అదే సైన్స్ !

(నేడు సైన్స్ డే )

# లీగల్ పోరాటం నుంచి రాజకీయ పోరాటంలోకి ట్రంప్

రోహిత్ త్రిపాఠి

లెర్నింగ్ రిసోర్సెస్ కేసు (ఫిర్యాదు దారుల పేరుతో)గా ఇప్పుడు పిలవబడుతున్న ప్రసిద్ధ సుంకాల కేసు ఇప్పుడు పుస్తకాలలోకి వెళ్లిపోయింది. కలకలం రేపుతున్న అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రెండవ టరం ఆర్థిక పునరుద్ధరణ వ్యూహాన్ని ఎంచుకుని ఎన్నడూ లేని రీతిలో సుంకాలు విధింపు చర్యలు ప్రారంభించింది. అనుకున్నట్లే అది సుప్రీంకోర్టుకు చేరింది – అది అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు మేలు చేయలేదు. పన్నులు, సుంకాలు విధించే అధికారం కాంగ్రెస్ కు తప్ప అధ్యక్షుడికి (కార్యనిర్వాహకవర్గానికి) లేదని సుప్రీంకోర్టు 6–3తో తీర్పు చెప్పింది.

సుంకాలు కేంద్రకంగా ఉన్న ఆర్థిక విధానం చేబట్టటానికి ట్రంప్‌కు అనేకానేక వ్యక్తిగత, రాజకీయ, సైద్ధాంతిక కారణాలున్నాయి. వ్యక్తిగతంగా, అధ్యక్షుడు ట్రంప్ వాణిజ్యలోటుల కు పూర్తిగా వ్యతిరేకి. జపాన్, చైనా వంటి దేశాలు 1980 దశకం నుంచి అమెరికాతో వ్యాపారంలో భారీగా మిగులు కలిగి ఉన్నాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థ అంతటా, ముఖ్యంగా తమ పారిశ్రామిక పునాదికి ప్రపంచీకరణ సృష్టించిన చేటుకు దాని వెనుకనున్న ఈ అసమానతలనే కారణంగా చూశారు. ఈ అసమానతను వెనక్కి మళ్లించటానికి స్థిరమైన శిక్షాత్మక వ్యూహంగా సుంకాలు పనిచేస్తాయన్న ట్రంప్ భాష్యాన్ని అనేకమంది ఆర్థిక వేత్తలు సవాలు చేశారు. సుంకాల విధింపు అమెరికాలో తగ్గిపోయిన పారిశ్రామికీకరణను పునరుద్ధరించటానికి దోహదకారి అవుతుందన్న ట్రంప్ భావన మరింత వివాదాస్పదమైంది. ప్రపంచీకరణపట్ల ఈ అసంతృప్తే 2016లో ఆశ్చర్యకరంగా ఆయన్ను అధ్యక్షునిగా ఎన్నుకుంది. అందువల్ల ప్రపంచీకరణ, సుంకాల శక్తి గూర్చిన ఈ వ్యక్తిగత అభిప్రాయం రాజకీయ ప్రాముఖ్యత సంతరించుకుంది.

కోవిడ్ మహమ్మారి ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసింది; అది కలుగజేసిన ద్రవ్యోల్బణం ప్రజల్లో ఆర్థిక ఆందోళన సృష్టించింది. 2024 అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి అయిన డోనాల్డ్ ట్రంప్ సుంకాల వాదనను బలంగా ముందుకు తేవటం ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌పై ఆయన విజయానికి బాటవేసింది. అధికార స్థానంలోకి వచ్చాక, వ్యక్తిగత, రాజకీయ కారణాలు కార్యనిర్వాహకవర్గం (ఎగ్జిక్యూటివ్) కింద అధికారం కేంద్రీకరణకు మరింత శక్తిమంతమైన సైద్ధాంతిక సాధనాలయినాయి. అత్యంత శక్తిమంతమైన ఎగ్జిక్యూటివ్‌ను సృష్టించే అడ్మినిస్ట్రేటివ్ ప్రయత్నాలకు "యూనిటరీ ఎగ్జిక్యూటివ్ సిద్ధాంతం"ను విరివిగా ప్రచారంలో పెట్టటం జరిగింది. సుప్రీంకోర్టు గాలి తీసింది.

ఈ కేసు లీగల్‌గా కన్నా అది సృష్టిస్తున్న రాజకీయ చరిత్రకు ఎక్కువగా గుర్తుంచుకోబడుతుంది. అయినా సుప్రీంకోర్టు తీర్పులోని విస్తృత పర్యవసానాలను మెరుగ్గా అవగాహన చేసుకునేందుకు అందులోని లీగల్ కేసును శీఘ్రంగా సమీక్షించటం కీలకం. పైన చెప్పినట్లు, వ్యవస్థీకృత సుంకాల వ్యవస్థ ద్వారా అమెరికా వాణిజ్య సంబంధాలను తమకు అనుకూలంగా సరిదిద్దాలని ట్రంప్ ప్రభుత్వం ఆసక్తితో ఉంది. సుంకాలనేవి సాంప్రదాయకంగా పన్నుగా చూడబడుతున్నాయి. అందువల్ల సుంకాల్లో మార్పులు శాసన విభాగమైన యుఎస్ కాంగ్రెస్ ద్వారా వెళ్లాలి. ప్రతినిధుల సభలో(దిగువ సభ) రిపబ్లికన్‌లకున్న మెజారిటీ అత్యల్పం; యుఎస్ సెనేట్‌లో చాలీచాలని మెజారిటీ (శాసనాన్ని సభ ముందుకు తేవటానికి 100 లో 60 ఓట్లు అవసరం) – రిపబ్లికన్‌లకున్న సీట్లు 53. వెసులుబాటుతో కూడిన సుంకాల శాసనాన్ని కాంగ్రెస్ ద్వారా పొందటం అసాధ్యం కాకపోయినా కష్టతరం. అందువల్ల ప్రభుత్వం 1977 నాటి చట్టాన్ని ఉపయోగించాలని నిర్ణయించింది. ప్రభుత్వం తన సుంకాల వ్యూహానికి లీగల్ ప్రాతిపదికగా "ఇంటర్నల్ ఎమర్జెన్సీ ఎకనామిక్ పవర్స్ చట్టం (ఐఇఇపిఎ) ఉపయోగించింది.



చిత్రమేమంటే, సుంకాలు విధించేందుకు అమలులో ఉన్న చట్టాలు ఉపయోగించేటట్లు ఎగ్జిక్యూటివ్‌ను నియంత్రించటానికి ఐఈఇప చట్టం ఉద్దేశించబడింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే, జాతీయ ఆత్యయిక స్థితిలో అంతర్జాతీయ వాణిజ్యాన్ని నియంత్రించటానికి ఆ చట్టం అధ్యక్షుడికి అధికారమిచ్చింది. అందులోని "నియంత్రణ" (రెగ్యులేట్), "ఎమర్జెన్సీ" పదాలు గమనించదగినవి. రెగ్యులేట్ పదాన్ని మించి టారిఫ్ అథారిటీని చట్టం ప్రస్తావించలేదు. రెగ్యులేట్ పదం సుంకాలు విధించే అథారిటీని పరివేష్టిస్తుందని సొలిసిటర్ జనరల్ డి.జాన్ సాయిర్ చెప్పారు.

పూర్తి అవగాహన కోసం, ఈ చట్టం ఉపయోగించటానికి చెప్పిన అత్యవసర పరిస్థితులు – మెక్సికో, కెనడాల నుంచి విపరీతంగా డ్రగ్స్ అక్రమ రవాణా. ఓవర్ డోస్ వల్ల పెద్దగా మరణాలు, మత్తుపదార్థాల దురలవాటు; ఇతర దేశాలు అక్రమ వ్యాపార పద్ధతులకు ఒడిగట్టడం. అందువల్ల మనకు ద్విముఖ ఎమర్జెన్సీ ఉంది, చర్యలు తీసుకోవలసిన రెగ్యులేటరీ అథారిటీ అధ్యక్షుడు అన్నది ప్రభుత్వ వాదన. చట్టంలో కాంగ్రెస్ 'రెగ్యులేట్' అని మాత్రమే ఉపయోగించింది గాని నిర్దిష్టత ఇవ్వలేదు. ఎందుకంటే అధ్యక్షునికి విదేశాంగ విధానం, రక్షణ విషయాల్లో విశేషాధికారాలున్నాయన్నది ప్రభుత్వ సమర్ధన. పన్ను విధించే అధికారం లెజిస్లేటివ్ బ్రాంచిది అనే వాదనలకు మించి, రిపబ్లికన్ లు నియమించిన జడ్జీల (9మందిలో ఆర్గురు) నుంచి ఒక తరహా ప్రశ్నలను సొలిసిటర్ జనరల్ ఊహించారు. అది "మేజర్ క్వచ్చెన్స్ డాక్ట్రిన్ (ఎంక్యుడి). ఇది చీఫ్ జస్టిస్ రాబర్ట్స్ కోర్టులో ఇటీవల కాలంలో రూపొందిన సిద్ధాంతం. ఫెడరల్ ఏజన్సీ కాంగ్రెస్ నుంచి స్పష్టమైన ఆమోదం లేకుండా "తీవ్ర ప్రభావం గల చర్య" తీసుకున్నట్లయితే దాన్ని సుప్రీం కోర్టు కొట్టివేస్తుంది అనేది అందులోని ప్రధానాంశం. ఇది చాలా వివాదాస్పదమైన సిద్ధాంతం. బైడన్ ప్రభుత్వ కాలంలో అనేక కేసుల్లో ఈ సిద్ధాంతం ఉపయోగించబడింది, ప్రభుత్వ నిర్ణయాలు చెల్లుబాటు కావని కొట్టివేయబడినాయి. ఈ కేసులో జడ్జీలు ప్రశ్నలు వేయటం ఆరంభించగానే ప్రభుత్వ లీగల్ వ్యూహం కుప్పకూలింది. సుంకాలు విధించే అధికారం ప్రభుత్వానికి లేదని అంతిమంగా తీర్పు చెప్పిన ఆర్గురు జడ్జీలు – సుంకాలు పన్ను కాదనీ, వాటిని విధించే అధికారం ఐఇఎ తమకు ఇచ్చిందనే ప్రభుత్వ వాదనను త్రోసిపుచ్చారు. ముగ్గురు రిపబ్లికన్ జడ్జీలు (రాబర్ట్స్, బారెట్, గోర్సచ్), ముగ్గురు డెమొక్రట్ జడ్జీలు (కగన్, సాటోమేయర్, జాక్సన్) – అధికారాల విభజన ప్రకారం పన్నులు విధించే అధికారం కాంగ్రెస్‌కే ఉందని స్పష్టం చేశారు.

అంతిమంగా 6–3 తీర్పు – ఐఇఎకు సరళ భాష్యంతో, పన్నులు విధించే అధికారం కాంగ్రెస్‌దేనన్న రాజ్యాంగ సూత్రం పునరుద్ఘాటనతో ముగిసింది. సుంకాలను విదేశాలు చెల్లిస్తున్నాయన్న ప్రభుత్వ వాదనను న్యాయమూర్తులు త్రోసిపుచ్చారు. ప్రభుత్వం వసూలు చేస్తున్న పన్నులను అమెరికన్‌లు చెల్లిస్తున్నారని చెప్పారు. 6–3 తీర్పు ఇచ్చిన జడ్జీల్లో రిపబ్లికన్‌లు నియమించిన ముగ్గురు జడ్జీలు తమ నిర్ణయానికి సమర్ధనగా మేజర్ క్వచ్చెన్స్ సిద్ధాంతాన్ని ఉదహరించారు. జడ్జీలందరూ సుంకాల సమస్యను యుఎస్ కాంగ్రెస్‌కు పంపారు – ఈ విధానాన్ని కొనసాగించదలుచుకుంటే శాసన విభాగం వద్దకు వెళ్ళండని ప్రభుత్వానికి చెప్పారు. ట్రంప్ ప్రభుత్వం ఎంతగానో ఆధారపడిన విధానాన్ని సుప్రీం కోర్టు కొట్టివేయడంతో ప్రభుత్వం గందరగోళంలో ఉంది. దీని ప్రభావం నవంబర్‌లో జరిగే మధ్యంతర ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటును పెంచుతుందని భావించబడుతుంది. దాన్ని అధిగమించేందుకే ట్రంప్ దీన్ని రాజకీయ సమస్యగా, దేశభక్తి సమస్యగా మార్చి జడ్జీలపై ఎదురుదాడి చేస్తున్నారు.

*('ది లీఫ్‌లెట్' సౌజన్యంతో – ఐపిఎ సర్వీస్)*



## మంత్రి కొండా సురేఖకు కీసరగుట్ట ఆలయ చైర్మన్ కృతజ్ఞతలు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు విజయవంతం అయ్యేందుకు సహకరించిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఆలయ అర్చకులు వేదాశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ తటాకం వెంకటేశ్‌శర్మ, ఇఒ సుధాకర్‌రెడ్డిలు సురేఖకు కృతజ్ఞతలు తెలిపారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగార్వర్‌కు ప్రసాదం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం సహకరిస్తుందని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు కొనసాగుతాయని అన్నారు.



## ఒకరి రక్తదానం మరొకరికి ప్రాణదానం

### ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు నాయుడు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ఒకరి రక్తదానం మరొకరి ప్రాణాన్ని నిలుపుతుందని విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. అప్పారావు నాయుడు అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ డివిజన్ పరిధిలోని కొండాపూర్ విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం స్ఫూర్తి ఆర్గనైజేషన్ సంయుక్తంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ జూబ్లీ హిల్స్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని శుక్రవారం స్ఫూర్తి ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షుడు మేకల పద్మారావు, లయన్స్‌క్లబ్ జోనల్ హెడ్ ధర్మారెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు యువత అపోహలు వీడి రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పద్మారావు మాట్లాడుతూ ప్రాణాపాయ సమయంలో రక్తం అందక ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థులు, యువత రక్తదానానికి ముందుకు వచ్చి తము రక్తదానం చేస్తూ మరింత మందిని ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఏ శ్రీలత, ఎన్ఎస్ఎస్ విభాగం కో ఆర్డినేటర్లు ప్రవళిక, ప్రత్యుష, పూజశ్రీ, హరిత,అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ పైప్‌లైన్ వేయాలని డిసికి వినతి



**ప్రజాపక్షం/చర్లపల్లి:** నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లి రఘువీర్ నగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ వేయాలని ఘట్కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. నాగారం డివిజన్ పరిధిలోని రఘువీర్‌నగర్‌లో రోడ్ నంబర్ 2లో డ్రైనేజీ సమస్యతో గత రెండు సంవత్సరాల క్రితం సొంత ఖర్చుతో 4 ఇంచుల పైప్‌లైన్ వేయించుకున్నారు. కాలనీలోని మిగతా మూడు రోడ్డులలో ఒక ఫీటు పైప్‌లైన్ వేస్తున్నారని రోడ్ నంబర్ 2లో ఒక ఫీట్ పైప్‌లైన్ వేయాలని కాలనీ సభ్యుడు కసగోని వెంకటేష్ గౌడ్ డిసికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిసి పైప్‌లైన్ వేస్తానని హామీ ఇచ్చారు.



## ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు అవగాహన కల్గి ఉండాలని చిన్నప్పటి నంచే విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన ఉంటే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని శామీర్‌పేట డిటెక్టివ్ ఆఫీసర్ రాజు అన్నారు. శుక్రవారం గ్రెటర్ హైద్రాబాద్ పరిధిలోని శామీర్‌పేట డివిజన్ తూంకుంటలోని విజన్ హైస్కూల్లో ట్రాఫిక్ నియమాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు నిబంధనల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అప్పుడే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమని చెప్పారు. రహదారిపై నడిచేటప్పుడు, వాహనాలను నడిపేటప్పుడు పాటించాల్సిన ముఖ్యమైన ట్రాఫిక్ నియమాలను విద్యార్థులకు వివరించారు. ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనం నడిపేవారు సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. రోడ్డు భద్రత నియమాలను పాటిస్తు బాధ్యతాయుత పౌరులుగా ఉండాలని సంకల్పం చేశారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట ఎస్ఐ శశివర్ధన్‌రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ నవీన్‌రెడ్డి, ప్రిన్సిపల్ సతీష్, విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

## చిన్నారులకు పౌష్టికాహారం

### మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్ అన్నారు. శుక్రవారం మూడుచింతలపల్లి మున్సిపల్ ఉద్దెమర్రిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు, గర్భిణీలకు, బాలింతలకు అందిస్తున్న మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి చిన్నారికి ఆట పాటలతో విద్యను నేర్పించాలని సూచించారు. బలమైన పౌష్టికాహరం అందించడంతో చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ప్రోటిన్ డేలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, కౌన్సిలర్లు రాజిగళ్ల లత, దోసకాయల లత, పులి ప్రభాకర్, పెద్దిరెడ్డి శ్రీలత, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# బషీరాబాద్‌లో హుబ్లీ ట్రైన్ ప్రారంభం

### ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగం

### చేవెళ్ళ ఎంపి, తాండూరు ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/తాండూరు:** బషీరాబాద్ మండల ప్రజల కల నెరవేరిందని, బషీరాబాద్ మండల పరిధి నవాంధ్గి రైల్వే స్టేషన్‌లో హుబ్లీ ట్రైన్ నిలుపడం సంతోషదాయకమని చేవెళ్ళ పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం నవాంధ్గి రైల్వే స్టేషన్‌లో హుబ్లీ ఎక్స్‌ప్రెస్ రైలును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ



ఈ నిర్ణయం చాలా సంతోషదాయకమన్నారు. హుబ్లీ ట్రైన్‌ను నవాంధ్గి స్టేషన్‌లో గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడి నాయకులు, వ్యాపారవేత్తలు, ప్రముఖులు, స్థానిక ప్రజలందరి చిరకాల కోరిక ఉండేదని, అది నేటితో నెరవేరిందన్నారు. ఎంపిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చేసిన కృషి అన్నారు.

తెలంగాణలోనే మారుమూల ప్రాంతం కర్ణాటక సరిహద్దులో ఉన్న బషీరాబాద్‌లో హుబ్లీ ట్రైన్ ఆపడంతో ఈ ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఇక్కడి ప్రజలు ఎక్కువగా తమ కష్టం మీద ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. హుబ్లీ ట్రైన్ నిలుపుదలతో ప్రయాణీకులకు సౌకర్యం పెరగడంతో పాటు సమయం, ఖర్చు ఆదా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కుమ్మెర ఘటన మానవత్వానికే మచ్చ



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బోడుప్పల్ సర్కిల్ 10వ, డివిజన్ లో భగత్ సింగ్ నగర్ కాలనీలో మహిళ సమైఖ్య మేడిపల్లి మండల కార్యదర్శి సిహెచ్ మాధవి ఆధ్వర్యంలో కుమ్మెర ఘటన నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మానవత్వానికి మచ్చతెచ్చే విధంగా చిన్నారిని హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలల పసిగుడ్డు ప్రాణాలు తీసిన హంతకులను ప్రభుత్వం



వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. మల్లన్న జాతరలో చిన్నారి తల్లి దర్శనం అడిగినందుకు ఆ పాపను పొట్టనపెట్టుకున్నారని మండిపడ్డారు. దేవుడు దర్శనం అడిగిన పాపానికి, దాడి చేసి మానవత్వానికే మచ్చ తెచ్చారని ఆగ్రహించారు. ఈ దారుణానికి పాల్పడిన వారు ఎంతటి వారైనా శిక్ష పడాల్సిందేనని హెచ్చరించారు. పసిగుడ్డు ముఖం చూసి తండ్రిని వదలిపెట్టమని ప్రాధేయపడ్డ, వదలకుండా కాలితో ఆ పాపను తన్నితే చనిపోయింది. రెండు నెలల పసిగుడ్డుకు కులం తెలుసా..? మనుషులను చిన్నచూపు చూసి దర్శనానికి రానివ్వకుండా చేయడం ఘోరం. ఈ ఘటనకు కారణమైన ఎనిమిది మందిని అరెస్టు చేయాల్సిందే. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ ఘటనపై స్పందించాలి. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలి పొత్తిళ్లలోని పసిగుడ్డును హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమం లో బిసి సంఘం జిల్లా నాయకులు కె. ప్రమీల, బికెఎంయు మండల కార్యదర్శి కె. మహాలక్ష్మి, మహిళా సమైక్య నాయకులు మేకల లక్ష్మి, జానకమ్మ, రత్నమ్మ, సిపిఐ పార్టీ నాయకులు ఇస్తారి, సోమరాజు, ఉపేందర్, మల్లేష్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**చర్లపల్లిలో :** నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెరా గ్రామంలో రజక కుటుంబం మీద జరిగిన దాడిలో మృతి చెందిన 2 నెలల చిన్నారికి న్యాయం జరగాలని నిందితులను శిక్షించాలని జిహెచ్ఎంసి నాగారం డివిజన్ పరిధిలో అన్నంరాజు రజక సంఘం ఆధ్వర్యంలో నాగారం బొడ్రాయి నుండి రాంపల్లి చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, మాజీ కౌన్సిలర్లు అన్నంరాజు శ్రీనివాస్, సురేష్, పంగ హరిబాబు, రజక సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా కంటి వైద్య శిబిరం

**ప్రజాపక్షం/వికారాబాద్:** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రూపొంచిన ఆరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని వికారాబాద్ జిల్లా పోలీసులు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఈ క్యాంపెనయిన్ లో భాగంగా వికారాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్ సిఐ రాఘుకుమార్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రాముల్‌నాయక్ తో కలిసి జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా పాల్గొని కంటి వైద్యశిబిరంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ రోడ్డు నియమ నిబంధనలపై అవగాహన ఉన్నపటికి ,వాహనదారులు ప్రదర్శించే చిన్నపాటి నిర్లక్ష్యం అనేక కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగులుస్తోందని అవేదన వ్యాక్తం చేశారు. డ్రైవర్ల చేతుల్లోనే ఉంగటాయని ఎస్‌పితెలిపారు. వాహనం నడిపే సమయంలో క్రమశిక్షణపాటిస్తే మన ప్రాణాలతో పాటు ఎదుటివారిని కూడా సురక్షితంగా ఉంచగలమని పేర్కొన్నారు. ప్రమాదాలు నివారణకు ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావడాపనికి క్షేత్రస్థాయిలో మరిన్ని అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ,అదే సమయంలో నిబంధనలుఉల్లంఘించే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా కంటి చూపు లోపాలు ఉన్న డ్రైవర్లకు రాత్రి వేళల్లో ప్రమాద



ముప్పు ఎక్కువగా ఉంటుందికావున డ్రైవర్లందరూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించు కోవాలని అనంతరం కార్యక్రమంలో పాల్గొని ఆటో , కార్, బస్సు, లారీ డ్రైవర్లు, విద్యార్థులు, యువతతో కలిసి ఆమె రహదరి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఈఅవగాహన కార్యక్రమంలో డిఎస్‌పి శ్రీనివాస్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

**పరిగి:** రోడ్డు భద్రతల్లో నిర్లక్ష్యం ప్రాణాంతకం ,ఎస్‌పి :పరిగి డివిజన్ పరిధిలోని వివిధ రవాణాసంఘాలకు చెందిన డ్రైవర్లకు మాక్స్‌విజన్ సౌజన్యంతో కంటి వైద్యపారీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి పాల్గొని మాట్లాడుతూ ప్రతి పౌరుడు క్షేమంగా తన గమ్యస్థానానికి చేరుకోవాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. నిద్రలేమి ,అతి వేగం మద్యం సేవించి వాహనాలు నడపడం ముబైల్ ఫోన్ వినియోగం ,ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనం నడిపే సమయంలో క్రమశిక్షణ పాటిస్తే మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడగలమని తెలిపారు. తప్పనిసరిగా సిట్ బెల్ట్ , హెల్మెట్ వినియోగించాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్‌పి రాముల్‌నాయక్ , డిఎస్‌పి శ్రీనివాస్ , తహసీల్దార్ వెంకటేశ్వరి , సిఐశ్రీనివాస్రెడ్డి తదితులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం /వికారాబాద్ :** పట్టణానికి సంబంధించిన 78కళ్యాణలక్ష్మి , 31 షాదీముబారక్ , సిఎంఆర్ 23 చెక్కులను లబ్దిదారులకు వికారాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అనన్య చెక్కుల ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ అందజేస్తున్న దానిని మంచి పనులకు ఉపయోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ సుధాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహరెడ్డి, తహసీల్దార్ లక్ష్మి నారాయణ, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ టీచర్లు, విద్యార్థులు

### ఎంపి ఈటల



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే లభిస్తుందని, ఉన్నత స్థాయికి చేరుకొనే సత్తా ఇక్కడ చదివే వారికే ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. అత్యధిక పోటీని తట్టుకొని ప్రభుత్వ ఉపాధ్యాయులుగా నియమితులై అంకితభావంతో విద్యార్థులను తీర్చి దిద్దుతారన్నారు. హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఇండియా స్వచ్ఛంధ సంస్థ భాగస్వామ్యంతో ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్‌లతో కల్సి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల నిర్వహణ బాధ్యతల్లో తమ వంతు బాధ్యతగా స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావటం హర్షణీయమని, మల్లాపూర్ మండల పరిషత్ పాఠశాల భవనానికి టెక్నిప్ ఎఫ్ఎంసి సంస్థ స్పాన్సర్‌గా వ్యవహరిస్తోందన్నారు. దీనివల్ల ప్రభుత్వ పాఠశాల ల్లో మౌలిక వసతులు, విద్యార్థుల బోధనా పరికరాలు మెరుగవుతాయన్నారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించేందుకు ప్రభుత్వ ఉద్యోగులు సైతం ముందుకు రావాలన్నారు.

## ప్రోటీన్ కల్గిన ఆహారాన్ని తీసుకోవాలి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే విటమిన్‌లు కల్గిన ఆహారాన్ని క్రమం తప్పక తీసుకోవాలని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అలియాబాద్ మున్సిపాలిటి మజీద్‌పూర్‌లో ప్రోటిన్ డే సందర్భంగా ఐబి



కంపెనీ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితం గా చికెన్ వంటకాలను అందించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ శిరీషా మాట్లాడుతూ ప్రజలు నిత్యం తాము తీసుకునే ఆహారంలో విటమిన్‌లు ఉండే ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రొటీన్‌లు కలిగిన చికెన్ వంటకాలను అందించిన ఐబి కంపెని యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ మాలతి మాధవరెడ్డి, అలియాబాద్ మున్సిపల్ అధ్యక్షుడు తుంకి రమేష్, వార్డు కౌన్సిలర్లు సరసం వనజఅశోక్‌రెడ్డి, సామల జశ్వంత్‌రెడ్డి, కైర గణేష్, ఐబి గ్రూప్ కంపెని ప్రతినిధులు, కోదూరి నర్మద, బిసి సెల్ అధ్యక్షులు నర్సింగరావు, నాయకులు తదితరులు పాల్గొన్నా రు.

## సిఎం రిలీఫ్ ఫండ్ ఓ వరం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** అవసరమైన సందర్భాల్లో పేద కుటుంబీకులు ఖరీదైన చికిత్సల ద్వారా వైద్యం జరిపించుకొని తమ ఆరోగ్యాలను కాపాడుకోవటానికి సిఎం రిలీఫ్ ఫండ్ ఓ వరంలాంటిందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో వైద్యం కోసం సిఎం రిలీఫ్ ఫండ్ కింద వెంకటాపురం డివిజన్ హన్మాన్‌నగర్ ప్రాంతానికి చెందిన పద్మజకు మంజూరైన రూ. 1,25,000 ఎల్ఓసి పత్రాలను ఆయన అందచేసారు. నియోజకవర్గంలో చికిత్సల కోసం అవసరమైన వారు తనను సంబంధిత వైద్యులు జారీ చేసిన పత్రాలతో సంప్రదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం మాజీ కార్పొరేటర్ సబితా అనిల్ కిషోర్ గౌడ్, బిఆర్ఎస్ శ్రేణులు మోసిన్, విజయ్ శేఖర్, నారప్ప తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ స్థలం ఆక్రమణపై అఖిలపక్ష ఆందోళన

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** 283 డివిజన్ పరిధిలోని గురుమూర్తి నగర్‌లో గ్రామ పంచాయతీ హయాంలో ప్రజల ఉపయోగార్థం మరుగుదొడ్ల కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ, మున్సిపల్ అధికారులను తప్పుదోవ పట్టించి పట్టా, ఇంటి పన్ను నమోదు చేయించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని అఖిలపక్షం డిమాండ్ చేసింది. ఈ స్థలాన్ని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని అక్కడ బస్తీ దవాఖాన ఏర్పాటు చేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించారు. ఈ అంశంపై సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు వి.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ఉమామహేష్, నర్సయ్య, హరినాథ, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు బి.శివకుమార్, ఉస్మాన్, శ్రీను, తెలుగుదేశం పార్టీ నాయకులు ఎం.నర్సింగరావు, బిజెపి పార్టీ నాయకులు శివరాజ్, సందీప్, చందు, బిఆర్ఎస్ పార్టీ నాయకురాలు రాణి, క్రాంతి యాదవ్, బస్తీ సీనియర్ పెద్దలు అర్జున్, బాలరాజు, అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## డ్రైనేజి తాగునీటి సమస్యను పరిష్కరిస్తా..

### అలియాబద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి


**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మురికినీటితో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజి వ్యవస్థను రూపొందిస్తామని అలాగే తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతామని అలియాబద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అలియాబాద్ మున్సిపల్‌లోని లాల్‌గడిమలక్‌పేటలో మురికినీటి సమస్యపై చైర్ పర్సన్ స్పందించి ఆ వార్డును అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎక్కడెక్కడ డ్రైనేజి వ్యవస్థ సరిగా ఉందో లేదో స్వయంగా చైర్ పర్సన్ సందర్శించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి మాట్లాడుతూ అలియాబాద్ మున్సిపాలిటిని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుచుటకు తక్షణమే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే ప్రజలకు నిరంతరం తాగునీరు వచ్చే విధంగా నూతనంగా బోర్‌ను వేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి, కమిషనర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు మౌనికబాబు, నేమూరి స్వప్న రాంప్రసాద్, కైర గణేష్, అలియాబాద్ మున్సిపల్ అధ్యక్షులు తుంకి రమేష్, చీదు శ్రీనివాస్‌రెడ్డి, ప్రదాన కార్యదర్శి మల్లేష్, బండ సతీష్, బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షలు, ఫలితాల దృష్ట్యా టెలిమానస్ సేవలు : డిఎంహెచ్ఓ

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** జిల్లాలో జరుగుతున్న పబ్లిక్ వార్షిక పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని పెంపొందించే లక్ష్యంగా టెలిమానస్ సేవలను విస్తృతంగా అందుబాటులో ఉంచామని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.ఉమాగౌరి తెలిపారు. పరీక్షల ఒత్తిడి, ఆందోళన, భయం వంటి సమస్యలు ఎదుర్కొనే విద్యార్థులకోసం వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిపుణులైన మానసిక నిపుణులైన కౌన్సిలర్ల సలహాలు పొందేందుకు 14416, 18008914416 ల ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో టెలిమానస్ సేవలకు సంబంధించి ప్రత్యేకంగా రూపొందించిన పోస్టర్లను ఏర్పాటు చేసామన్నారు. పరీక్షల అనంతరం ఫలితాల సమయంలోనూ విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి పెరిగే అవకాశాలు ఉంటాయని, టెలిమానస్ సేవలు నిరంతరం కొనసాగుతాయన్నారు.

## క్రీడలపై యువత మక్కువ పెంచుకోవాలి

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** క్రీడల పట్ల యువత మక్కువను పెంచుకోవాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారం డివిజన్ శ్రీ లక్ష్మి నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన లార్వెన్ బాడ్మింటన్ అకాడమిని ఎమ్మెల్యే కెపి వివేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ యువత విద్య



ఒక్కటే కాకుండా క్రీడలతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. శారీరక ధృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. ప్రతి ఒక్కరు ఏదో ఒక క్రీడ కళను చూపించాలని సూచించారు. బాడ్మింటన్ అకాడమీని యువత సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌లు సత్యనారాయణ, సురేశ్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు సోమేష్ యాదవ్, భాస్కర్, యాదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా, రైతు బీమాకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి : నరేంద్రప్రసాద్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తెలంగాణ ప్రభుత్వం రైతులకు ప్రకటించిన రైతు భరోసా, రైతు బీమా పథకాలకు వచ్చే బడ్జెట్ సమావేశాల్లో నిధులు తక్షణమే మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కోశాధికారి డిజి నరేంద్ర ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం శామీర్‌పేట డివిజన్‌లోని క్రాంతి భవన్ వద్ద రైతు సంఘం జిల్లా కోశాధికారి పుంజూరి చంద్రయ్య అధ్యక్షతన మూడుచింతలపల్లి రైతు ఇలాసాగరం సత్యనారాయణ చేతుల మీదుగా డైరీ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఎఐకెఎస్ సంఘం రాష్ట్ర కోశాధికారి డిజి నరేంద్రప్రసాద్ మాట్లాడుతూ రైతులు పంటలు పండించుటకు పెట్టుబడులకు డబ్బులు లేక అప్పులు చేసి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రస్తుతం నిర్వహించే అసెంబ్లీ సమావేశాల్లో రైతు భరోసా, రైతు బీమా పథకాలకు వెంటనే నిధులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. డైరీ ద్వార రైతులకు పంటల సాగులో మెళకువలు, ఏ పంటలు ఎప్పుడు వేసుకోవాలి, రసాయనిక ఎరువులు వాడకం, తెగుళ్లకు మందులు అన్ని అంశాలు సమగ్రంగా డైరీలో రూపొందించి రైతులకు అందిస్తున్నామని తెలిపారు. కేంద్రప్రభుత్వం తీసుకవచ్చిన విత్తన ముసాయిదా చట్టం 2025 విద్యుత్ సవరణ చట్టం 2025 తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం క్షుణ్ణంగా పరిశీలించి మేధావులతో అధ్యయనం చేసి సవరణల ప్రతిపాదనలను కేంద్రానికి పంపించాలని, రైతులకు ఆమోదయోగ్యమైన విధి విధానాలను లాభసాటి వ్యవసాయాన్ని ప్రోత్సహించే విధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎస్ జిల్లా కార్యదర్శి నిమ్మల నర్సింహా, జిల్లా అధ్యక్షులు జంగయ్య, గౌరవ అధ్యక్షులు సామల వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులు డిజి సాయిలుగౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజిరెడ్డి, కౌసల్య, కౌన్సిల్ సభ్యులు చంద్రయ్య, నర్సింహా, రైతులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
శనివారం
28-02-2026
www.prajapaksham.in
LOCAL NEWS స్థానికం LOCAL NEWS

# ట్రాఫిక్ సిగ్నల్స్ లేని రహదారి వ్యవస్థ లక్ష్యం

హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ విసి.సజ్జనర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేని రహదారుల వ్యవస్థను తీసుకురావడమే లక్ష్యమని సిపి సజ్జనర్ అన్నారు. కెబిఆర్ పార్కు చుట్టూ సిగ్నల్ ఫ్రీ రాకపోకల కోసం రాబోయే రెండేళ్లలో మొత్తం ఏడు ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లను నిర్మించనున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో పెరగనున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని నగరంలో చేపట్టిన 'హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్'(హెచ్‌సిటి) ప్రాజెక్టు పనులు వేగవంతమయ్యాయి. ఇందులో భాగంగా బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2లోని ముగ్ధ జంక్షన్ వద్ద నిర్మిస్తున్న స్టీల్ ఫ్లైఓవర్ పనులను జిహెచ్‌ఎంసి, మెఘా ఇంజినీరింగ్ సంస్థ ప్రతినిధులు, పోలీసు ఉన్నతాధికారులతో కలిసి సిపి సజ్జనర్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి, రాష్ట్రప్రభుత్వం, పోలీసు యంత్రాంగం సమన్వయంతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఈ నిర్మాణాలను దశలవారీగా ప్రణాళికబద్ధంగా చేపడుతున్నట్లు వివరించారు. అందులో భాగంగా శుక్రవారం రాత్రి నుంచే ముగ్ధ జంక్షన్ నుంచి కెబిఆర్ పార్క్ వైపు వెళ్లే మార్గంలో ఆరు పిల్లర్ల నిర్మాణ పనులకు ప్రారంభమవుతున్నట్లు పేర్కొన్నారు. పునాది పనులు పూర్తయ్యే వరకు మాత్రమే రహదారిపై కొద్దిపాటి అసౌకర్యం ఉంటుందని, ఆ తర్వాత వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పూర్తయితే కెబిఆర్ పార్కు పరిసరాలు పూర్తిగా సిగ్నల్ ఫ్రీ జంక్షన్లుగా మారుతాయని, తద్వారా నగరంలోని సెంట్రల్, ఈస్ట్, వెస్ట్ ప్రాంతాలకు సాఫీగా, వేగంగా ప్రయాణించే వీలుంటుందని వివరించారు. నిర్మాణ పనుల నేపథ్యంలో ఆయా మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని, నగర అభివృద్ధికి ఉద్దేశించిన ఈ పనుల సమయంలో వాహనదారులు, ప్రజలు అధికారులకు సహకరించాలని సిపి సజ్జనర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జాయింట్ సిపి(ట్రాఫిక్) డి.జోయల్ డెవిస్, జాయింట్ సిపి(స్పెషల్ బ్రాంచ్) ఎస్ఎం. విజయ్‌కుమార్, డిసిపి (ట్రాఫిక్) కాజల్, జూబ్లీహిల్స్ డిసిపి రమణారెడ్డి, జిహెచ్‌ఎంసి ఉన్నతాధికారులతో పాటు మెగా ఇంజినీరింగ్ సంస్థ ప్రతినిధులు రాంబాబు (ఇంజినీర్), సుధాకర్ (ప్రాజెక్టు మేనేజర్) తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫస్టియర్ ఇంగ్లీష్‌కు 1798 మంది గైర్హాజరు

**ప్రజాపక్షం/సిటీ బ్యూరో :** హైదరాబాద్ జిల్లాలో శుక్రవారం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు 1798 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 217 'పరీక్షా కేంద్రాల్లో శుక్రవారం నాటి పరీక్షకు మొత్తం 85627మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 83829 మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ ఇంగ్లీష్ పరీక్షకు 80,414 మంది, వొకేషనల్ పరీక్షకు 3415 మంది హాజరయ్యారు. జనరల్‌లో 1063 మంది, వొకేషనల్‌లో 735మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

## సిసి రోడ్డుపనులు పూర్తిచేయాలి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** నిలిచిన సిసి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తాజా, మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కోరారు. శుక్రవారం డివిజన్‌లోని ఎస్‌కేడి నగర్, హరిహరపురం, సామానగర్ కాలనీలో జరుగుతున్న సిసి రోడ్డు పనులను కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీల అధ్యక్షులు శంకరయ్య గౌడ్, అమరేందర్‌రెడ్డి, జానయ్య గౌడ్, పార్టీ నాయకులు విష్ణువర్ధన్ రావు, రవిశంకర్, మహేందర్‌రెడ్డి, కాలనీ వాసులు శ్రీధర్ రావు, కృష్ణారావు, సతీష్‌చారి, రమేష్‌బాబు, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.

## తహసీల్దార్ రవీందర్‌రెడ్డికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉత్తర్వులు



**ప్రజాపక్షం/కొత్తూరు:** తహసీల్దార్ రవీందర్‌రెడ్డి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ కుడా (కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా రవీందర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. దాంతో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆర్డర్ కాఫీని తహసీల్దార్‌కు అందించారు. తహసీల్దార్ రవీందర్ రెడ్డికి పదోన్నతి రావడం అభినందనీయమని పలువురు తెలిపారు.

## ఆలయాల అభివృద్ధికి సహకారం



**ప్రజాపక్షం/కేశంపేట :** నియోజకవర్గం ఆలయాల అభివృద్ధికి సహకారం అందిస్తానని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తెలిపారు. శుక్రవారం కేశంపేట మండల పరిధిలోని భైర్‌ఖాన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గుండు పందెం పోటీలను ప్రారంభించారు. కొండారెడ్డిపల్లి, పోమాల్‌పల్లి గ్రామాల శివారులో ఉన్న శివాలయం పునప్రతిష్ట పూజలో అంజయ్య యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈట గణేష్, మురళీధర్‌రెడ్డి, లక్ష్మీ నారాయణ గౌడ్, సర్పంచ్ శమంత శివకుమార్,నాయకులు యాదగిరిరావు, వెంకటయ్య, కృష్ణయ్య, శ్రీనివాస్, నాయకులు ద్రోణాచారి, బాబు, యాదగిరి, సురేష్, జమాల్‌ఖాన్, సలీం తదితరులు పాల్గొన్నారు.

## డిజటల్ మోసాలపై అప్రమత్తత : సిఐ




**ప్రజాపక్షం/యాచారం :** డిజిటల్, సైబర్ మోసాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని యాచారం సిఐ నందిశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ మస్కు అనిత శరణం అధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం సహకారంతో అవగాహణ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ప్రదీప్, సాజీద్, శ్రీనాథ్, రెడ్డి లక్ష్మి , పాషా, యాదయ్య, అంజయ్య, కౌన్సిలర్ వై.వెంకటేశ్, బర్ల మల్లేశ్‌యాదవ్,ఎస్‌కె రఫియా పాల్గొన్నారు.

## ఆత్మవిశ్వాసంతోనే ఆర్థికాభివృద్ధి




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని డాక్టర్ రెడ్డి ఫౌండేషన్ టెర్రిటరీ మేనేజర్లు సాయితేజ, సంతోష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మండల మహిళా సమాఖ్య భవనంలో ఐదు మండలాలకు చెందిన దివ్యాంగులకు స్వయం డాక్టర్ రెడ్డి ఫౌండేషన్ హైద్రాబాద్ ఆధ్వర్యంలో ఉపాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఇపి టీమ్ నాగేష్, డాక్టర్ రెడ్డి ఫౌండేషన్ క్లస్టర్ కోఆర్డినేటర్లు నరేష్, భానుకుమార్, ఎపిఎం భగవంతు, సిసిలు విజయ, సరళ, రామచంద్రయ్య, మల్లేష్, యాదయ్య, కృష్ణ, శివకుమార్, ఆడిటర్ యాదగిరి, అకౌంటెంట్ ప్రభావతి, మంగలు పాల్గొన్నారు.

## హెల్మెట్‌దారణ తప్పనిసరి



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** ప్రతి బైక్ వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చేవెళ్ల ఎసిపి కిషన్ సూచించారు. శుక్రవారం మోకిలా గ్రామంలో వాహనదారులకు రెండవ దఫా ఎరైవ్ ఎలైవ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసిపి మాట్లాడుతూ వాహనదారులు తగు జాగ్రత్తగా తమ వాహనాలను రోడ్లపై నడపాలని సూచించారు. అతివేగం ప్రాణాలకు ముప్పు కలిగిస్తుందని చెప్పారు. ట్రాఫిక్ రూల్స్ ప్రతి వాహనదారుడు పాటించాలన్నారు. కార్యక్రమంలో మోకిలా సిఐ వీరబాబు, ఎస్ఐ కోటేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు విమర్శించే హక్కు లేదు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు తనను వ్యక్తిగతంగా విమర్శించే నైతికత లేదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్ విషయంలో తాను రాష్ట్ర ప్రభుత్వానికి అడ్డుపడుతున్నానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనపై బురద జల్లడం మానుకోవాలని సూచించారు. కేంద్రప్రభుత్వ సహకారంతో రూ.వేల కోట్ల నిధులతో చేపట్టే అభివృద్ధి పనులను తెలంగాణలో చేస్తున్నామని.. త్వరలోనే అభివృద్ధి పనుల జాబితాకు సంబంధించి పిపిటి ఇస్తానని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సహకరిస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలు అర్థరహితంగా ఉన్నాయన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారం పేరిట శుక్రవారం వారాసిగూడ, మెట్టుగూడ, బౌద్ధనగర్ ప్రాంతాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ప్రధానంగా రహదారులు, డ్రైనేజీతో పాటు రెండు పడక గదుల కేటాయింపులు జరగకపోవడం, పెన్షన్ల కోసం పడుతున్న ఇబ్బందులు తదితర అంశాలు తన దృష్టికి వచ్చినట్లు మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ నగరంలో మౌలిక వసతులు కూడా సరిగా లేని దుస్థితికి గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని విమర్శించారు. గ్రేటర్ హైదరాబాద్ మేయర్‌ను మజ్లీస్‌కు అమ్ముకోవాలని కాంగ్రెస్ చూస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు భరత్‌గౌడ్, మేకల సారంగపాణి, బండ కార్తికరెడ్డి, కనకట్ల హరి, నాగేశ్వర్‌రెడ్డి, ప్రభుగుప్త, అజయ్ నాయుడు, రాజేష్ నాయర్ తదితరులు పాల్గొన్నారు.

# మనల్ని అందరూ వాడుకుంటారు

ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఆవేదన



**ప్రజాపక్షం/చార్మినార్:** మనల్ని అందరూ వాడుకుంటారు.. మనకు ఏమీ చేయరు. అన్నీ చేస్తామంటూ ఆశలు చూపిస్తారు. గట్టెక్కిన అనంతరం మరిచిపోతారు. మన వద్దకు వచ్చేసరికి కాంగ్రెస్, బిజెపి దోస్తులే.. వారిద్దరూ ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారు. ఇది మీరంతా గుర్తించాలి. మనకు ఎవరూ కారు. మీరు మా వెంట ఉండండి.. మీకోసం మజ్లీస్ పనిచేస్తుందని... ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ అన్నారు. గురువారం రాత్రి ఫాతీమా కాలేజీలో ఫాతీమా ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న అక్బరుద్దీన్ మాట్లాడుతూ... యూపీలో యోగి.. తెలంగాణలో రేవంత్‌రెడ్డి మజీదులు, దర్గాలు కూల్చేస్తున్నారు...ఆస్తులను కొల్లగొడుతున్నారు అంటూ మండిపడ్డారు. ముస్లింలంటే ద్వేషం ఉన్నందున మనల్ని టార్గెట్ చేస్తున్నారు.. కాబట్టి మనం అందరం ఒకటిగా ఉంటేనే మన ప్రగతి నిలుస్తుందన్నారు. మిమ్మల్ని కేవలం మజ్లిస్ మాత్రమే కాపాడగలదన్నారు. అక్బరుద్దీన్ ఓవైసీ బతికున్నంత వరకు, ఏ మోదీ అయినా భయపడడు.. ఏ గాంధీ అయినా భయపడడు.. ఏ రెడ్డి అయినా భయపడడు.. ఏ రావు అయినా భయపడడు... అంటూ తేల్చిచెప్పాడు.

# ఆడబిడ్డకు ఆర్థికభారం తగ్గించేందుకే కల్యాణలక్ష్మి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/కొత్తూరు:** పేదింటి ఆడబిడ్డకు ఆర్థికభారం తగ్గించేందుకే కల్యాణలక్ష్మి , షాది ముబారక్ రూపంలో ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తున్నారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. శుక్రవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో లబ్దిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కళ్యాణ లక్ష్మి , షాది ముబారక్ చెక్కులను ప్రతిష్టాత్మకంగా లబ్దిదారులకు అంధించడం జరుగుతుందని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులైన లబ్దిదారులకు సద్వినియోగం చేసుకొని అభివృద్దిలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్‌తోపాటు వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

### లబ్దిదారులతో గృహప్రవేశం చేయించిన ఎమ్మెల్యే...

**కొందుర్గు:** నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ లబ్దిదారులతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గృహప్రవేశం చేయించారు. శుక్రవారం కొందుర్గు మండల పరిధిలోని బైరంపల్లి గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం చేయించి లబ్దిదారులకు నూతన వస్రాలను అంధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామన్నారు. అనంతరం రామచంద్రాపూర్ చౌరస్తా నుండి రేగడి చిల్కమర్రి గ్రామం వరకు ఉన్న పది బ్రిడ్జిలకు శంకుస్థాపన చేశారు. బ్రిడ్జిల నిర్మాణాల్లో వేగం పెంచామని, గ్రామంలో 22మందికి ఇండ్లు వచ్చాయని, ఇవే కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తామని తెలిపారు. ఇప్పటికే 120రేషన్ కార్డులు సైతం ఇచ్చామని, హెచ్‌ఎండిఏ నిధులతో హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు శంకుస్థాపన చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, నేతలు పురుషోత్తంరెడ్డి, జితేందర్ రెడ్డి, బైరంపల్లి సర్పంచ్ యాదమ్మ, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల నరసింహ, పంచాయతీ కార్యదర్శి జి.నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజన్ల సంక్షేమనికి కట్టుబడి ఉంటా

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**ప్రజాపక్షం/హయత్‌నగర్:** సీనియర్ సిటిజన్ల సంక్షేమం, భద్రత, ఆర్థిక భరోసా కోసం ప్రభుత్వంతో మాట్లాడి న్యాయం జరిగేలా చేస్తానని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. చైతన్యపురి డివిజన్ పరిధిలోని ద్వారకాపురం సీనియర్ సిటిజన్స్ సేవాసమితి సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు.సీనియర్ సిటిజన్ భవనం రోడ్డు పక్కన ఉండడం వల్ల ప్రతిరోజూ వాహనాల పొగ కాలుష్యం, సౌండ్స్ వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాని సీనియర్ సిటిజన్స్ సేవాసమితి సభ్యులు తెలిపారు. కాలనీలలో నూతన సిసి.కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికి అందేలా చూడమని కోరారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ రెండు, మూడు రోజుల్లో సీనియర్ సిటిజన్ కార్యాలయానికి వచ్చి సమస్యలకు పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. సీనియర్ సిటిజన్ల సంక్షేమం, భద్రత, ఆర్థిక స్వాతంత్ర్యం కోసం ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు వివిధ సేవలను, పథకాలను అందిస్తున్నాయి అని అన్నారు. 60 ఏళ్లు పైబడిన వారికి ఆరోగ్య పరీక్షలు,పెన్షన్లు, రైల్వే, బస్సు రాయితీలు 65 పైబడిన వయస్సు వారికి ప్రత్యేక సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ యువ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, ద్వారాకపురం సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు కె.ఏ.ప్రసాద్, ఉపాధ్యక్షులు రాఘవరెడ్డి, శ్రావణ్, సుబ్బారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సామాన్య ప్రజల ఆరోగ్య సేవలకు 100 డేస్ కార్యక్రమం : డిఎంహెచ్ఒ



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సామాన్య ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మార్చి రెండు నుండి జూన్ 9 వరకు 100 డేస్ ఆరోగ్య సేవల ప్రత్యేక కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని డిఎంహెచ్ఒ డాక్టర్ కె.లలితాదేవి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు మరింత సమగ్ర, నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేందుకు వందరోజుల ఆరోగ్య కార్యక్రమాన్ని మూడు దశలలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మొదటి దశ మార్చి 4 నుండి 31 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. స్పెషలిస్ట్ వైద్యులు నిర్ణయించిన తేదీలలో క్యాంపులు ఏర్పాటు చేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పరీక్షిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యాధికారులు డాక్టర్ గీతా, రాధిక, పాపారావు, లక్ష్మీప్రసన్న, ప్రోగ్రాం అధికారులు శిభా హయత్, డెమో శ్రీనివాసులు పాల్గొన్నారు.

# పంచాయతీల సమగ్రాభివృద్ధి సర్పంచ్‌లతోనే సాధ్యం

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి సర్పంచ్‌లతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ముచ్చింతల్ స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సర్పంచ్‌లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి పాల్గొని సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల్లో పారిశుద్ధ్యం, మురుగు కాలువల శుభ్రత, మౌలిక సౌకర్యాల కల్పన, ప్రజలకు తగిన వసతులు కల్పించడం వంటి వాటిపై దృష్టి కేంద్రీకరించాలని కోరారు. ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులను పంచాయతీల అభివృద్ధికి సమర్థవంతంగా వినియోగిస్తే అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సర్పంచ్‌లుగా విజయం సాధించడం ముఖ్యం కాదు..ప్రజల మన్ననలు పొందినప్పుడు నిజమైన గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు.

**కేశంపేట :** పరమశివుడి అశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. కేశంపేట మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామంలో ఉన్న శివాలయంలో ధ్వజస్థంభ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి పల్లె నర్సింగ్‌రావు, సర్పంచ్ స్వప్న భూపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీశైలం ముదిరాజ్, దేవాలయ చైర్మన్ సత్యనారాయణ, దస్తగిరి, అమరేందర్, ప్రేమ్, జగన్మోహన్‌రెడ్డి, మల్లేష్, జంగయ్య, వరలక్ష్మి , రోశయ్య, అనిత, కృష్ణయ్య పాల్గొన్నారు.

# ఆత్మవిశ్వాసంతో మెరుగైన ఫలితాలు

నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్ పొంగూరు రమానారాయణ

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్‌తో విద్యార్థుల ప్రదర్శన నైపుణ్యాలు (ప్రెసెంటేషన్ స్కిల్స్), కమ్యూనికేషన్ నైపుణ్యాలతో పాటు ఆత్మవిశ్వాసం పెరిగి మెరుగైన ఫలితాలు వస్తాయని నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్ పొంగూరు రమానారాయణ, జిఎం గోపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ జివిఎల్ లక్ష్మి శారద అన్నారు. శుక్రవారం హస్తినాపురం నారాయణ పాఠశాలలో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్(ఎస్ఎల్‌సి) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ (ఎస్ఎల్ సి )అనేది సాంప్రదాయ పేరెంట్ టీచర్ మీటింగ్‌లకు భిన్నంగా, విద్యార్థులే తమ అభ్యాస ప్రక్రియను (లెర్నింగ్‌జర్నీ) తల్లిదండ్రులకు వివరించే కార్యక్రమం అని, ఇందులో విద్యార్థులు తమ పోర్ట్‌ఫోలియో, ప్రాజెక్టులు, ప్రగతిని ప్రదర్శిస్తూ, తాము నేర్చుకున్న అంశాలను, ఎదుర్కొన్న సవాళ్లను స్వయంగా వివరిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ విద్యా ప్రగతి, ప్రాజెక్టులు, నేర్చుకున్న వివిధ అంశాలపై తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు స్వయంగా వివరించారు. విద్యార్థులు ధైర్యంగా మాట్లాడి తమ ప్రతిభను ప్రదర్శించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రదర్శన చూసి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పొంగూరు రమా నారాయణ ఆన్లైన్లో వీక్షించి విద్యార్థుల తల్లి తండ్రుల తో మాట్లాడి కార్యక్రమం ప్రముఖ్య ఉదేశ్యం వివరించారు.విద్యార్థుల ప్రతిభకు శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో నారాయణ సంస్థల జిఎం గోపాల్ రెడ్డి,దిల్సుక్ నగర్ డివిజన్ ఎజిఎం హేమంబర్ , ఆర్ ఐ రవి ప్రసాద్,ఈ చాంప్స్ ఆర్ అండ్ డిహెడ్ మహేశ్వరి, కోర్డినేటర్ గాయత్రి,ప్రిన్సిపాల్ జివిఎల్ లక్ష్మి శారద,ఈ చాంప్స్ వైస్ ప్రిన్సిపల్ విజయ లక్ష్మి,ఎఒ లు రాజేష్, కరుణాకర్,ఉపాధ్యాయ బృందం,తల్లి తండ్రులు,సి బ్బంది పాల్గొన్నారు.






# చిత్తశుద్ధితో పనిచేస్తేనే పదవులు సాధ్యం



కాంగ్రెస్ క్రమ శిక్షణ కమిటీ చైర్మన్, ఎంపి డాక్టర్ మల్లురవి

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** చిత్తశుద్ధితో పనిచేస్తేనే భవిష్యత్‌లో ఉన్నతమైన పదవులు లభించేందుకు ఆస్కారం ఉంటుందని కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మెన్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లురవి అన్నారు. శుక్రవారం షాద్‌నగర్ క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్‌తోపాటు కౌన్సిలర్లు మురళీమోహన్, రాజునాయక్, దిలీప్‌లను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ శ్రేణులు చిత్తశుద్ధితో పని చేయడంతోపాటు ప్రజా ఆశీర్వాదం పొందాలని, అప్పుడే ఆనాయకుడికి బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువస్తుందని వివరించారు. అర్హులైన పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చడంతోపాటు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని తెలిపారు. నిరంతరం నేతలు ప్రజలందరికి అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని, అప్పుడే నాయకులకు ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందని వివరించారు. షాద్‌నగర్ మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషి ఎంతో ఉందని, వారి అడుగు జాడల్లో పయణించేందుకు కృషి చేయాలని సూచించారు. పార్టీకి ఎంతో నమ్మకంగా పనిచేయడం వల్లే నేడు ఎమ్మెల్యేగా రాణించారని, వారికి ఆదర్శంగా తీసుకొని శ్రేణులు సైతం భవిష్యత్‌లో ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను ఇంటింటికి తీసుకువెళ్ళేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని అన్నారు. కార్యక్రమంలో చైర్మన్ బెల్లయ్య నాయక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, మండల పార్టీల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నేతలు రఘునాయక్, ముబారక్, బాల్‌రాజ్ గౌడ్, జంగ నరసింహ, రవికుమార్ గుప్తా, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వన్డే సిరీస్ చేజార్చుకున్న టీమిండియా



ఆస్ట్రేలియా పర్యటనలో భారత జట్టుకు భారీ షాక్. పొట్టి సిరీస్‌ను పట్టేసిన టీమిండియా వన్డే సిరీస్‌ను చేజార్చుకుంది. తొలి వన్డేలో కంగుతిన్న అమ్మాయిలు.. నిర్ణయాత్మక మ్యాచ్‌లో సర్వశక్తులు ఒడ్డలేకపోయారు. ఓపెనర్ ప్రతీకా రావల్(52), హర్మన్‌ప్రీత్ కౌర్(54)లు కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడినా.. 252 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ అలవోకగా ఛేధించింది. జార్జియా వోల్ (101) సెంచరీతో, ఫొబె లిచ్ఫీల్డ్(80) హాఫ్ సెంచరీతో విజృంభించగా.. మరో మ్యాచ్ ఉండగానే ఆతిథ్య జట్టు సిరీస్‌ను గెలుపొందింది. విశ్వ విజేతగా తొలి విదేశీ పర్యటనలోనే భారత జట్టు వన్డే సిరీస్ చేజార్చుకుంది. నిరుడు వన్డే వరల్డ్‌కప్ సెమీఫైనల్లో ఆస్ట్రేలియాను ఓడించిన టీమిండియా.. ఈసారి మాత్రం తలొగ్గింది. వరుసగా రెండు మ్యాచుల్లో ఓటమితో సిరీస్‌ను కోల్పోయింది. నిర్ణయాత్మక రెండో వన్డేలో 251 రన్స్‌కే పరిమితమైన హర్మన్‌ప్రీత్ సేన ప్రత్యర్థిని కట్టడి చేయలేకపోయింది. ఆరంభంలోనే అలీసా హీలీ(6)ని కష్వీ గౌతమ్(247) బౌల్ చేసి బ్రేకిచ్చినా.. ఫొబె లిచ్ఫీల్డ్(80), జార్జియా వోల్(101)లు క్రీజునంటుకొని భారత బౌలర్లను విసిగించారు. దూకుడుగా ఆడిన వీరిద్దరూ అర్ధ శతకాలతో లక్ష్యాన్ని కరిగించారు. లిచ్ఫీల్ ఔటైనా.. జోరు తగ్గించని వోల్ సెంచరీతో విరుచుకుపడింది. కష్వీ గౌతమ్ ఓవర్లో వోల్ వెనుదిరిగినా.. బెత్ మూనీ(31).. అష్లీ గార్డ్నర్(19 నాటౌట్)లు లాంఛనం పూర్తి చేశారు. నామమాత్రమైన మూడో వన్డే మార్చి1 న హోబర్ట్‌లో జరుగనుంది.

## ఉత్కంఠ పోరులో
## కంగుతిన్న న్యూజిలాండ్


పాకిస్థాన్ సెమీస్ ఆశలు సజీవం!



సెమీస్ బెర్తు దక్కాలంటే గెలవక తప్పని మ్యాచ్‌లో న్యూజిలాండ్‌కు గుండెకోత మిగిలింది. ఆఖరి ఓవర్ వరకూ ఉత్కంఠ రేపిన మ్యాచ్‌ను విల్ జాక్స్(32 నాటౌట్) రెహాన్ అహ్మద్(19 నాటౌట్)లు సంచలన ఆటతో ఇంగ్లాండ్ వైపు తిప్పారు. ప్రధాన బ్యాటర్లను ఔట్ చేసి గెలుపుపై ధీమాతో ఉన్న కివీస్‌కు షాకిస్తూ ఈ ద్వయం.. రెండు ఓవర్లలోనే 38 రన్స్ రాబట్టి బ్లాక్ క్యాప్స్ సెమీస్ చేరకుండా అడ్డుపడ్డారు. తద్వారా పాకిస్థాన్‌కు కూడా తలుపులు తెరిచే ఉన్నాయి. పొట్టి ప్రపంచకప్ సూపర్ 8 దశను ఇంగ్లాండ్ అజేయంగా ముగించింది. శ్రీలంక, పాకిస్థాన్‌ను చిత్తు చేసి సెమీస్ బెర్తు పట్టేసిన ఇంగ్లాండ్ చివరి మ్యాచ్‌లోనూ న్యూజిలాండ్‌కు పంచ్ ఇచ్చింది. ప్రేమదాస మైదానంలో ఉత్కంఠ రేపిన పోరులో హ్యారీ బ్రూక్ సేన జయభేరి మోగించింది. గ్లెన్ ఫిలిప్స్ వేసిన 18వ ఓవర్లో విల్ జాక్స్(32 నాటౌట్), రెహాన్ అహ్మద్(19 నాటౌట్)లు 22 రన్స్ రాబట్టి మ్యాచ్ను కివీస్ నుంచి లాగేసుకున్నారు. 4 వికెట్ల తేడాతో గెలుపొందిన ఇంగ్లండ్ గ్రూప్ బీలో రెండో సెమీస్ బెర్తు రేసును ఆసక్తికరంగా మార్చేసింది.

## సైన్స్

## ఒకే సమయం.. రెండు ప్రదేశాలు..




మనము ఒకే సమయంలో రెండు ప్రదేశాలు లేదా ప్రాంతాల్లో ఎందుకు కనిపించం? ఒక వస్తువు భౌతికంగా ఒక దగ్గర ఉంటే, మరో చోట సాక్షాత్కరించడం అసాధ్యం. ఇదే 'డీకోహీరెన్స్' అనే క్వాంటం భౌతికశాస్త్ర సిద్ధాంతం. క్వాంటం మెకానిక్స్ ప్రకారం ప్రతి కణాన్ని దాని తరంగ విధానం ద్వారా వివరించవచ్చు. ఈ తరంగ ఫంక్షన్ ఒక కణం ఒకేసారి అనేక స్థితుల్లో ఉండగలదని సూచిస్తుంది. దీనినే సూపర్ పొజిషన్ అంటారు. ఉపపరమాణు కణాలు, ఉదాహరణకు ఎలక్ట్రాన్లు, ఫోటాన్లు, ఒకేసారి రెండు మార్గాల్లో ప్రయాణించగలవు, లేదా రెండు స్థానాల్లో ఉండగలవు. అయితే మనం రోజువారీ జీవితంలో అలాంటి దృశ్యాలను చూడలేము. దీనికి కారణంగా డీకోహెరెన్స్‌ను పేర్కొంటారు. మన చుట్టూ ఉన్న ప్రతి వస్తువు నిరంతరం ఇతర వస్తువులతో పరస్పర చర్యలో నిమగ్నమై ఉంటుంది. మన శరీరం ప్రతి క్షణం లక్షల కోట్ల ఫోటాన్లతో, గాలి అణువులతో, గురుత్వాకర్షణ క్షేత్రంతో, ఇంకా విశ్వం నిండి ఉన్న కాస్మిక్ మైక్రోవేవ్ బ్యాక్‌గ్రౌండ్ కిరణాలతో పరస్పర చర్యలకు లోనవుతుంది. ఈ పరస్పర చర్యలన్నీ ఒక కొలత మాదిరి పనిచేస్తాయి. క్వాంటం స్థాయిలో కొలత అంటే కచ్చితంగా మనిషి చూడటం కాదు. ఏదైనా కణం ఇతర కణంతో పరస్పర చర్యలోకి వస్తే, అది ఇప్పటికే ఒక నిర్దిష్ట స్థితిని ఎంచుకోవాల్సి వస్తుంది. ఈ ప్రక్రియ వల్ల తరంగఫంక్షన్‌లోని సూపర్‌పోజిషన్ స్థితులు వేగంగా చెదిరిపోతాయి. దీనినే డీకోహెరెన్స్ అంటారు. అంటే, అనేక సంభావ్యతలు ఉన్న స్థితి ఒక నిర్దిష్ట స్థితిగా మారుతుంది. ఉపపరమాణు ప్రపంచం వింతగా అనిపించడానికి కారణం ఏమిటంటే, ఆ కణాలు చాలా చిన్నవి. కొన్ని సందర్భాల్లో అవి బాహ్య ప్రపంచంతో పరస్పర చర్యలు తక్కువగా ఉంటాయి. అందువల్ల అవి కొద్దిసేపు సూపర్‌పోజిషన్ స్థితిని నిలుపుకోగలవు. ఉదాహరణకు, ప్రయోగశాలల్లో శూన్యానికి సమీప ఉష్ణోగ్రతలు, అధిక వాక్యూం వంటి పరిస్థితుల్లో ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. కానీ భారీ వస్తువులు (మనుషులను కూడా ఇందులో కలుపుకోవచ్చు) కోట్ల కోట్ల అణువులతో కూడి ఉంటాయి. వాటిలో ఏ చిన్న భాగం కూడా బయట ప్రపంచంతో పరస్పర చర్యలో పడితే, మొత్తం వ్యవస్థ డీకోహెరెన్స్‌కు లోనవుతుంది. అందువల్ల మనం ఒకేసారి రెండు చోట్ల కనిపించడం అసాధ్యం అవుతుంది. అంటే, మనం రెండు చోట్ల మెరుస్తూ కనిపించకపోవడానికి కారణం ప్రకృతి మనపై నిరంతరం జరిపే కొలతలే. ఉపపరమాణు ప్రపంచం వింతగా అనిపించడమే కానీ, అది కూడా అదే నియమాల ప్రకారం పనిచేస్తుంది. కాకపోతే, అక్కడ డీకోహీరెన్స్ ఆలస్యంగా జరుగుతుంది. అంతే.

## మెదడులో నొప్పి భరించే ప్రాంతాలు..



నొప్పిని భరించడం.. బాధను బయటకు రాకుండా అణచుకోవడం అనేది అనుకున్నంత సులభం కాదు. నొప్పి లేదా మాధ లేదా మరే ఇతర స్పందనలైనా మెదడే గుర్తిస్తుంది. చెప్తుంది. కొంత మంది ఎంత నొప్పినైనా భరిస్తారు. అయితే, నొప్పిని భరించడమం టే మానసిక బలం పెరగడంగా భావించడం శాస్త్రీయంగా సరైంది కాదు. ప్రభా వం ప్రధానంగా ఉద్దేశ్యపూర్వక నియంత్రిత ప్రయత్నం, పునరావృత స్వీయ నియంత్రణ వల్ల ఉద్భవిస్తుంది. ఫంక్షనల్ ఎమ్ఆర్ఐ అధ్యయనాలు 'యంటీరియర్ మిడ్‌సిగ్యులేట్ కోర్టెక్స్' (ఎఎమ్‌సిసి అనే మెదడు ప్రాంతం ప్రయత్నాధారిత నిర్ణయాలు, పట్టుదల, అసౌకర్యాన్ని భరించే సామర్థ్యంతో సంబంధం కలిగి ఉందని సూచిస్తున్నాయి. వ్యక్తి తక్షణ ప్రలోభాన్ని నిరాకరించి దీర్ఘ కాల ప్రయోజనాన్ని ఎంచుకున్నప్పుడు, లేదా శారీరకమానసిక అసౌకర్యాన్ని చైతన్యపూర్వకంగా భరించినప్పుడు ఈ ప్రాంతం చురుకుగా పనిచేస్తుంది. పునరావృతంగా ఇలాంటి నియంత్రిత సవాళ్లను స్వీకరించడం ద్వారా ఈ నాడీజాలం కార్యదక్షత, అనుసంధాన సామర్థ్యం పెరగవచ్చని కొన్ని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే విల్ పవర్ ఒకే కేంద్రంలో ఉండే గుణం కాదు. ఇది ప్రధానంగా ప్రణాళిక, నిర్ణయ నియంత్రణ, బహుమతిప్రేరణ వంటి ప్రీఫ్రంటల్ కోర్టెక్స్ వ్యవస్థల మధ్య సమన్వయంపై ఆధారపడుతుంది. 'స్ట్రియాటమ్' వంటి లోతైన నిర్మాణాలు ప్రేరణ, బహుమతి అంచనా ప్రక్రియలతో సంబంధం కలిగి ఉంటాయి. అర్థవంతమైన లక్ష్యం, స్వచ్ఛంద నిర్ణయం, నిర్వహణయోగ్య ఒత్తిడి ఉన్నప్పుడే మెదడు అనుకూల మార్పులు చూపుతుంది.

## శూన్యం నుంచి పదార్థం సాధ్యమా?



యూరోపియన్ అణు పరిశోధనా సంస్థ 'సెర్న్' నిర్వహిస్తున్న 'లార్జ్ హాడ్రాన్ కొలైడర్' ప్రపంచంలోనే అతిపెద్ద కణవేగవంతక యంత్రం. ఇది ప్రోటాన్లను అత్యంత అధిక శక్తి స్థాయికి వేగవంతం చేసి ఢీకొట్టిస్తుంది. తద్వారా పుట్టే కణాలను విశ్లేషించడం ద్వారా ప్రకృతికి సంబంధించిన ప్రాథమిక నియమాలను పరీక్షిస్తారు. ఇది ఖాళీ నుంచి పదార్థాన్ని సృష్టించడం కాదు.. ఇప్పటికే ఉన్న క్వాంటం క్షేత్రాలను అత్యధిక శక్తి పరిస్థితుల్లో పరిశీలించడం. క్వాంటం ఫీల్డ్ సిద్ధాంతం ప్రకారం ఖాళీ స్థలం పూర్తిగా శూన్యం కాదు. విశ్వమంతా క్షేత్రాలతో నిండి ఉంటుంది. ప్రతి మూలక కణానికి అనుబంధ క్షేత్రం ఉంటుంది. ఈ క్షేత్రాల కనిష్ఠ శక్తి స్థితిని క్వాంటం వ్యాక్యూమ్ అంటారు. ఇందులో జీరో పాయింట్ ఎనర్జీ ఉంటుంది. హైజెన్‌బర్గ్ అనిశ్చితి సూత్రం వల్ల అతి చిన్న కాల పరిమితుల్లో శక్తి మార్పులు సంభవించవచ్చు. ఈ సందర్భంలో వర్చువల్ కణప్రతికణ జంటల భావన గణితపరంగా ఉద్భవిస్తుంది. వాటి ప్రభావాలు కాసిమిర్ ఎఫెక్ట్, లాంబ్ షిఫ్ట్ వంటి పరిణామాల్లో కనిపిస్తాయి. అయితే దీనిని పూర్తిగా 'ఏమీ లేకుండా పదార్థం పుట్టింది' అనే అర్థంలో తీసుకోకూడదు. మొత్తం వ్యవస్థలో శక్తి పరిరక్షణ సూత్రం భంగం చెందదని గుర్తించాలి. అధిక శక్తి కణ ఢీకొనడం వల్ల ఇప్పటివరకు ఏ సంరక్షణ నియమం కూడా చెక్కుచెదర లేదు. తెలిసిన క్షేత్రాలు, నియమాల పరిధిలోనే కణ ఉద్భవం జరుగుతుందని ఆధునిక కణ భౌతికశాస్త్రం చెప్తుంది. 'మ్యాటర్ ఫ్రమ్ నథింగ్' అనే పదప్రయోగం ప్రధానంగా సరళీకరణ మాత్రమే. దీనిని శూన్యం నుంచి పదార్థం అనే కోణంలో తీసుకోవడానికి వీల్లేదు.

## క్రికెటర్ రింకూసింగ్ తండ్రి కన్నుమూత



భారత క్రికెట్ జట్టులో కీలక ఆటగాడిగా ఉన్న యువ బ్యాటర్ రింకూ సింగ్ కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆయన తండ్రి ఖంచంద్ర సింగ్ (ఖాంచంద్ర సింగ్) లివర్ క్యాన్సర్‌తో చికిత్స పొందుతూ కన్నుమూశారు. గ్రేటర్ నోయిడాలోని యథార్థ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఖంచంద్ర సింగ్ గత కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసిందే. స్టేజ్–4 లివర్ క్యాన్సర్ కారణంగా ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబ సభ్యులు కొద్ది రోజుల కిందట ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు ఆయనను వెంటిలేటర్ సపోర్ట్‌తో ఉంచి చికిత్స అందించారు. పరిస్థితి మరింత విషమించడంతో రీనల్ రీప్లేస్మెంట్ థెరపీ కూడా నిర్వహించినట్టు సమాచారం. అయినప్పటికీ వైద్యుల ప్రయత్నాలు ఫలించలేదు.

ఇదే సమయంలో ఐసిసిమెన్స్ టి–20 వరల్ కప్ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న రింకూ సింగ్‌కు తండ్రి ఆరోగ్యం విషమించిందన్న సమాచారం అందింది. వెంటనే జట్టును వదిలి హుటాహుటిన ఇంటికి చేరుకున్నాడు. కుటుంబంతో కలిసి రెండు రోజులపాటు ఆసుపత్రిలో గడిపిన అనంతరం, జింబాబ్వేతో జరిగే మ్యాచ్‌కు ముందు మళ్లీ జట్టుతో చేరాడు. చెన్నైలోని ఎంఎ చిదంబరం స్టేడియంలో జరిగిన ప్రాక్టీస్ సెషన్‌కు రింకూ హాజరుకాలేదు. మిగిలిన ఆటగాళ్లు సాధనలో పాల్గొనగా, కుటుంబ పరిస్థితుల కారణంగా ఆయన దూరంగా ఉన్నాడు. జింబాబ్వేతో కీలక మ్యాచ్‌కు ముందు జట్టులో చేరినప్పటికీ, ఆ మ్యాచ్‌లో రింకూ సింగ్‌కు అవకాశం దక్కలేదు. కుటుంబ పరిస్థితులు, భావోద్వేగ పరిస్థితుల నడుమ జట్టుతో కొనసాగడం ఆయనకు సవాల్‌గా మారింది. గత రాత్రి జరిగిన మ్యాచ్‌లో రింకూ అభిషేక్ స్థానంలో ఫీల్డింగ్ చేసి ఓ క్యాచ్ జారవిడవడం మనం చూశాం. అయితే తాజాగా తన తండ్రి మరణవార్త అందుకున్న వెంటనే రింకూ సింగ్ స్వస్థలం ఉత్తరప్రదేశ్లోని అలీగగ్‌కు బయలుదేరాడు. 28 ఏళ్ల రింకూ సాధారణ కుటుంబం నుంచి ఎదిగి భారత జట్టులో స్థానం సంపాదించిన క్రమంలో, తన తండ్రి పాత్ర ఎంతో కీలకమని పలుమార్లు చెప్పుకున్నాడు. కుటుంబానికి అండగా నిలిచిన తండ్రి కోల్పోవడం రింకూకు వ్యక్తిగతంగా పెద్ద లోటు. ఈ కష్ట సమయంలో అభిమానులు, సహచర క్రికెటర్లు ఆయనకు సానుభూతి తెలిపారు.

## వివాదస్పద పాఠ్యాంశం తొలగింపు
## ప్రజాస్వామ్య విజయం

ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వివాదస్పద పాఠ్యాంశం తొలగిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం న్యాయ వ్యవస్థతో పాటు ప్రజాస్వామ్య విజయమని ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ తెలిపారు. శుక్రవారం గిరిప్రసాద్ భవన్‌లో ఎఐఎస్ఎఫ్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ వ్యవస్థ ప్రతిష్టను దెబ్బతీసేవిధంగా నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ ట్రైనింగ్ (ఎన్‌సిఆర్‌టి) ఎనిమిదవ తరగతి సోషల్ సబ్జెక్టులో న్యాయవ్యవస్థ మూలాలను దెబ్బతీసేవిధంగా పాఠ్యాంశాలను రూపొందించిందన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి చెప్పడం హర్షణీయమన్నారు. ఇప్పటికే విద్యావిధానంలో మనుధర్మ శాస్త్రాన్ని చొప్పించి శాస్త్రీయ అవగాహనను దెబ్బతీసే విధంగా బిజెపి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. వివాదస్పద పాఠ్యాంశానికి సంబంధించి వ్యతిరేకతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం దానిని తొలగిస్తున్నట్లు ప్రకటించడాన్ని ఎఐఎస్ఎఫ్ స్వాగతిస్తుందన్నారు. సమాజాభివృద్ధికి ఆటంకంగా ఉన్న మనువాద భావజాలాన్ని వ్యాప్తి చేసే చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు మదుపల్లి లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు మనోజ్, ఆకాష్, జిల్లా నాయకులు పవన్, సాయి, గోపి, చైతన్య, రమేష్, నరేందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల ఫీజు దోపిడీని అరికట్టాలి : ఎఐఎస్ఎఫ్ డిమాండ్



**ప్రజాపక్షం/హయత్ నగర్:** ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్ఎఫ్ హయత్ నగర్ మండల సమితి ఆధ్వర్యంలో విద్యాశాఖఅధికారులకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సామిడి వంశివర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బొంగు అరుణ్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్స్ విక్రయిస్తూ.. వాటిని కొనాలని తల్లిదండ్రులను ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. స్కూళ్లలో ఇలాంటి అమ్మకాలను నిషేధిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ, మండలంలో అవి ఏమాత్రం అమలు కాకపోవడం విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. రానున్న విద్యా సంవత్సరానికి ముందే మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో సమగ్ర తనిఖీలు నిర్వహించి, ఫీజు నియంత్రణ నిబంధనలు కఠినంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత విద్యాశాఖదే అని స్పష్టం చేశారు.లేనిపక్షం లో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ మండల ఉపాధ్యక్షులు ఈనపల్లి ఉపేందర్, సంయుక్త కార్యదర్శి జూనోతల భాను ప్రకాష్, బోగడి రవితేజ పాల్గొన్నారు.

# హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయసాధనే లక్ష్యం

ఏప్రిల్ 17,18 తేదీలలో
డిహెచ్‌పిఎస్ రెండో రాష్ట్ర మహాసభలు

డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
మారుపాక అనిల్‌కుమార్



**ప్రజాపక్షం/హనుమకొండ :** రాష్ట్రంలో దళితుల హక్కుల పరిరక్షణ, రాజ్యాంగ విలువల కాపాడటం, సామాజిక న్యాయం సాధన లక్ష్యంగా దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రెండవ రాష్ట్ర మహాసభలను 2026 ఏప్రిల్ 17, 18 తేదీలలో వరంగల్ నగరంలో నిర్వహిస్తున్నట్టు దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ తెలిపారు. డిహెచ్‌పిఎస్ హనుమకొండ, వరంగల్ జిల్లాల సంయుక్త సమావేశం నిమ్మల మనోహర్ అధ్యక్షతన హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రూపుదిద్దుకుందని, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సామాజిక న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, రాజ్యాంగ పునాదులుగా ప్రతిపాదించారని, అయితే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో రాజ్యాంగ సంస్థలు బలహీనపరచబడుతున్నాయనే ఆందోళనలు పెరుగుతున్నాయన్నారు. దళితులపై దాడులు, కులవివక్ష, భూమి సమస్యలు, విద్యా హక్కుల వంటి ఘటనలు రాజ్యాంగ ఆత్మకు విరుద్ధంగా జరుగుతున్నాయన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కేవలం న్యాయపరమైన అంశం కాదన్నారు. అది సామాజిక ఉద్యమం, దళితులపై జరిగే ప్రతి అన్యాయానికి వ్యతిరేకంగా సమిష్టిగా పోరాడటమేనన్నారు. మహాసభల్లో రాజ్యాంగ రక్షణకు రాష్ట్ర స్థాయి కార్యాచరణ ప్రణాళిక రూపొందించబడుతుందన్నారు. సామాజిక న్యాయం అంటే వనరుల సమాన పంపిణీ, విద్య–ఉపాధిలో సమాన భాగస్వామ్యం, గౌరవ ప్రద జీవన హక్కు అని, ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో దళితులపై అగ్రకుల పెత్తందారుల దౌర్జన్యాలు కొనసాగుతూనే ఉన్నాయని, భూమి ఆక్రమణలు, సామాజిక బహిష్కరణలు, అఘాయిత్యాలు చోటుచేసుకుంటున్నాయని, ఈ పరిస్థితుల్లో సామాజిక న్యాయం సాధన కోసం బలమైన సంఘటిత ఉద్యమం అవసరం ఉందన్నారు. ప్రభుత్వాలు దళిత బడ్జెట్ కేటాయింపులు పూర్తి స్థాయిలో ఖర్చు కావడం లేదన్నారు. ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులను ఇతర అవసరాలకు మళ్లించడం ఆపాలన్నారు. విద్య, ఆరోగ్యం, స్వయం ఉపాధి రంగాల్లో ప్రత్యేక పథకాలు సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్య తగ్గుతోందన్నాకు. దాంతో రాజ్యాంగ బద్ధ రిజర్వేషన్ హక్కులు క్రమంగా క్షీణిస్తున్నాయన్నారు. ఈ పరిస్థితిల్లో ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయడం అత్యవసరమన్నారు. పెద్ద కార్పొరేట్ సంస్థలు, పరిశ్రమలు, విద్యా సంస్థల్లో సామాజిక న్యాయం సూత్రం అమలు కావాలన్నారు. దళిత యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి హామీ ప్రోత్సాహం వంటి అంశాల్లో ప్రభుత్వాలు స్పష్టమైన విధానాలు ప్రకటించాలన్నారు. ఏప్రిల్ 17 ,18న వరంగల్ నగరంలో జరిగే డిహెచ్‌పిఎస్ రాష్ట్ర రెండవ మహాసభలకు వ్యాపార, వాణిజ్య రంగాలకు చెందిన ప్రముఖులు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల మల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు మునగాల బిక్షపతి, కొట్టేపాక రవి, రొంటాల దేవా, జన్ను రవి, జాన్ పాల్, బత్తుల సుప్రియ, రత్నం, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

## శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమాలు



ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి
గన్నారపు రమేష్

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించాలని ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ కార్మికలోకానికి పిలుపునిచ్చారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 4వ మహాసభల పోస్టర్లను శుక్రవారం సికెఎం హాస్పటల్‌లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా గన్నారపు రమేష్ మాట్లాడుతూ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 4వ మహాసభలు 28 ఫిబ్రవరి 2026న వరంగల్ జిల్లాలో జరుగనున్నాయని తెలిపారు. మహాసభలను విజయవంతం చేయాలని ప్రభుత్వ హాస్పటల్‌లో పనిచేస్తున్న శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ యాక్టివిటీ ల్యాబ్ కంప్యూటర్ కార్మికులకు ఆయన పిలుపునిచ్చారు. కేంద్రంలోని పాలకులు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభించడంతో మారిన కార్మిక చట్టాల నేపథ్యంలో శ్రమ దోపిడి పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలక వర్గాలు కార్పొరేట్ శక్తుల తొత్తుగా మారాయని అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులు కనుమరుగై మోదీ సర్కార్ కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయన్నారు. ఎన్‌డిఏ పాలనలో కార్మిక హక్కుల హరించబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాల సవరణ పేరుతో యాజమాన్యాల కింద కార్మికులు బానిసలుగా పనిచేయాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. మోదీకి కార్పొరేట్ల రక్షణ తప్పా కార్మిక సంక్షేమం తెలియదని ఆయన తెలిపారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు తమ హక్కుల కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రపంచీకరణ, మతోన్మాదం, కార్మిక చట్టాల సవరణ ఇప్పుడు అత్యంత వేగంగా ఈ ప్రభుత్వం అమలు చేస్తుందని, దీనిని ప్రతిఘటించేందుకు సమరశీల పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలన్నారు. పాలకులు అవలంభిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు చేయాలన్నారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుంతుంటే అదుపు చేయడంలో పాలకులు విఫలమయ్యాయని, ధరలు పెరగడంతో కార్మికులు, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు ఎదుర్కొటున్న సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి సికెఎం హాస్పటల్ అధ్యక్ష, కార్యదర్శులు కలకోట్ల రాజు, నాగవెల్లి శంకర్, సంధ్య, లావణ్య, పద్మ సుమతి, రజిత, సులోచన, శ్రీశైలం, కవిత, శ్రీను, అఖిల్, రాముల, యశోద, దేవేందర్, ఆహల్య, శ్రీను, కల్పన, జ్యోతి, ఎలిషా, కొమ్మాలు, త్రివేణి, స్వప్న, గిరి, సురేష్, ఎస్ లక్ష్మి , బి.లక్ష్మి , సులోచన, జి కవిత, ఎలిషా, దేవేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## హక్కుల రక్షణకు పోరాటాలు

మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్
యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** కార్మికుల హక్కుల రక్షణకు సమరశీల పోరాటాలకు కార్మిక లోకం సిద్ధ కావాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ పిలుపునిచ్చారు. ఈ నెల 28 నుంచి వరంగల్ జిల్లా కేంద్రంలో జరగనున్న తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర నాల్గవ మహాసభలను పురస్కరించుకుని శుక్రవారం మహబూబ్‌నగర్‌జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయం ఎదుట ఎఐటియుసి జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్మిక జెండా ఊపి వరంగల్‌కు వాహనాల శ్రేణిని ప్రారంభించారు. ఈసందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దశాబ్దాలుగా కార్మిక వర్గం అనేక త్యాగాలు పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలు ఒక్కోక్కటిగా రద్దు అవుతూ కార్మికుల సంక్షేమం విధ్వంసం అవుతున్నాయని మండిపడ్డారు. కార్మిక వర్గాన్ని పూర్తిగా బానిసలుగా మార్చే విధంగా 12 గంటల పని విధానానికి ఆజ్యం పోశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ బహుళ జాతి గుత్త పెట్టుబడిదారులకు దేశ సంపదను దోచిపెట్టే విధంగా చీకటి నల్లచట్టాలు, లేబర్ కోడ్‌లు తీసుకోస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లు వ్యతిరేకిస్తూ తక్షణమే అసెంబ్లీలో తీర్మానం చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులందరికి పర్మనెంట్ , ఏజెన్సీల విధానం రద్దు చేసి కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు, కార్మికులకు నేరుగా ప్రభుత్వమే కార్పోరేషన్ ద్వారా వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సింగర్ శ్యామల, ఎస్.దేవానంద్, రంగన్న, బాలకోటి, రాఘువేందర్,అంజి, యాదయ్య, శంకర్, యుగేందర్‌రెడ్డి, నరేష్, యాదగిరి, నరసింహా, భీమయ్య, పద్మ, సత్యమ్మ, నాగమ్మ, ఎల్లమ్మ, సునీత, రేణుక, ఇందిరా, నాగమణి, వరలక్ష్మి , అలివేల, అంజమ్మ, లక్ష్మి , బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

**ప్రజాపక్షం/కృష్ణ:** కృష్ణ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముడుమాల విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులుగా అధికారులుగా ముస్తాబై ఘనంగా స్వయం స్వరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మండల విద్యాధికారి నిజాముద్దీన్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తు తరాలకు ఆధారమని కావున విద్యార్థులలో దాగివున్న ప్రతిభా పాటవాలను నాయకత్వ లక్షణాలను సమయస్ఫూర్తిని వెలుగు తీయం కోసము పాఠశాలలో రకరకాల విద్యా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. స్వపరిపాలన దినోత్సవంలో భాగంగా జిల్లా కలెక్టర్‌గా ఎం కార్తీక్, జిల్లా విద్యాధికారిగా నితిన్, మండల విద్యాధికారిగా నవదీప్ పాఠశాల, ప్రధానోపాధ్యాయురాలిగా ఎం శిల్పా, ఉపాధ్యాయులుగా ఐశ్వర్య అమృత అలేఖ్య అనిత పద్మిని అశ్విని నర్సింలు బద్రీనాథ్ తదితరులు వారి పాత్రలను పోషించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం కురుమయ్య, జనార్దన్ రెడ్డి, శ్రీనివాస్ మాధవి, రమేష్, తిమ్మప్ప మీనా కుమారి, కలీం తదితరులు పాల్గొన్నారు.

## సేఫ్టీ బారికేడ్స్, గ్రిల్స్ వితరణ

**ప్రజాపక్షం/మద్దూర్ :** పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక కమ్యునిటి ఆసుపత్రికి శుక్రవారం మున్సిపల్ చైర్మన్ సరస్వతి జనార్ధన్ సేఫ్టీ భారికేడ్స్, గ్రిల్స్ ఆసుపత్రి సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సిలో ఒపి రిజిస్ట్రేషన్ నందు పేషెంట్స్ తీసుకునేటప్పుడు ఇబ్బంది గుర్తించనన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పావని, కౌన్సిలర్స్ జిడి మౌనికప్రకాష్, సంజీవ్, నాయకులు పింజరి హుస్సేన్, అబ్దుల్ సలాం, అన్వర్, రియాజ్, రాజు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యా కమిషన్ సిఫారసులు సవరించాలి

తపస్ నారాయణపేట్ జిల్లా శాఖ డిమాండ్

**ప్రజాపక్షం/మక్తల్:** తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చేసిన సిఫారసులు ఎంతో విడ్డూరంగా ఉన్నాయని తపస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నరసింహ రవీందర్ వాపోయారు. కాలానుగుణంగా వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకోకుండా పెర్షనర్ల, ఉపాధ్యాయ, ఉద్యోగులు వేతనాలు భారంగా మారాయి అని చెప్పడం ప్రభుత్వానికి సూచించడం సమంజసం కాదని అన్నారు. టీచర్ల వేతనాలకు తగ్గించి వచ్చిన మిగులతో, పాఠశాల మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించడం విచిత్రంగా ఉందని అన్నారు. పిఆర్సి, డీఏ లు అనేకం పెండింగ్లో ఉన్నప్పటికీ విద్యా వ్యవస్థ మెరుగుదల కోసం పనిచేస్తున్న ఉపాధ్యాయుల సహనాన్ని పరీక్షించడం సరికాదని తెలిపారు. చేసే ప్రతిపాదనలు సహేతుకంగా ఉండాలని, మెప్పు కోసం పని చేయాలని చూడడం సరికాదని అన్నారు.

## రూ.5లక్షల ఎల్‌ఓసి అందజేత

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మమ్మకు హైదారాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకుంటుంది. ఆపరేషన్ ఖర్చులకు భారీగా ఖర్చు అవుతుండడంతో ఆమె కుమారుడు కొత్తపల్లి మండల సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాజీ సర్పంచ్ రమేష్ రెడ్డిని ఆశ్రయించారు. శుక్రవారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి సీఎం సోదరుడు తిరుపతిరెడ్డిని కలువగా తక్షణమే రూ.5 లక్షల రూపాయల ఎల్వోసి చెక్‌ను గ్రామానికి చెందిన రాజేష్ నాయక్ ఆమె కుమారుడు మొగులప్పకు చెక్కును అందజేశారు. తన తల్లి ప్రాణాన్ని కాపాడిన నాయకులకు, పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎఐటియూసి మహాసభలకు తరలిరండి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 4వ మహాసభలకు నాగర్‌కర్నూల్ జిల్లా నలుమూలలనుండి అధిక సంఖ్యలో తరలిరావాలని ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం వరంగల్ సికెఎం ఆస్పత్రినుండి శ్రీరామకల్యాణ మండపం వరకు నిర్వహించే ర్యాలీలో పాల్గొని బహిరంగసభకు జిల్లా నలుమూలల నుండి అన్ని ఆస్పత్రుల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## వాటర్ బాటిల్ అడిగి చైన్ స్నాచింగ్

**ప్రజాపక్షం/జడ్చర్ల :** పట్టపగలే కిరాణ దుకాణదారురాలి మెడలో చైన్ లాక్కెళ్లిన ఘటన జడ్చర్ల మున్సిపాలిటీలో జరిగింది. మున్సిపాలిటీలోని మూడో వార్డులో గల కృష్ణారెడ్డి నగర్ కాలనీలో మంజుల కిరాణ దుకాణంతో పాటు టైలరింగ్ చేస్తోంది. ఈ క్రమంలోనే బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు వాటర్ బాటిల్ అడిగారు. ఆమె వాటర్ బాటిల్ ఇస్తుండగానే ఆమె మెడలో రెండు తులాల పుస్తెలతాడు లాక్కొని బైక్‌పై పరారయ్యారు. ఈ ఘటనంతా సిసి కెమెరాలో రికార్డైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వార్డు సభ్యుడిపై చర్య తీసుకోకుంటే సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తా

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** గ్రామ సభలో తనపై ఏడో వార్డు సభ్యుడు అసభ్య పదజాలంతో దూషిస్తూ భౌతిక దాడికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ, సంబంధిత అధికారుల నుంచి తక్షణ చర్యలు తీసుకోకపోతే సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తానని వల్లభాపురం తండా సర్పంచ్ శివమ్మ స్పష్టం చేశారు. బుధవారం నిర్వహించిన గ్రామ సభ అనంతరం పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడిన సర్పంచ్ శివమ్మ, గ్రామ సమస్యల పరిష్కారం కోసం పంచాయతీ కార్యదర్శి ధర్గేష్ ఉపసర్పంచ్, వార్డు సభ్యులతో కలిసి చర్చలు జరుపుతున్న సమయంలో ఏడో వార్డు సభ్యుడు సభావత్ సర్దార్ నాయక్ అనుచితంగా ప్రవర్తించాడని తెలిపారు. గ్రామసభలో ఏ సమస్యలపై చర్చించనివ్వకుండా తనపై వ్యక్తిగ ఆరోపణలు చేస్తూ ఓటర్లకు డబ్బులు ఇచ్చి సర్పంచ్ పదవిని కొనుగోలు చేశావు అంటూ అవమానకర వ్యాఖ్యలు చేశాడని ఆరోపించారు. అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా, తన జుట్టు పట్టుకుని లాగి కింద పడవేసి కాళ్లతో తన్నాడని సర్పంచ్ శివమ్మ ఆరోపిస్తూ బోరున విలపించారు. బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఆమె అధికారులను కోరారు.

## విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్స్ పంపిణీ



**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట మండలం రామనంతపురం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు టిజి మహేష్ గత కొన్ని సంవత్సరాలుగా చేస్తున్న సామాజిక సేవ కార్యక్రమాల్లో భాగంగా ప్రతి సంవత్సరం కొత్తకోట మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షల కొరకు ప్యాడ్లు అందిస్తున్నారు. అందులో భాగంగా సంకిరెడ్డిపల్లి, పాలెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో ప్యాడ్లు అందించారు. ఈ కార్యక్రమంలో సంకిరెడ్డిపల్లి ప్రిన్సిపాల్ ఎంఈఓ కృష్ణయ్య, సంకిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ సమీన్ ముస్తఫా, వార్డు సభ్యులు వడ్డే సురేష్, ఈదన్న, తెరాస అధ్యక్షుడు తెలుగు గోపి, నర్సింహ, రవి, అవినాష్, మోహన్ గౌడ్, పాలెం ప్రిన్సిపాల్ భాస్కర్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, గ్రామ యువకులు వెంకటేశ్ యాదవ్, పెద్ది రవి, శ్రీశైలం యాదవ్, విద్యార్థులు గ్రామ యువకులు పాల్గొన్నారు.

# సుందర నగరంగా తీర్చిదిద్దే దిశగా మహబూబ్‌నగర్

పశుసంవర్ధక, మత్స్య క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మహబూబ్ నగర్ పట్టణాన్ని రాష్ట్రంలోనే నెంబర్ 1 సుందర నగరంగా తీర్చిదిద్దే దిశగా, ప్రజల నమ్మకాన్ని గెలుచుకునే విధంగా పనిచేయాలని పశుసంవర్ధక, మత్స్య క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లకు దిశానిర్దేశం చేశారు. శుక్రవారం మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన మేయర్ గుమాల్ మమత, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పార్టీలకు అతీతంగా, తనమనే అనే భావం లేకుండా అందరికీ సమాన న్యాయం చేస్తూ పరిపాలన సాగించాలని సూచించారు. ప్రజలు నమ్మి ఇచ్చిన బాధ్యతను గౌరవించి వారి విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పని చేయాలని అన్నారు. పట్టణ అభివృద్ధి కోసం అవసరమైన నిధులను సమకూర్చుకొని రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, పార్కులు, ఫ్లైఓవర్లు, పాఠశాలలు, విద్యాసంస్థలు, ఐఐఐటీ, వైద్య సదుపాయాలు వంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని సూచించారు. మహబూబ్ నగర్ కార్పొరేషన్ చరిత్రలో తొలిసారిగా ఒక బీసీ మహిళను మేయర్‌గా ఎన్నుకోవడం గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. అనంతరం మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రధాన సిద్ధాంతం సామాజిక న్యాయం, సమానత్వమని పేర్కొన్నారు. కార్పొరేషన్ ఏర్పడిన తరువాత తొలిసారిగా బీసీ మహిళను మేయర్‌గా ఎన్నుకోవడం చారిత్రాత్మకమని అన్నారు. మేయర్ గుమాల్ మమత మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన మంత్రి, ఎమ్మెల్యే, వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మహబూబ్ నగర్‌ను రాష్ట్రంలోనే అందమైన నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మహబూబ్‌నగర్ పట్టణాన్ని ఒక సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారంతో కృషిచేస్తామని. తనను ఎన్నుకున్న ప్రజలను కృతజ్ఞతలు తెలిపారు. చివరగా మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహ రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎన్.పి. వెంకటేష్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన విద్యార్థులు

**ప్రజాపక్షం/నర్వ :** తహసీల్దార్ కార్యాలయంలో జరిగే వివిధ విధుల నిర్వహణన గురించిన అవగాహన కొరకు విద్యార్థులు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కె.ప్రణయ్ కుమార్, తహసిల్దార్ విద్యార్థుల యొక్క ఆసక్తిని బట్టి ఎన్నో విషయాల వివరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సహకరించిన తహసీల్దార్‌కి వారి సిబ్బందికి ప్రతిభా హైస్కూల్ యాజమాన్యం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## విద్యార్థులకు మౌలిక నైపుణ్యాలపై అవగాహన

**ప్రజాపక్షం/అడ్డాకుల :** మౌలిక, అధ్యయన, పరిశోధనా, శిక్షణ సంస్థ (ఎస్‌సిఈఆర్‌టి ) విద్యా రంగానికి సంబంధించిన తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అడ్డాకుల మండలం గుడిబండ మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో గత మూడు రోజుల నుండి ఫీల్డ్ ఇన్విజిలేటర్ కె.శ్రీనిధి డైట్‌చే రెండవ తరగతి విద్యార్థులకు తెలుగు, ఆంగ్లము, గణితం వంటి మౌలిక నైపుణ్యాలను నేర్పించారు. శుక్రవారం ఎంఈఓవి ప్రకాష్ పాఠశాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్ ముఖ్య ఉద్దేశం 3వ తరగతి ముగిసే సకిరి ప్రతి విద్యార్థి సరళంగా చదవగలగాలి, చదివినది అర్థం చేసుకోవాలి, ప్రాథమిక గణితం (కూడిన, తీసివేత వంటి లెక్కలు) చేయగలగాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివ కుమార్, సి.ఆర్.పి. చెన్నయ్య, రెండవ తరగతి ఉపాధ్యాయురాలు జి. మంజుల, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/మాగనూర్:** మండలంలోని వద్వాట్ గ్రామంలో నూతన 33/11 కెవి సబ్ స్టేషన్ నిర్మాణానికి రాష్ట్ర క్రీడా, యువజన సర్వీసులు పాడి పరిశ్రమ, పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వాకిటి శ్రీహరి మాట్లాడుతూ సబ్‌స్టేషన్ నిర్మాణం కొరకు రెండు కోట్ల తొంబై లక్షలు మంజూరు ఐనట్టు సబ్ స్టేషన్ నిర్మాణం త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. త్వరగా పూర్తయితే లో ఓల్టేజ్ కరెంటు కష్టాలు తీరుతాయని రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సురేష్ కుమార్, వాడ్వాట్ గ్రామ సర్పంచ్ రవీందర్, కొల్పూర్, సర్పంచ్ ముద్దు రాములు, మాగనూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆనంద్ గౌడ్, శివరాం, రెడ్డి, విద్యుత్ అధికారులు, నాయకులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ భవన నిర్మానానికి శంకుస్థాపన**

మండల పరిధిలోని గురావ్ లింగంపల్లి గ్రామంలో శుక్రవారం కొత్తగా నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవన నిర్మాణానికి మంత్రి వాకిటి శ్రీహరి శంకుస్థాపన చేశారు. అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రూ.12 లక్షలు మంజూరు అయ్యాయని పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ దేవమ్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, వివిధ పార్టీ నాయకులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పనుల సమగ్ర వివరాల నివేదికను అందజేయాలి

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/గద్వాలరూరల్:** జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, భవిష్యత్తులో చేయబోయే పనుల సమగ్ర వివరాల నివేదికను తయారు చేసి అందజేయలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. జోగులాంబ గద్వాల జిల్లా నూతన కలెక్టర్‌గా శుక్రవారం ఐడిఓసిలోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం పలువురు జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశమై మాట్లడారు. ఆయా ప్రభుత్వ శాఖల పనితీరు మెరుగుపడాలంటే అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ తమ పరిధిలోని పనులను వేగవంతం చేయాలన్నారు. పీఎండిడికేవై ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన కు మన జిల్లా ఎంపిక కావడంతో ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు సంబంధిత శాఖ అధికారులం దరూ చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. వీధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులతో కఠినంగా వ్యవహరిస్తానన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కు పలువురు జిల్లా అధికారులు, కలెక్టరటే సిబ్బంది ఘనంగా స్వాగతం పలుకుతూ పుష్పగుచ్చాలు, మొక్కలు అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం పలువురు మత పెద్దలు కలెక్టర్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపి, ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీ నారాయణ రెవిన్యూ, నర్సింగరావు, స్థానిక సంస్థలు, ఆర్డీవో శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్ధాలపై అవగాహన

జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను




**ప్రజాపక్షం/నారాయణపేట :** మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించి, నారాయణపేట జిల్లాలో మాదకద్రవ్యాల నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో మాదకద్రవ్యాల నిషేధం (యాంటీ నార్కోటిక్)పై ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం డ్రగ్స్ పై సీరియస్ గా ఉందని మన జిల్లాలో గంజాయి సాగు జరగకుండా వ్యవసాయ శాఖ అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎవరైనా రైతు తన పొలంలో గంజాయి సాగు చేస్తున్నట్లు రుజువు అయితే అతనిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ పరంగా లబ్ది చేకూరే సంక్షేమ పథకాలన్నీ రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని జూనియర్, డిగ్రీ కళాశాలలతో పాటు జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల, యాంటీ డ్రగ్ కమిటీ నేతృత్వంలో మాదకద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మన జిల్లాలో పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, డిగ్రీ జూనియర్ కళాశాలలోనే కాకుండా పాఠశాలలోనే మాదకద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. జిల్లాలో గంజాయి సరఫరా పై పోలీసు ఎక్సైజ్ శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. పోలీసు శాఖ, ఎక్సైజ్‌శాఖ అధికారులే కాకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో మాదకద్రవ్యాల నిషేధాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలని ఆయన సూచించారు. జిల్లాలో జరిగే ప్రతి కార్యక్రమంలో మాదక ద్రవ్యాల నిషేధ అంశాన్ని ఒక సబ్జెక్టుగా పెట్టుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ అబ్దుల్ ఖలీల్, డీపీఆర్ఓ రషీద్, సీఐ శివ శంకర్, వైద్య శాఖ అధికారి బిక్షపతి, కలెక్టరేట్ సీ సెక్షన్ అధికారిని జయ సుధ, ఎక్సైజ్ సిఐ, ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 1 నుండి విద్యుత్ మీటర్ రీడింగ్ నిలిపివేస్తాం



రాష్ట్ర సహాయ కార్యదర్శి సుంకరి వేణు

**ప్రజాపక్షం/వనపర్తి :** తమ సమస్యలు పరిష్కరించే వరకు వెనక్కి తగ్గేది లేదని, మార్చి 1 నుండి బిల్లింగ్ పనులు పూర్తిగా నిలిపివేస్తామని వనపర్తి జిల్లా విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సుంకరి వేణు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ తమ చిరకాల సమస్యల పరిష్కారం కోసం పోరాట బాట పట్టింది. మార్చి 1 వ తేది నుండి రాష్ట్ర వ్యాప్తంగా స్పాట్ బిల్లింగ్ పనులను బంద్ చేస్తున్నట్లు యూనియన్ నాయకులు ప్రకటించారు. ఈ మేరకు వనపర్తి జిల్లా విద్యుత్ మీటర్ రీడర్స్ కమిటీ ఒక ప్రకటన విడుదల చేస్తూ, తమ నిరసనకు మద్దతు తెలుపుతూ శుక్రవారం వనపర్తి జిల్లా విద్యుత్ మీటర్ రీడర్స్ కమిటీ ఒక ప్రకటన విడుదల చేస్తూ, తమ నిరసనకు మద్దతు తెలుపుతూ శుక్రవారం వనపర్తి డిఈ శ్రీనివాసులుకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి సుంకరి వేణు మాట్లాడుతూ టిజిఎన్‌పిడిసిఎల్ పరిధిలో పనిచేస్తున్న మీటర్ రీడర్లకు నెలకు రూ.20,000 నుండి రూ.25,000 వరకు వేతనం అందుతుండగా, టిజిఎస్‌పిడిసిఎల్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో కేవలం రూ.4,000 పట్టణాల్లో రూ.8,000 మాత్రమే ఇస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కానీ పరిస్థితులు మరింత దిగజారుతున్నాయని వనపర్తి జిల్లా అధ్యక్షుడు యూం.డి.మాసూమ్, కార్యదర్శి సంపత్‌కుమార్, కోశాధికారి దశరథం, యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.



## ఘనంగా నగరపాలక సంస్థ మేయర్, డిప్యూటీ మేయర్ పదవీ ప్రమాణ స్వీకారం

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ మేయర్, డిప్యూటీ మేయర్, కార్పోరేటర్ల పదవీ ప్రమాణస్వీకార కార్యక్రమం నగరపాలక సంస్థ కార్యాలయంలో భాగంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా పదవీబాధ్యతలు స్వీకరించిన మేయర్ గుమాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, కార్పోరేటర్లను ఘనంగా సన్మానించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల విశ్వాసానికి తగిన విధంగా పారదర్శకంగా అభివృద్ధి దిశగా,ప్రజాసేవలో నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. మహబూబ్‌నగర్ అభివృద్ధి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ఇందిరా మహిళా శక్తి గ్రామ దుకాణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ పట్టణంలో జిల్లా మహిళా సమాఖ్య అధ్వర్యంలో నాబార్డు ఆర్థిక సహకారంతో అంబేద్కర్ చౌరస్తా దగ్గర ఉన్న డ్వాక్రా భవన్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి గ్రామ దుకాణంను శుక్రవారం మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా మహిళా సమాఖ్య సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళల సాధికారతే సమాజ అభివృద్ధికి పునాది అని అన్నారు. జిల్లాలోని 15 మండలాల స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన వివిధ రకాల ఉత్పత్తులను ఈ దుకాణంలో విక్రయించడం ద్వారా వారికి ఆర్థికంగా తోడ్పాటు అందుతుందని తెలిపారు. మహిళల ఆత్మనిర్భరతకు ఇటువంటి వేదికలు ఎంతో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ దుకాణం ఏర్పాటుకు సహకరించిన డిఆర్‌డిఎ, నాబార్డు అధికారులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో డిపియం రామమూర్తి, నాబార్డు డిడియం షణ్ముఖ చారి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు స్వాతి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్న తాండ్రపాడులో గడ్డివాము దగ్ధం



**ప్రజాపక్షం/అయిజ:** వేసవి కాలం సమీపిస్తున్న ఇంకా ఎండలు ముదరక ముందే పశుగ్రాసాలు, కంపెనీలు, ఇల్లు అగ్ని దహనానికి బలవుతున్నాయని. రాబోయే వేసవి తాపానికి ఇంకా ఎంత అగ్నికి ఆహుతి కావాలోనని ప్రజల్లో ఆందోళన మొదలైందని. ఈ రెండు నెలల కాలంలోనే మూడు గడ్డి వాములు ఒక కంపెనీ అగ్నికి ఆహుతి అయ్యాయని, సుమారు కోట్లలో నష్టపరిహారాలు సంభవిస్తున్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. శుక్రవారం చిన్నతాండపాడు గ్రామానికి చెందిన దళారి శ్రీను అనే వ్యక్తి పశుగ్రాసం దగ్ధమై సుమారు 50 వేలరూపాయల నష్టం వాటిల్లిందని అసలే కరువుకాలం పశుగ్రాసం దొరకని పరిస్థితి ఇది. ప్రతి రైతు వాణిజ్య పంటలు వైపు దృష్టి సారించడం వల్ల పశుగ్రాసం కొరత ఏర్పడిందని పశుగ్రాసం ఎలా తెచ్చుకోవాలో తెలియదు అంటూ కన్నీటి పర్యవంతమయ్యాడు. అందువల్ల ఈ చుట్టుపక్కల గ్రామాల్లో ఇటువంటి విపత్తును తప్పించుకోవాలంటే అయిజ మున్సిపాలిటీలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తే కొంతమరకైనా ఈ విపత్తులను అరికట్టవచ్చునని చిన్నతాండ్రాపాడు గ్రామస్తులు అన్నారు.

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత



**ప్రజాపక్షం/చిన్నంబావి:** చిన్నంబావి మండలం పరిధిలోని వాల్మీకి చౌరస్తా రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత చిన్నంబావి మండల ఎస్సై ఏ నాగరాజు రోడ్డు ప్రమాదాల నివారణ అనేది కేవలం పోలీసుల పని మాత్రమే కాదని అది ప్రతి పౌరుడి బాధ్యత అని మండల ఎస్సై నాగరాజు అన్నారు. ఇటీవల పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని వాహనదారుల్లో అవగాహన కల్పించేందుకు ఆయన ప్రత్యేక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రాణ నష్టాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైతో పాటు పోలీస్ సిబ్బంది వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మెర ఘటన దురదృష్టకరం

ఎంపి డాక్టర్ మల్లురవి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల బృందం పర్యటన



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్నజాతర ఘటనలో రెండునెలల పసికందు మృతిచెందడం బాదాకర విషయమని పసికందు మృతికి బాధ్యులు ఎవరైనా చట్టపరంగా శిక్షించడం తప్పదని ఎంపి మల్లురవి తెలిపారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ ఎంపి డాక్టర్ మల్లురవి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల బృందం కుమ్మెర గ్రామాన్ని సందర్శించి జరిగిన ఘటన గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు, యువకులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలను కాంగ్రెస్ బృందానికి తెలియజేశారు. కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నిజనిర్ధారణ బృందం ఆధ్వర్యంలో పూర్తి వివరాలను తెలుసుకోవడం జరిగిందని బృందం సభ్యులు తెలిపారు. ఎంపి డాక్టర్ మల్లురవితోపాటు జాతీయ ఆదివాసి కాంగ్రెస్‌చైర్మన్ ట్రైకర్ చైర్మన్ బెల్లయ్యనాయక్, టిపిసిసి ఉపాధ్యక్షులు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రాష్ట్రమైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబెద్దుల్లా కొత్వాల్, డిసిసిబి మాజీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రాజేందర్‌ల బృందం సభ్యులుగా ఉన్నారు. గ్రామంలో సేకరించిన వివరాలను నివేదిక రూపంలో ముఖ్యమంత్రికి, పిసిసి అధ్యక్షులకు ఇవ్వడం జరుగుతుందని బృందం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మున్సిపల్ చైర్మన్లు, వ్యవసాయ మార్కెట్ కమిటిచైర్మన్‌లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలు పాల్గొన్నారు.

## గాంధీజీ స్ఫూర్తితో.. చరఖా వడికిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/యాదాద్రి :** స్వాతంత్ర్య సమరయోధుడు మహాత్మా గాంధీ స్వదేశీ ఉద్యమంలో భాగంగా దేశీయ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు నూలు రాట్నం చరఖాను వడికిన స్ఫూర్తిని నేటి తరానికి చేరవేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో వికారాబాద్‌లో కొనసాగుతున్న ఉభయ తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల సమావేశం ఏడవ రోజుకు చేరుకుంది. శుక్రవారం జరిగిన కార్యక్రమాల్లో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా డీసీసీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సహచర డీసీసీ అధ్యక్షులతో కలిసి చరఖాను తిప్పి పత్తి నుండి దారం తయారు చేస్తూ స్వదేశీ భావాన్ని ప్రతిబింబించారు. 'మన పనులు మనమే చేసుకోవాలి' అనే సందేశంతో ఆయన ఆదర్శంగా నిలిచారు. స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా పరిసర ప్రాంతాల్లో ఉన్న చెత్తను చీపురు పట్టి ఊడ్చి శుభ్రం చేశారు. అలాగే, భోజనం అనంతరం తను తిన్న ప్లేట్‌ను తానే స్వయంగా కడిగి తోటి నాయకులకు, కార్యకర్తలకు ఆదర్శంగా నిలిచారు.

## రవాణా సౌకర్యం లేక ఆర్థిక నష్టం

లింగంవారి గూడెంకు బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలి ఎమ్మెల్సీకి గ్రామస్తుల వినతి



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండలంలోని లింగం వారి గూడెంకు గత కొంతకాలంగా నిలిచిపోయిన బస్సు సర్వీసును వెంటనే పునరుద్ధరించాలని గ్రామ వార్డు సభ్యులు, గ్రామస్తులు, స్థానిక ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకు వినతి పత్రం అందజేశారు. గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో విద్యార్థులు, అత్యవసర వైద్య అవసరాల నిమిత్తం పట్టణానికి చేరుకోవడం కష్ట సాధ్యమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ కేంద్రానికి పని కోసం కూలీలు చిన్న వ్యాపారాలు కూడా రవాణా సౌకర్యం లేక ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. కనీసం రోజుకు రెండుసార్లు అయినా బస్సు నడపాలని వారు కోరారు. బస్సు సర్వీసును వెంటనే పునరుద్ధరించాలని వినతి పత్రం స్వీకరించిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం రవాణా శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరగతిన పరిష్కారం బస్సు సర్వీసును పంపించేందుకు నా బాధ్యత అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి, వార్డు సభ్యులు కత్తుల మల్లయ్య, బద్దుల సుధాకర్, కత్తుల విజయ్, కురుమతి దేవరాజు, కత్తుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నియంత్రణకే పెద్దపీట



**ప్రజాపక్షం/హాలియా:** ప్రమాదాలను నియంత్రించడానికే పెద్దపీట వేస్తామని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో హాలియాలోని లక్ష్మీనరసింహ గార్డెన్లో శుక్రవారం డ్రైవర్లకు మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలను అందజేశారు. ప్రయాణంలో కంటిచూపు కూడా ప్రధాన భూమిక పోషిస్తుందని అందువల్లనే డ్రైవర్ల అందరికీ ఇక్కడ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పోలీస్ శాఖ తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ ప్రమాదాలు నియంత్రణలో జిల్లాలో గత మూడేళ్లలో ప్రమాదాలు భారీగా తగ్గినట్లు ఆయన చెప్పారు. 2023లో 44 ప్రమాదాలు, 2024 లో 33 ప్రమాదాలు,2025 లో 18 ప్రమాదాలు జరిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి రాజశేఖర్ రాజు, హాలియా సీఐ సతీష్ రెడ్డి, ఎస్సైలు బండి సాయి ప్రశాంత్, సురేష్ కుమార్, హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి,హాలియా, సాగర్, మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్, ప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కర్ల రాజేష్ రీపోస్టుమార్టం వద్ద ఉద్రిక్తత

పోస్టుమార్టంపై మందకృష్ణ మాదిగ తీవ్ర ఆరోపణలు



**ప్రజాపక్షం/కోదాడ:** సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని గాంధీనగర్ శ్మశాన వాటిక వద్ద కర్ల రాజేష్ మృతదేహానికి రీ పోస్టుమార్టం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు మందకృష్ణ మాదిగ అక్కడికి చేరుకుని మీడియాతో మాట్లాడారు. వందలాది జల తర్వాత బీబీనగర్ ఎయిమ్స్ ఆసుపత్రి వైద్యులు రీపోస్టుమార్టం నిర్వహించారని తెలిపారు. 90 రోజుల క్రితమే రీ పోస్టుమార్టం చేయాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేసినప్పటికీ కావాలనే జాప్యం చేసి మృతదేహం కుళ్లిపోయిన తర్వాత పరీక్షలు నిర్వహించారని ఆరోపించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోదాడకు తరచూ వస్తున్నప్పటికీ కర్ల రాజేష్ ఇంటికి రాకపోవడం ఎస్ఐ సురేష్‌రెడ్డిని కాపాడటానికేనని అనుమానం వ్యక్తం చేశారు. రీపోస్టుమార్టం ప్రారంభానికి ముందే వైద్యులు వివరాలు, ఫోన్ నెంబర్లు ఇవ్వాలని విచారణలు మొదలుపెట్టారని చెప్పారు. రేపు వెల్లడించే నివేదికలో అవకతవకలు జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వానికి మాదిగలు వ్యతిరేకంగా మారే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.

## మంత్రిని కలిసిన కలెక్టర్



**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ :** రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కలెక్టర్ అనురాగ్ జయంతి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన అనురాగ్ జయంతి శుక్రవారం ఉదయం రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజా ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు పారదర్శకంగా పేదలకు చేరేలా, అర్హులైన వారికి లబ్ధి జరిగేలా పని చేయాలని ఈ సందర్భంగా సూచించారు.

# వైభవంగా చక్రస్నానం...మహాపూర్ణాహుతి

సాయంత్రం పుష్పయాగంతో పరిసమాప్తి






**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట:** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవములలో భాగంగా చివరి రోజైన శుక్రవారం స్వామివారి ఆలయంలో వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం నిత్యారాధనల అనంతరం పాంచరాత్రాగమ శాస్త్రానుసారంగా మహాపూర్ణాహుతి, చక్రతీర్థం కార్యక్రమాలను ఆలయ అర్చక బృందం, వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో దేవాదాయ శాఖ డైరెక్టర్ ఎం. హనుమంతరావు, ఈవో జె.భవానీశంకర్, అనువంశిక ధర్మకర్త భాస్కరాయని నరసింహామూర్తి, డి ఓ ధర్బల భాస్కర శర్మ. ఏ ఈ ఓ లు అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. లోకకల్యాణార్థం సుఖశాంతులతో విరాజిల్లాలని కోరుతూ మహాపూర్ణాహుతిని నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య సకాలంలో వర్షాలు కురవాలని, పాడిపంటలు బాగుండాలని భగవానుడిని వేడుకుంటూ హోమ గుండంలో పూర్ణాహుతిని సమర్పించారు. పుణ్యప్రదం.. చక్రస్నానం (అవభృద స్నానం) బ్రహ్మోత్సవాలలో అత్యంత కీలకమైన ఘట్టం చక్రతీర్థం. సుదర్శన చక్రత్తాళ్వార్లకు పంచామృత స్నపన తిరుమంజనం నిర్వహించిన పవిత్ర పుష్కరిణిలో శాస్త్రోక్తంగా చక్రస్నానం చేయించారు. సుదర్శన చక్ర ప్రభావం వల్ల పునీతమైన ఈ తీర్థంలో స్నానమాచరించడం వల్ల సర్వపాపాలు తొలగి పుణ్యం లభిస్తుందని భక్తులు పోటెత్తారు. సమయం కార్యక్రమం విశిష్టత సాయంత్రం శ్రీ పుష్పయాగం ఉత్సవాల్లో జరిగిన దోషాల నివారణకు ప్రాయశ్చిత్తం చేశారు. ఆహ్వానించబడిన దేవతలను రాత్రి దేవతోద్వాసన ఫలికారు. ముగింపు దోపు ఉత్సవం తిరుమంగైయాళ్వార్ భక్తి వైరాగ్య చాటిచెప్పే ఘట్టం. యాగం జన్మరాహిత్యాన్ని బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన ముక్కోటి దేవతలకు హవిస్సులు అందించి, మంగళ వాయిద్యాల మధ్య వారి స్వస్థలాలకు పంపే ఈ వేడుక సువృష్టిని కలిగిస్తుందని పురాణోక్తి.

**దోపు ఉత్సవం:** పరమ భక్తుడైన తిరుమంగైయాళ్వార్ భగవత్ సేవ కోసం చేసిన సాహసం, ఆపై కలిగిన జ్ఞానోదయం ఈ ఉత్సవ ప్రధాన ఉద్దేశం. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు బట్టర్ సురేంద్రచార్యులు, దేవస్థానం ఈవో జే.భవాని శంకర్, అనువంశిక ధర్మకర్త భాస్కరాయని నరసింహమూర్తి, దేవాదాయ శాఖ డైరెక్టర్ ఎం హనుమంతరావు, డీఈవో దోర్బల భాస్కర శర్మ, ఏఈఓ ప్రతాప నవీన్ కుమార్ శర్మ, గజ్వేల్ రఘు, పర్యవేక్షకులు కలకోట సీతారామాచార్యులు, కే నటరాజు, మాచర్ల రాజన్ బాబు, వాసం వెంకటేశ్వర్లు, ధీరావత్ రామారావు నాయక్, దొమ్మాట సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# యాదాద్రి జిల్లా అభివృద్ధిపై చర్చించిన ప్రజాప్రతినిధులు



**ప్రజాపక్షం/యాదాద్రి :** యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అనురాగ్ జయంతిని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌కు విచ్చేసిన ఎంపికి జిల్లా యంత్రాంగం స్వాగతం పలికింది. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ, జిల్లాలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు.

**పురపాలక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి:** ఎంపీతో పాటు భువనగిరి మున్సిపల్ నూతన చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్ కూడా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌కు ఆమె అభినందనలు తెలిపారు. భువనగిరి పట్టణ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన మరియు పెండింగ్లో ఉన్న మున్సిపల్ ప్రాజెక్టుల గురించి ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం:** ఈ భేటీ అనంతరం ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. నూతన కలెక్టర్ నేతృత్వంలో జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల వినియోగం, ప్రజా సమస్యల త్వరితగతిన పరిష్కారం అయ్యేలా అధికారులతో సమన్వయం చేసుకుంటామని పేర్కొన్నారు.డకలెక్టర్ అనురాగ్ జయంతి స్పందిస్తూ.. జిల్లా అభివృద్ధికి ప్రజాప్రతినిధుల సహకారం ఎంతో అవసరమని, అందరినీ కలుపుకుని జిల్లాను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు, పిసిసి మాజీ సెక్రెటరీ తంగేళ్లపల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలు విద్యార్థుల భవిష్యత్‌కు పునాది



రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

**ప్రజాపక్షం/చివ్వెంల :** గురుకుల పాఠశాలలు గ్రామీణ, గిరిజన ప్రాంతాల విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నాయని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. మండలంలోని ట్రైబల్ వెల్ఫేర్ మినీ గురుకుల ఎస్‌టి బాలికల పాఠశాలలో నిర్వహించిన అన్యువల్ డే, సెల్ఫ్ టీచింగ్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. విద్యార్థులు విద్యతోపాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాలను దత్తత తీసుకొని అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు స్ప్రెడ్ ఇంటర్నేషనల్ చైర్మన్ పటేల్ శ్రీధర్ రెడ్డి పాఠశాలను సందర్శించిన సమయంలో విద్యార్థులు కోతల సమస్యతో ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తించి తన సొంత నిధులతో రూ.2లక్షల వ్యయంతో నిర్మించిన మంకీ ప్రొటెక్షన్ గ్రిల్స్, వాటర్ ట్యాంక్‌ను, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సొంత నిధుల నుండి రూ.8లక్షలతో నిర్మించిన కిచెన్, స్టోర్ రూమ్ భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ బైరబోయిన శ్రీనివాస్, జ్యోతి కరుణాకర్, కాంగ్రెస్ నాయకులు సైదిరెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదేశం

**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్:** రెవెన్యూ సేవలు పారదర్శకంగా,వేగవంతంగా ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఆయన నాగార్జునసాగర్ నియోజకవర్గం తిరుమలగిరి సాగర్ మండల తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.భూమి రికార్డులు, పహాణీలు, ఆర్ఓఆర్ ఫైళ్లు, మ్యూటేషన్ దరఖాస్తులు, ధరణి భూభారతి నమోదు వివరాలను పరిశీలించారు. తనిఖీ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్ణీత గడువులో సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రికార్డుల నిర్వహణ పద్ధతిపై సూచనలు చేస్తూ, డిజిటల్ నమోదులను సకాలంలో అప్డేట్ చేయాలని చెప్పారు. రెవెన్యూ సేవలు పారదర్శకంగా, వేగవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కార స్థితిని కలెక్టర్ పరిశీలించారు. ప్రజలు కార్యాలయానికి వచ్చినప్పుడు సమయానికి సేవలు అందేలా సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ఉన్నారు.

## పెండింగ్ పనులను పూర్తి చేయాలి

కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల కోసం ఇల్లు అందించాలనే లక్ష్యంతో హుజూర్‌నగర్‌లోని రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న జి ప్లస్ వన్ ఇండ్లలో మిగిలిన పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం పణిగిరి రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పెండింగ్ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అవసరమైతే ఎక్కువ మంది లేబర్ తీసుకుని పనులు పూర్తి చేసి మార్చి మొదటివారంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించడానికి సిద్ధం చేయాలన్నారు. బ్లాక్‌లో మధ్యగల అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సరఫరా, మొక్కల నాటడం, పెయింటింగ్ పనులు, స్ట్రీట్ లైట్స్ అన్ని రకాల పెండింగ్ పనులు పూర్తి చేయాలని, ఎలాంటి లోటుపాట్లకు అస్కారం లేకుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, గుత్తేదారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి సిద్దార్ధ, మిషన్ భగీరథ ఇఇ కరుణాకర్‌రెడ్డి, తహసిల్దార్ కవిత, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించండి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అంగన్‌వాడి టీచర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ అంగన్‌వాడి టీచర్స్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అంగన్‌వాడి టీచర్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి టీచర్లు మాట్లాడుతూ ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ప్రభుత్వ పాఠశాలల మాదిరిగానే అంగన్‌వాడి కేంద్రాలకు కూడా మార్చి 15 నుంచి ఒక్కపూట బడికి అనుమతి ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అదేవిధంగా ప్రీప్రైమరీ విద్యను అంగన్‌వాడి కేంద్రాల ద్వారానే నిర్వహించి అంగన్‌వాడి టీచర్లను ప్రీప్రైమరీ విద్యను అంగన్‌వాడి కేంద్రాల ద్వారానే నిర్వహించి అంగన్‌వాడి టీచర్లను ప్రీప్రైమరీ టీచర్లుగా గుర్తించి కనీస వేతనం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెంకటరమణ, రోజా, సైదమ్మ, సరిత, రషీదా, శైలజ, పద్మ, పార్వతి, రాణి, రాములమ్మ, జయశ్రీ, శ్రీలక్ష్మి , వెంకటమ్మ, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వేగంగా అయిటిపాముల లిఫ్ట్ పనులు

ఇరిగేషన్ అధికారులతో ఎమ్మెల్యే వేముల వీరేశం సమీక్ష సమావేశం



**ప్రజాపక్షం/నకిరేకల్ :** కట్టంగూర్ మండలం అయిటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణ పనుల పురోగతిపై నకిరేకల్ పట్టణంలోని పన్నాలగూడెం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఇరిగేషన్ అధికారులు,కాంట్రాక్టర్లతో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణ పనుల ప్రస్తుత స్థితి, నాణ్యత ప్రమాణాలు, నిధుల వినియోగం, పనులను వేగవంతం చేయాలనిఆయన కోరారు. పనులు నిర్ణీత గడువులోగా పూర్తి అయ్యేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా పర్యవేక్షణ పెంచాలని కోరారు.అయిటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తయితే పరిసర గ్రామాల రైతులకు పెద్దఎత్తున ప్రయోజనం కలుగుతుందని ఆయన తెలిపారు.ప్రతి ఎకరాకు సాగునీరు చేరేలా ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.రైతులకు త్వరితగతిన సాగునీటి సౌకర్యం అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు.ఈకార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు కాంట్రాక్టులు నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్,పన్నాల రాఘవరెడ్డి,లింగాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# చిల్లంచర్ల వరలక్ష్మి మృతి బాధాకరం

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్



**ప్రజాపక్షం/మునగాల:** తెలంగాణ సాయుధ పోరాట యోదులు స్వతంత్ర్య సమరయోధులు కామ్రేడ్ చిల్లంచర్ల రఘునాథం సతీమణి చిల్లంచర్ల వరలక్ష్మి మృతి అత్యంత బాధకరమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, కోదాడ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు బొల్లం మల్లయ్య యాదవ్‌లు అన్నారు. శుక్రవారం ఆమె మృతదేహంపై పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యడు గన్నాచంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు లు పార్టీ జెండాను కప్పి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మునగాల పరగాణ ప్రజా పోరాటాల నిర్వాహణలో రఘునాదం నిర్వహించిన ఉద్యమాలలో వరలక్ష్మి సహకారం మరువలేనిదన్నారు. రఘునాదం ఆజ్ఞాతంలో ఉన్నప్పుడు 9మంది సంతానంతో తన కుటుంబాన్ని తన రెక్కల కింద సాధుకుని అటు ఉద్యమానికి, ఇటు ఉద్యమానికి వారధిగా నిలిచిన ఉద్యమ అభిలాషి వరలక్ష్మి అన్నారు. అమె మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటు అన్నారు. సాయుధ పోరాటకాలంలో ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలోగాని నిరంతరం రఘునాధం ఆ పనిలో నిమగ్నమై ఉన్న సందర్భాల్లో అనేక మంది నాయకులు కార్యకర్తలు, కుటుంబ సభ్యులు అందరూ ఇంటికి వస్తూ పోతుండే వారిని, వారందరికి భోజనాలు పెడుతుండేదని, ఎప్పుడు వారందరికి భోజనాలు సమకూర్చే పనిలో నిమగ్నమయ్యారని అన్నారు. సిపిఐ పార్టీ కోసం ఆమె నిర్వహించిన పాత్ర మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మామిడి చిన్నరాములు, సిహెచ్ సీతరాం, బిఆర్ఎస్ నాయకులు తొగరు రమేష్, సుంకర అజయ్‌కుమార్, కందిబండ సత్యనారాయణ, ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు అర్వపల్లి శంకర్, ఓరుగంటి రవి, అనసూయ, శ్రీదేవి, విజయలక్ష్మి , శారధ, పద్మ పాల్గొన్నారు.

## పెద్దాపురం ఆదర్శ పాఠశాలపై కేంద్ర బృందం తనిఖీ

**ప్రజాపక్షం/నాంపల్లి:** పీఎం శ్రీ పాఠశాలల తనిఖీ కార్యక్రమంలో భాగంగా నాంపల్లి మండలంలోని పెద్దాపురం ఆదర్శ పాఠశాలను కేంద్ర సాంృతిక శాఖ కమిషనర్ కమలేష్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని బృందం శుక్రవారం సందర్శించింది.ఈ సందర్భంగా పాఠశాలకు విచ్చేసిన అధికారులకు ఉపాధ్యాయులు, విద్యార్థులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.తనిఖీ సందర్భంగా కంప్యూటర్ ల్యాబ్, ఐఎఫ్‌పీ ప్యానెల్ బోర్డు వ్యవస్థ, అటల్ ల్యాబ్, కెమిస్ట్రీ, జూలజీ ప్రయోగశాలలు,హౌస్ సిస్టమ్,స్కౌట్స్ అండ్ గైడ్స్, క్రీడా విభాగం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, కెరీర్ గైడెన్స్, సెల్ఫ్ డిఫన్స్ కార్యక్రమాల అమలును పరిశీలించారు.ప్రతి తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడి, వివిధ విషయాలపై ప్రశ్నలు అడిగి వారి ప్రతిభను పరీక్షించారు.మధ్యాహ్న భోజన పథకం అమలుపై కూడా విద్యార్థుల అభిప్రాయాలను స్వయంగా తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని, కేంరాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు.పాఠశాల నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్న కేంద్ర బృందం, ఉపాధ్యాయుల పనితీరు , పాఠశాల ప్రగతిపై సానుకూలంగా స్పందించింది.ఈ కార్యక్రమంలో ఆర్జేడీ సోమిరెడ్డి, డీఈవో బిక్షపతి, సీఈవో శ్రీనివాసరావు,తహసిల్దార్ దేవాసింగ్, జీసీడీవో అరుంధతి, ఎంఈవో మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రధాని ఆశీర్వాదం తీసుకున్న కొత్త జంట
పాన్ ఇండియా స్టార్స్ విజయ్ దేవరకొండ, రశ్మిక కొత్త జంట ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. రాజస్తాన్‌లో వివాహం చేసుకున్న ఈ కొత్త జంట మోదీని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.

రీల్

## 'స్పిరిట్' నుంచి మాసివ్ అప్డేట్.. ఊహించని లుక్‌లో వివేక్ ఒబెరాయ్




పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ అవైటెడ్ చిత్రాల్లో సెన్సేషనల్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగ కలయికలో చేస్తున్న భారీ యాక్షన్ చిత్రం స్పిరిట్ (Spirit) కూడా ఒకటి. ఇక ఈ సినిమా నుంచి వస్తున్న ప్రతీ అప్డేట్ కూడా ఒక బ్లాస్ట్ కాగా ఈ సినిమా నుంచి నేడు ఓ క్రెజి అప్డేట్‌ని అందిస్తున్నట్టు కన్ఫర్మ్ చేశారు. ఇక ఈ సాయంత్రం 5 గంటలకి ఈ అప్డేట్ వచ్చేసింది. ఈ సినిమాలో బాలీవుడ్ ప్రముఖ నటుడు వివేక్ ఒబెరాయ్ నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇక తనపై ఒక ఊహించిన లుక్ ని మేకర్స్ వదిలారు. మోస్ట్ పవర్ఫుల్ గా వివేక్ ఒబెరాయ్ ఇందులో కట్టి పట్టుకొని కనిపిస్తుండగా తన హెయిర్ స్టైల్ గాని మీస కట్టు చూస్తుంటే ఈ సినిమాలో తన రోల్ ఏ లెవెల్లో ఉంటుందో అర్ధం అవుతుంది. అసలు రామ్ చరణ్ వినయ విధేయ రామ సినిమాలో చూసిన వివేక్ ఇత నేనా అనే లెవల్లో తన మేకోవర్ ని మార్చేశారు సందీప్. దీనితో ఈ క్రేజీ పోస్టర్ వైరల్ గా మారింది. ఇక ఈ చిత్రంకి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తుండగా భద్రకాళి పిక్చర్స్ మరియు టీ సిరీస్ వారు నిర్మాణం వహిస్తున్నారు.

## 'ఉస్తాద్ భగత్ సింగ్' కొత్త పోస్టర్ రిలీజ్



పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూ పొందుతోన్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంపై అంచనాలు భారీస్థాయిలో ఉన్నాయి. ఇప్పుడు ఆ అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్ళేలా కొత్త పోస్టర్ విడుదలైంది. పవన్ కళ్యాణ్ హ్యాట్ ధరించి స్టైలిష్‌గా కనిపిస్తున్న పోస్టర్, సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. విడుదలైన తక్షణమే పోస్టర్ వైరల్‌గా మారింది. అభిమానులు, సినీ ప్రియులు పవన్ కళ్యాణ్ ఈ లుక్‌కి ఫిదా అవుతున్నారు. ఈ భారీ స్పందన మరోసారి ఈ చిత్రంపై ఉన్న అపారమైన క్రేజ్‌ను నిరూపించింది. 'ఉస్తాద్ భగత్ సింగ్' నుంచి వి దుదలైన ప్రతి కంటెంట్కు అద్భుతమైన స్పందన లభిస్తోంది. ప్రచార చిత్రాలు సంచలనంగా మారి, అన్ని సామాజిక మాధ్యమాల్లో ట్రెండ్ అవుతూ భారీ బజ్ సృష్టించాయి. 'దేఖ్ లేంగే సాలా', 'ఆరా ఆఫ్ ఉస్తాద్' పాటలు చార్ట్ బస్టర్‌లో ట్రెండింగ్ గా నిలిచాయి. పవన్ కళ్యాణ్ స్టైల్, స్క్రీన్ ప్రెజెన్స్కు విశేష ప్రశంసలు లభిస్తున్నాయి. ప్రతి పాట పవర్ స్టార్ ఆరాను మరింతగా ఆవిష్కరిస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది.ఈ ఉత్సాహాన్ని మరింత పెం చుతూ, త్వరలోనే చిత్రానికి సంబంధించిన ప వర్ప్యాక్డ్ 40 సెకన్ల గ్లింప్స్ను విడుదల చేయడానికి నిర్మాతలు సిద్ధమవుతున్నారు. ఈ ప్రత్యేక వీడియో ద్వారా చిత్రంలోని స్థాయి, తీవ్రత, మాస్ ఎలిమెంట్స్‌ను ప్రేక్షకులకు చూపించనున్నారు. గతంలో 'గబ్బర్ సింగ్'తో సంచలనాలు సృష్టించిన బ్లాక్‌బాస్టర్ దర్శకు డు హరీష్ శంకర్, 'ఉస్తాద్ భగత్ సి ంగ్'లో పవన్ కళ్యాణ్ను మునుపెన్నడూ చూడని మాస్ అవతార్లో చూపించడానికి శాయశక్తులా కృషి చేస్తున్నారు. అన్ని అ ంశాల మేళవింపుతో సంపూర్ణ వినోదభరిత చిత్రంగా ఇది రూపుదిద్దుకుంటోంది. దేవి శ్రీ ప్రసాద్ తన సంగీతంతో చిత్రానికి మరింత హై వోల్టేజ్ ఎనర్జీని అందిస్తున్నారు.'ఉస్తాద్ భ గత్ సింగ్' చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ ప తాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమ ంచిలి ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ చి త్రం మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. పవన్ క ళ్యాణ్ సరసన శ్రీలీల, రాశిఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. తమిళ నటుడు పార్థిబన్ పాత్రను పోషిస్తున్నారు.ఈ చి త్రానికి కథనం: కె. దశరథ్, రమేష్ రెడ్డి,రచనా సహకారం: ప్రవీణ్ వ‌ర్మ, చంద్ర మోహన్, కూర్పు: కార్తిక శ్రీనివాస్,కళ: ప్రొద్యూసర్లు: ఆర్. చంద్రశేఖర్, హరీష్ పై, ఫైట్స్: రామ్‌లక్ష్మ ణ్, నబకాంత్, పృథ్వీ.

## 'సంక్రాంతిని' టార్గెట్ చేసిన అనిల్ రావిపూడి

వరుసగా తొమ్మిది బాక్సాఫీస్ విజయాలతో అదరగొట్టిన అనిల్ రావిపూడి ఈ సంక్రాంతికి వచ్చిన 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమాతో తో ఆల్ టైమ్ రీజినల్ ఇండస్ట్రీ హిట్ అందిస్తూ బిగ్గెస్ట్ సక్సెస్‌ని నమోదు చేసుకున్నారు. ఇప్పుడు ఆయన కొత్త ప్రాజెక్టులతో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ హీరోలుగా నటించనున్నారు. ఎఫ్ 2,ఎఫ్ 3, సంక్రాంతికి వస్తున్నం వంటి బ్లాక్‌బాస్టర్ వినోదాత్మక చిత్రాల తర్వాత అనిల్ రావిపూడి వెంకటేష్‌తో కలిసి చేస్తున్న ఐదవ చిత్రం కావడం విశేషం. ఇటీవలే మనశంకర్ వరప్రసాద్ గారులో అతిథి పాత్రలో వెంకటేష్ అదరగొట్టారు. అలాగే సంచలనాత్మక బ్లాక్‌బాస్టర్ పటాస్ తర్వాత కళ్యాణ్ రామ్‌తో అనిల్ రావిపూడి రెండవ



చిత్రం అవుతుంది. దర్శకుడు అనిల్ రావిపూడి దగ్గుబాటి, నందమూరి కుటుంబాల నుంచి వచ్చిన స్టార్స్‌ని కలిపి ఈ కొత్త చిత్రాన్ని ఒక క్లీన్, టిపికల్ అనిల్ ఎంటర్‌టైనర్‌గా అందరికీ కనెక్ట్ అయ్యే కథాంశంతో రూపొందిస్తున్నారు. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులతో కనెక్ట్ అయ్యే కంప్లీట్ ఎంటర్టైనర్‌గా ఉండబోతుంది. అనిల్ రావిపూడి ట్రేడ్‌మార్క్ స్టయిల్, హ్యూమర్, ఎమోషన్స్, ఎంటర్టైమెంట్‌తో సంక్రాంతికి ఫెస్టివ్ ట్రీట్‌గా నిలవనుంది.ఈ చిత్రం ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ దశలో ఉంది, ప్రాజెక్ట్ చుట్టూ ఉన్న భారీ అంచనాలను తగ్గట్టుగా దర్శకుడు స్క్రిప్ట్‌ను జాగ్రత్తగా మెరుగుపరుస్తున్నాడు. సాంకేతిక బృందం గురించి వివరాలు, ఇతర నటీనటుల వివరాలు త్వరలో తెలియజేస్తారు. ఇద్దరు స్టార్ హీరోలు, వరుస విజయాలతో దూసుకుపోతున్న దర్శకుడు కలిసే ఈ సినిమా ఇప్పటికే టాలీవుడ్‌లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టులలో ఒకటిగా నిలుస్తోంది. ఈ చిత్రం 2027 సంక్రాంతికి విడుదల కానుంది.

## సుహాసిని ప్రధాన పాత్రలో 'ఓ మాట అనుకుందామా'



మాస్టర్ కనిష్క్ మహాబలాహ్ సమర్పణలో శ్రీ శుభకర క్రియేషన్స్ బ్యానర్ రూపుదిద్దుకుంటున్న లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ చిత్రం 'ఓ మాట అనుకుందామా!'. సుహాసిని , వినోద్ కుమార్, ఇంద్రజ కీ రోల్ ప్లే చేస్తున్నారు. శ్రీనివాస్ అనంతనేని, మోనికా మిశ్రా హీరో హీరోయిన్‌లు కాగా, శుభలేఖ సుధాకర్, కార్తికేయ దేవ్, అజీజ్ ఖాన్, అన్నపూర్ణమ్మ మిగతా పాత్రలు పోషిస్తున్నారు. భీమ్జీ కథ, దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రానికి పెంటి నాగరాజు, పెంటి నీరజ్ సందీప్ నిర్మాతలు. తాజాగా ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్, టైటిల్ లుక్ గ్లింప్స్‌ను సుహాసిని మణిరత్నం, వినోద్ కుమార్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఫస్ట్ లుక్ విడుదల అనంతరం సుహాసిని మణిరత్నం, వినోద్ కుమార్ మాట్లాడుతూ.. 'ఓ మాట అనుకుందామా!' సినిమాలో చాలా మంచి పాత్రలు పోషిస్తున్నామని, ఫస్ట్ లుక్, టైటిల్ గ్లింప్స్ చాలా బాగున్నాయని అన్నారు. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నామన్నారు. దర్శకుడు భీమ్జీ మాట్లాడుతూ... ముందుగా ఫస్ట్ లుక్ పోస్టర్, గ్లింప్స్ విడుదల చేసిన సీనియర్ నటీనటులు సుహాసిని మేడమ్‌కు, వినోద్ కుమార్‌కు ధన్యవాదాలు. ఈ సినిమాలో వారి పాత్రలు చాలా కీలకంగా ఉంటాయి. శ్రీనివాస్ అనంతనేని, మోనికా మిశ్రాల పాత్రలు అందరినీ కట్టిపడేస్తాయి. ఒక సరికొత్త ప్రేమకథని ప్రేక్షకులకు ముందుకు తీసుకురాబోతున్నాం. ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా ఈ సినిమా ఉంటుందని చెప్పారు . నిర్మాతలు పెంటి నాగరాజు, పెంటి నీరజ్ సందీప్ మాట్లాడుతూ.. భీమ్జీ అద్భుతమైన కథతో 'ఓ మాట అనుకుందామా!' చిత్రాన్ని రూపొందిస్తున్నారు. మాకు కథ ఎంతగానో నచ్చింది. ఇందులో సీనియర్ నటులెందరో నటిస్తున్నారు. ఫస్ట్ లుక్ విడుదల చేసిన సుహాసిని గారికి, వినోద్ కుమార్ గారికి మా టీమ్ తరపున ధన్యవాదాలు తెలియజేస్తు న్నాం. త్వరలోనే టీజర్‌తో వస్తాం. మా బ్యానర్ నుంచి ఒక మంచి చిత్రాన్ని ప్రేక్షకులకు ఇవ్వబోతున్నందుకు సంతోషంగా ఉన్నామని తెలిపారు.

## తొమ్మిది దేశాల టాప్ మ్యూజిక్‌లో 'ఆయా షేర్' పాట ట్రెండింగ్

నాని హీరో గా తెరకెక్కుతున్న తాజా చిత్రం ప్యారడైజ్. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం నుంచి ఇటీవల విడుదలైన ఆయా షేర్ అనే పాట ఇప్పుడు ఏకంగా తొమ్మిది దేశాల మ్యూజిక్ ఆల్బమ్‌లో ట్రెండింగ్‌లో ఉంది. ఎస్ఎల్వీ సినిమాస్ బ్యానర్ సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ ర విచందర్ సంగీతం అందించారు. వి డుదలైన కొద్దిసేపటికే ఆయా షేర్ ప్ర పంచవ్యాప్తంగా ట్రెండ్ అవుతూ భారీ రెస్పాన్స్ అందుకుంది. ఈ పాట యూట్యూబ్ గ్లోబల్ చా ర్ట్స్‌లో 9 దేశాల్లో ట్రెండింగ్‌లో నిలిచింది. భార త్, యూఏఈలో నంబర్ 1 స్థానాన్ని దక్కించుకోగా, యూకే, ఆస్ట్రేలియా, సింగపూర్, కె నడా, సౌదీ అరేబియా, అమెరికా, న్యూజిలా ండ్ వంటి దేశాల్లో కూడా అద్భుతమైన ర్యాం కులు సాధించింది. ఒక తెలుగు పాటకు ఈ స్థా యి అంతర్జాతీయ ఆదరణ రావడం విశేషం. ఈ సాంగ్ లో రా ఎనర్జీ, నాని స్క్రీన్ ప్రెజెన్స్ అ దిరిపోయింది. ఆయన చేసిన ఐకానిక్ హుక్ స్టెప్ ప్రేక్షకులను అద్భుతంగా ఆకట్టుకుంది. ఫ్లోర్ మూవ్ ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్‌లలో ట్రెండ్ అవుతూ ప్రపంచవ్యాప్తంగా అభిమానులను అలరి స్తోం ది.ఆయా షేర్ విజయంతో ది పారడైస్ సినిమా ప్రమోషన్స్ ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సాంగ్ ఇప్పటికే దేశాల్ని దాటి అలరించడంతో ది ప్యారడైజ్ పై అంచనాలు నెక్స్ట్ లెవల్‌కి చేరుకున్నాయి.



## ఓవర్సీస్ డిస్ట్రిబ్యూషన్‌లోకి హోంబాలే ఫిలింస్

కేజీఎఫ్ చాప్టర్ 1, కేజీఎఫ్ చాప్టర్ 2, కాంతార, కాంతార చాప్టర్ 1, సలార్, మహావతార్ నరసింహ వంటి ల్యాండ్‌మార్క్ బ్లాక్బస్టర్లతో భారతీయ సినిమాను రీడిఫైన్ చేసిన తర్వాత హోంబాలే ఫిలమ్స్ ఓవర్సీస్ డిస్ట్రిబ్యూషన్లోకి అధికారికంగా ప్రవేశించినట్లు ప్రకటించింది.భారతీయ సినిమాను ప్రపంచ వ్యాప్తంగా మరింత విస్తృత ప్రేక్షకులకు చేరవేయాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకుంది. భాషలు, సంస్కృతులను దాటి ప్రేక్షకుల హృదయాలను తాకే భారీ చిత్రాలను నిర్మించిన అనుభవంతో, ఇప్పుడు హోంబలే ఫిలమ్స్ అంతర్జాతీయ స్థాయిలో డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ను నిర్మించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ ప్రయత్నం హోంబలే ఫిలమ్స్ నిర్మించిన సినిమాలకు మాత్రమే పరిమితం కాదని సంస్థ స్పష్టం చేసింది. భారతదేశంలోని ఇతర దర్శకులు, నిర్మాణ సంస్థలతో కలిసి పని చేసి, విభిన్నమైన భారతీయ కథలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు చేరవేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఓవర్సీస్ డిస్ట్రిబ్యూషన్లోకి అడుగుపెట్టడం ద్వారా, భారతీయ సినిమాకు గ్లోబల్ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకురావాలనే తన విజన్ ను హోంబలే ఫిలమ్స్ మరింత బలోపేతం చేస్తోంది. ప్రపంచంలోని ప్రతి మూలలో ఉన్న ప్రేక్షకులకు భారతీయ కథలను మరింత చేరువ చేయడమే ఈ కొత్త అడుగు వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం అని సంస్థ ప్రతినిధులు తెలిపారు.



## జెసిహెచ్‌ఎస్‌ఎల్ డైరీని ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జర్నలిస్టు కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్(జెసిహెచ్‌ఎస్‌ఎల్) రూపొందించిన 2026 సంవత్సర డైరీని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం సచివాలయంలోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. 1960లో స్థాపించబడిన ఈ చారిత్రాత్మక సొసైటీ తరపున సభ్యుల వివరాలు, కాలనీల చరిత్ర, మీడియా రంగానికి సంబంధించిన కీలక సమాచారంతో కూడిన డైరీని తొలిసారిగా రూపొందించినట్లు సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మాండబేరి గోపరాజు మంత్రికి వివరించారు. సొసైటీ కార్యకలాపాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా ఈ డైరీ రూపొందించామని తెలిపారు. ఈ సందర్భంగా మేనేజింగ్ కమిటీ సభ్యులు మంత్రిని శాలువాలతో సత్కరించారు. మంత్రి సొసైటీకి, సభ్యులకు అభినందనలు తెలుపుతూ, జర్నలిస్టుల సంక్షేమానికి సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మిక్కిలినేని రవీంద్రబాబు, వైస్ ప్రెసిడెంట్ మసాదే లక్ష్మీనారాయణ, జాయింట్ సెక్రటరీ డా.చల్లా భాగ్యలక్ష్మి, ట్రెజరర్ భీమగాని మహేష్, డైరెక్టర్లు డి.కమలాకరాచార్య, ఎం.ఎస్.హెచ్. హాష్మీ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థపై సమగ్ర అధ్యయనం చేయాలి

### టీచర్లకు జీతాలు ఎక్కువగా ఉన్నాయనే అంశాన్ని చేర్చడం అత్యంత విడ్డూరం : ఎస్‌టియు టిఎస్


**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ విద్యా కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన 'ఎడ్యుకేషన్ పాలసీ ఫర్ తెలంగాణ 2026' నివేదికలో టీచర్లకు జీతాలు ఎక్కువగా ఉన్నాయనే అంశాన్ని చేర్చడం అత్యంత విడ్డూరమని స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (ఎస్‌టియు టిఎస్) రాష్ట్ర అధ్యక్షులు జి.సదానందం గౌడ్, ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ అన్నారు. టీచర్లకు ఎక్కువ జీతాలు ఉన్నాయనడం ఉపాధ్యాయులను మనోవేదనకు గురిచేస్తోందని, వారి వృత్తి గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నదని వారు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమాజంలో ఉపాధ్యాయులపై తప్పుడు సంకేతాలు వెళ్ళే ప్రమాదం ఉందన్నారు. భారతదేశంలో పలు రాష్ట్రాలతో పాటు, వివిధ దేశాలలో ఉపాధ్యాయుల వేతనాలను పోలిస్తే తెలంగాణ రాష్ట్రం కంటే ఎక్కువగా ఉన్నాయని వారు గుర్తు చేశారు. విద్యా కమిషన్ తన పరిధి దాటి, ఈ విధంగా ప్రస్తావించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలోని విద్యా వ్యవస్థపై సమగ్ర అధ్యయనం చేసి, పాఠశాల ల పరిస్థితులు, విద్యా ప్రమాణాల పెంపు, విద్యా రంగ పురోగతిపై ప్రభుత్వానికి మంచి నివేదిక అందిస్తారని ఆశించామని, కానీ ఉపాధ్యాయుల జీతభత్యాలు, ఉపాధ్యాయ నియామక అర్హతలు, పదోన్నతులు వంటి అంశాలను ప్రతికూలంగా ప్రస్తావించడం దురదృష్టకరమన్నారు. వేతనాల నిర్ణయం అనేది నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల ఆధారంగా శాస్త్రీయ పద్ధతిలో 'పే రివిజన్ కమిషన్' (పి.ఆర్.సి)ల పరిధిలో ఉండే అంశమని, ప్రస్తుత పరిస్థితుల్లో దాదాపు మూడేళ్ళుగా పి.ఆర్.సి, నాలుగు డిఎలు, పెండింగ్ బిల్లులు లేక ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు.

ఈ నేపథ్యంలో విద్యా కమిషన్ వ్యాఖ్యలు ఉపాధ్యాయ లోకాన్ని విస్మయానికి గురి చేస్తుందని, ఉపాధ్యాయుల గౌరవం, మనోభావాలను కాపాడే విధంగా ప్రభుత్వం నివేదికలోని ఆ వ్యాఖ్యలను తొలగించాలని వారు డిమాండ్ చేశారు.

## కామ్రేడ్ నల్లకన్నుకు రజనీకాంత్ నివాళి



**చెన్నై :** ప్రముఖ సినీనటుడు రజనీకాంత్ చెన్నైలోని టి నగర్‌లోని గురువారం నాడు సిపిఐ నాయకుడు ఆర్ నల్లకన్నుకు కడసారి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రజనీకాంత్ విలేకరులతో మాట్లాడుతూ, నల్లకన్ను తన జీవితాంతం నిజాయితీ, నిరాడంబరతతో నిలబడ్డారని అన్నారు. గతంలో చాలా మంది గొప్ప నాయకులను తాను వ్యక్తిగతంగా చూడకపోయినా, వారి లక్షణాలు నల్లకన్నులో ప్రతిబింబిస్తున్నాయని ఆయన అన్నారు. 'నేను ఒమాందురార్, అరిజ్ఞార్ అన్నా, కామరాజర్ లేదా కక్కన్‌లను చూడలేదు. కానీ వారందరిని కలిపి కామ్రేడ్ నల్లకన్నులో చూశాను. మంచివాడు, నిజాయితీపరుడైన వ్యక్తికి గౌరవ, మర్యాద తానంతట తానుగా ఎలా వస్తుందో తెలిసేందుకు నల్లకన్ను ఒక ఉదాహరణ. ఆయన గొప్ప వ్యక్తి. కామ్రేడ్ నల్లకన్నుకు నా హృదయ పూర్వక సంతాపం, నివాళి' అని రజనీకాంత్ అన్నారు. కాగా గురువారం రాత్రి వరకు నల్లకన్ను అంతిమయాత్ర సాగింది. రోడ్డుపొడవునా ప్రజలు పెద్ద ఎత్తున తమ ప్రియతమ నాయకుడికి నివాళులర్పించారు. మద్రాస్ మెడికల్ కాలేజీలో నల్లకన్ను భౌతికకాయాన్ని ఆయన కుటుంబసభ్యులతో కలిసి సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శివర్గ సభ్యులు రామకృష్ణ పాండ మెడికోల వైద్య పరిశోధనల నిమిత్తం డీన్‌కు అందజేశారు.





నల్లకన్ను భౌతికకాయాన్ని మద్రాస్ మెడికల్ కాలేజీకి అందజేసిన డి.రాజా, నల్లకన్ను కుటుంబ సభ్యులు

## అల్పాహారం (మొదటి పేజీ తరువాయి)

అంగన్‌వాడి భవనాల నిర్మాణం, అంగన్‌వాడి కేంద్రాలకు ఉచిత విద్య సరఫరా, అంగన్‌వాడి కేంద్రాల హాజరు శాతం, ప్రీస్కూల్ యాక్టివిటీ, మిషన్ శక్తి, మిషన్ వాత్సల్య తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ బాల్య వివాహాలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యమని, ఇందులో భాగంగానే జిల్లాల వారీగా ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగుతున్నాయని, వాటి వేగాన్ని మరింత పెంచాలని అధికారులను ఆదేశించారు. ములుగు జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద అంగన్‌వాడగి చిన్నారులకు రోజుకు 100 ఎంఎల్ విజయ పాలు సరఫరా చేస్తున్నామని, కౌమార బాలికల్లో రక్తహీనత తగ్గించేందుకు ఆదివాసీలు అధికంగా ఉన్న మూడు జిల్లాల్లో పల్లి, చిరుధాన్యాల చిక్కిలను అందిస్తున్నామని, ఈ రెండు కార్యక్రమాలు సానుకూల ఫలితాలను ఇస్తున్నాయని, ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించే అంశంపై సమగ్ర నివేదికను అధికారులు సమర్పించాలని దేశించారు. అంగన్‌వాడి భవనాల నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. 2199 అంగన్‌వాడి భవనాలను మంజూ రు చేయగా, ఇప్పటి వరకు కేవలం 500 భవనాలు మాత్రమే పూర్తయ్యాయని, మిగిలిన భవనాలను త్వరలో పూర్తి చేయాలని ఆదేశించారు. 'సాక్ష్యం అంగన్‌వాడి' ద్వారా రాష్ట్రంలోని అంగన్‌వాడి కేంద్రాల్లో పోషకాహారం, ప్రీస్కూల్ విద్య, పరిశుభ్రమైన, సానుకూల వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 'అమ్మ మాట అంగన్‌వాడి బాట' అనే నినాదంతో కార్యక్రమాలు ప్రారంభించామని, ఫలితంగా అంగన్‌వాడి కేంద్రాలకు చిన్నారుల హాజరు శాతం గణనీయంగా పెరిగిందన్నారు. తెలంగాణను పోషకలోప రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రత్యేక పోషకాహార కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. అంగన్‌వాడి కేంద్రాలు లేనిచోట, మొబైల్ అంగన్‌వాడి సేవలను ప్రారంభిస్తున్నామన్నారు. మిషన్ వాత్సల్య కింద బాలల రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని, మిషన్ శక్తి ద్వారా మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.

## అమానవీయ చర్య

(మొదటి పేజీ తరువాయి)

బాధితులను పరామర్శించారు. జరిగిన ఘటన గురించి తెలుసుకున్నారు. పేదలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఏ ప్రాంతం నుంచి వచ్చారు, ఎంత కాలంగా నివాసం ఉంటున్నారు, కుటుంబ పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్న కూనంనేని బాధితులకు కనీస అవకాశం ఇవ్వకుండా ఇలా వ్యవహరించడం అత్యంత బాధాకరమన్నారు. బతుకుదెరువు కోసం సుదూర ప్రాంతాల నుంచి ఖమ్మం వచ్చి తలదాచుకునేందుకు భూదాన్ భూముల్లో గుడిసెలు వేసుకోవడం నేరమా అని ఆయన ప్రశ్నించారు. మీరు పాకిస్తానీలు, బంగ్లాదేశ్ వారు కాదు కదా చుట్టు పక్కల వారే కదా అని ఆయన తెలిపారు. వెలుగుమట్లలోనే ఇల్లు ఇల్లు తిరిగి సర్వే చేసి ఒకవేళ అనర్హులు ఉంటే చర్యలు తీసుకుంటే బాగుండేదని అలా కాకుండా భయోత్పాత వాతావరణాన్ని సృష్టించి పిల్లలు, వృద్దులు, మహిళలు అనేది చూడకుండా వీధినపడేయటం ఏరకమైన ప్రజాస్వామ్యమని కూనంనేని ప్రశ్నించారు. ఒకసారి కాకపోతే పలుసార్లు సంప్రదింపులు జరపాలని పేదలను సంతృప్తిపరిచి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉందన్నారు. సమస్యకు పరిష్కారం చూపకుండా బాధితులపై నేరం మోపడం అధికారం ఉంది కదా అని ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూదాన్ భూముల్లో ఉన్న పేదలకు పట్టాలు అందజేస్తామని స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి శాసనసభలో ప్రకటించారని కూనంనేని గుర్తు చేశారు. పేద ప్రజలకు కమ్యూనిస్టు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని న్యాయం జరిగే వరకు పేదల పక్షాన పోరాడతామన్నారు. జిల్లాకు చెందిన మంత్రులు ఈ విషయంలో చొరవ చూపి బాధితులకు న్యాయం చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. అధికారులకు సరైన ఆదేశాలు ఇచ్చి అవి అమలు జరిగే విధంగా చూడాలన్నారు. కొందరు కమ్యూనిస్టుల గురించి తెలియక స్వార్థం కోసం విమర్శలు చేస్తున్నారని కూనంనేని తెలిపారు. ఖమ్మం జిల్లాలో సుదీర్ఘ పోరాట చరిత్ర కమ్యూనిస్టులదని వేల మందికి పోరాట ఫలితంగా నివాస స్థలాలు దక్కాయని ఆయన తెలిపారు. నాగార్జున సాగర్ కాలువ కట్టలపై గుడిసెలు వేసిన తర్వాత వారికి ప్రత్యామ్నాయ స్థలం చూపి సంతృప్తి చెందిన తర్వాతే గుడిసెలు తొలగించడం జరిగిందని తెలిపారు. కమ్యూనిస్టు నాయకుడు ఉదయ్‌కుమార్ నగర్ పేరుతో వందలాది మందికి పట్టాలు ఇవ్వడం జరిగిందని సాంబశివరావు గుర్తు చేశారు. ప్రజల పక్షాన పోరాడటం, పేదలకు అండగా నిలవడం మా బాధ్యత అని దానిని ఎవరు గుర్తు చేయాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి పునరావాస కేంద్రంలో కనీస వసతులు కల్పించాలని ఎక్కడ నుంచి తొలగించారో అక్కడే పేదలకు స్థలాలు కేటాయించాలన్నారు. ఉన్నతాధికారులు ఏ లక్ష్యం కోసం ఆభూమి నుంచి పేదలను ఖాళీ చేయించారో వివరించాల్సిన అవసరం కూడా అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, బిజి క్లెమెంట్ తదితరులు పాల్గొన్నారు.

## డిఎంకెలోకి ఒపిఎస్

(మొదటి పేజీ తరువాయి)

ఆయన శుక్రవారం అధికారికంగా చేరడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ సమక్షంలో చెన్నైలో జరిగిన కార్యక్రమంలో ఎపిఎస్‌కు పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. అన్నాడిఎంకెలో కీలక పదవులు నిర్వహించిన పన్నీర్‌సెల్వం, 2022లో పార్టీ అంతర్గత అధికార పోరాటం తర్వాత బహిష్కరణకు గురయ్యారు. ఆ తర్వాత మళ్లీ తన మాతృపార్టీలోకి చేరేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దాంతో చివరకు రాజకీయ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని డిఎంకెలో చేరినట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు తనకుమారుడు పి.రవీంద్రనాథ్ కుమార్, అనుచరులు కూడా డిఎంకెలో చేరడం విశేషం.

**స్టాలిన్ ఆదేశాల మేరకు పని చేస్తానని స్పష్టం**

డిఎంకెలో చేరిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఒపిఎస్, అన్నాడిఎంకె అధినేత ఎడప్పాడి కె. పళనిస్వామిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. 'పార్టీకి భవిష్యత్‌లో ఎలాంటి విజయం దక్కకుండా చేసే పరిస్థితిని పళనిస్వామి సృష్టించారు. ఆయన నిరంకుశుడు, అహంకారి. పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా నాశనం చేశారు' అంటూ మండిపడ్డారు. గతంలో తనకు జరిగిన విషయాల గురించి ఇప్పుడు ఆలోచించడం లేదని, ఇకపై సిఎం స్టాలిన్ ఆదేశాల మేరకు పని చేస్తానని స్పష్టం చేశారు. స్టాలిన్ నాయకత్వంపై ప్రశంసలు కురిపించిన ఒపిఎస్, 'ప్రజల అవసరాలు అర్థం చేసుకుని సంక్షేమ పథకాలు అందిస్తున్న నాయకుడు స్టాలిన్. అందరికీ సమానంగా పాలన అందిస్తున్నారు. రాష్ట్ర అభివృద్ధి, ద్రవిడ సిద్ధాంతాల పరిరక్షణ కోసం డిఎంకె కట్టుబడి ఉంది' అని అన్నారు. ఇకపై తాను కూడా సాధారణ కార్యకర్తగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఇక అసెంబ్లీలో కూడా ఈ రాజకీయ మార్పు ప్రభావం కనిపించింది. ఎపిఎస్ వర్గానికి చెందిన ఎమ్మెల్యే పి.అయ్యప్పన్, స్టాలిన్ మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని కోరుకుంటూ ప్రసంగించారు. ముఖ్యంగా పాఠశాల పిల్లల కోసం అమలు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రశంసిస్తూ, 'తల్లిలా పిల్లలకు ఆహారం అందించే ప్రభుత్వం ఇది' అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో డిఎంకెనే మళ్లీ గెలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అయితే ఈ పరిణామంపై ప్రతిపక్ష నేతలు విమర్శలు చేస్తున్నారు. ముఖ్యంగా ఎన్‌డిఎ మిత్రపక్షమైన అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టివివి ధినకరన్ స్పందిస్తూ, 'ఒపిఎస్‌కు తనకు నచ్చిన కూటమిలో చేరే హక్కు ఉంది. కానీ జయలలితా వారసత్వాన్ని ఈ నిర్ణయానికి కారణంగా చూపడం సమంజసం కాదు' అన్నారు. ఆ వ్యాఖ్యలు జయలలిత అభిమానులకు ఆమోదయోగ్యం కావని స్పష్టం చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com